

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 7

గురువారం 30-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేడు భద్రాద్రి రాముడి కల్యాణం

కల్యాణ శోభ సంతరించుకున్న భద్రాచలం

వైభవంగా సాగిన ఎదుర్కోలు ఉత్సవం

- 5లో

న్యూస్‌రీల్

'రన్'రంగం రె'ఢీ'...



కరోనా నేపథ్యంలో గత నాలుగేళ్లు పలు ఆంక్షల మధ్య జరిగిన ఐపీఎల్‌కు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. శుక్రవారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్‌తో ఐపీఎల్ 16వ సీజన్‌కు తెర లేవనుంది.

- వివరాలు 14లో▶

ట్రోల్ చేస్తే తోలు తీస్తారు!



సోషల్ మీడియాతో పాటు యూట్యూబ్ చానళ్లలో విచ్చలవిడిగా, విచక్షణ మరిచి ట్రోలింగ్ చేసే వారిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లేలా ఉన్న పోస్టులకు సంబంధించి 20 కేసులు నమోదు చేసి ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చారు.

- వివరాలు 9లో▶

గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ షాక్

ఆండ్రాయిడ్ మొబైల్ పరికరాల కేసుకు సంబంధించి టెక్ దిగ్గజం గూగుల్‌కు రూ.1,338 కోట్ల జరిమానా విధిస్తూ ఇచ్చిన తీర్పును ఎన్‌సీఎల్‌ఏటీ సమర్థించింది. - 15లో

'సర్వే'తోనే చాన్స్!

కర్ణాటకలో అనుసరించిన ఫార్ములానే తెలంగాణలో అమలుకు కాంగ్రెస్ నిర్ణయం

ప్రజాక్షేత్రంలో బలం, బలగం ఉన్నవారికే అసెంబ్లీ టికెట్లు

- అక్కడ అధిష్టానం సర్వే చేయించాకే.. 124 మంది అభ్యర్థుల ముందస్తు ప్రకటన
- షెడ్యూల్‌కు ముందే అభ్యర్థులను తేల్చాలని తొలినుంచీ టీకాంగ్రెస్ నేతల డిమాండ్లు
- ఆరు నెలల ముందే ప్రకటించాలన్న కోమటిరెడ్డి.. 50 శాతం అభ్యర్థులు ఖరారైనట్టేనన్న పీసీసీ చీఫ్ రేవంత్
- జాబితాలో సీనియర్లందరికీ చోటు.. సర్వేలో ప్రతికూలంగా వస్తే మాత్రం డౌటే!
- ఇప్పటికే రంగంలోకి దిగిన సునీల్ కనుగోలు టీమ్.. త్వరలోనే అధిష్టానం సర్వేలు
- జూన్‌లో భారీ సభతో ఎన్నికల గోదాలోకి దిగాలని భావిస్తున్న టీపీసీసీ



సాక్షి, హైదరాబాద్: సీనియర్లు.. జూనియర్లు.. ఎవరైనా సరే.. ప్రజాక్షేత్రంలో బలం, బలగం ఉన్నవారికే ఈసారి అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోందా? ముందుగా చెప్పినా, చివరి క్షణంలో ప్రకటించినా 'సర్వే' సూత్రం ఆధారంగానే రేసుగుర్రాలను ఎంపిక చేయనుందా? కర్ణాటకలో అవలంబించిన ఫార్ములానే తెలంగాణలోనూ అమలు చేయాలని నిర్ణయించిందా?.. ఈ ప్రశ్నలకు గాంధీభవన్ వర్గాల నుంచి ఔననే సమాధానమే వస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో సీనియర్లు, ముఖ్య నాయకులుగా గుర్తింపు పొందిన వారంతా ఈసారి కూడా టికెట్ తమకే అన్న ధీమాలో ఉండగా.. మరోవైపు సర్వేలో ప్రతికూల ఫలితం వస్తే మాత్రం 'టికెట్ కట్' అయినట్టే అన్న వాదన కూడా వినిపిస్తోంది. కర్ణాటకలో ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఏకంగా 124 మంది అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్టానం మిగతా 7వ పేజీలో ▶

మోగిన కర్ణాటక ఎన్నికల నగారా

మే10న ఎన్నికలు

రాష్ట్రంలో ఒకే దశలో పోలింగ్

- అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి
- ఓటింగ్ శాతాన్ని పెంచేందుకే బుధవారం పోలింగ్
- వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికకు తొందర పడటం లేదు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్



కర్ణాటకలో మూడు ముక్కలాట!

- బొమ్మై ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని మోదీ ఇమేజ్ మరిపించగలదా?
- బలమైన స్థానిక నాయకత్వం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతుందా?
- కింగ్ మేకర్ నుంచి కింగ్ అవాలన్న జేడీ(ఎస్) ఆశలు ఫలిస్తాయా?

కర్ణాటక ఎన్నికల ముఖచిత్రం

నోటిఫికేషన్ విడుదల: ఏప్రిల్ 13

నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 20

నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 21

ఉపసంహరణకు చివరి తేదీ: ఏప్రిల్ 24

పోలింగ్: మే 10 : ఫలితాలు:మే 13

6 లో

కర్ణాటక ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం

- అక్కడ లోక్‌సభ ఎన్నికల్లోనే పోటీ చేయాలని నిర్ణయం
- కర్ణాటక ఎన్నికలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందం
- బీజేపీ, కాంగ్రెస్, జేడీ (ఎస్) ఎత్తుగడలపై కేసీఆర్ దృష్టి
- జేడీఎస్ ఒంటరిగా పోటీచేస్తే ప్రచారానికి కేసీఆర్!
- ఆ పార్టీతో బీఆర్ఎస్ మైత్రి బంధంపై అస్పష్టత
- ప్రస్తుతానికి మహారాష్ట్ర స్థానిక ఎన్నికలపైనే బీఆర్ఎస్ ఫోకస్



- వివరాలు 7లో

క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు

కేటీఆర్ నోటీసులను లీగల్‌గానే ఎదుర్కొంటాం!

- ఉడుత ఊపులకు భయపడేది లేదు.
- కేబినెట్ నుంచి కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే వరకు పోరాడుతాం...
- లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాల్సిందే.. నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాల్సిందే...
- కేటీఆర్ లీగల్ నోటీసుపై బండి సంజయ్ స్పందన



సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్‌కు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని, ఆయన ఇచ్చానని చెబుతున్న నోటీసును లీగల్‌గానే ఎదుర్కొంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టంచేశారు. తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్షమాపణ చెప్పకపోతే రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ లీగల్ నోటీస్ ఇచ్చినట్లు తాను కూడా పత్రికల్లోనే చూశానని అన్నారు. ఇలాంటి ఉడుత బెదిరింపులకు బెదిరిపోయేది లేదని లీగల్ నోటీసుపై న్యాయపరంగానే పోరాడతామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'జనన, మరణ ధ్రువీకరణ మిగతా 2వ పేజీలో ▶

హిందువులంటే అదానీ, అంబానీలేనా?



బీజేపీకి పేదలు కనిపించరా?: ప్రకాశ్ కారత్

- అదానీ ఆస్తులు రూ.50 వేల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు ఎలా పెరిగాయి?
- మతతత్వ, కార్పొరేట్ అనుకూల బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చాలి
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ పిలుపు
- బీఆర్ఎస్‌తో పొత్తులు కుదిరితే కలిసి పోటీ... లేదంటే విడిగా పోటీచేస్తాం: తమ్మినేని

8 లో

నా రిపోర్టుతోనే డిజిటల్ కరెన్సీ

- గతంలో నేనిచ్చిన రిపోర్టు ఆధారంగానే వాజ్‌పేయి సెల్‌ఫోన్లు తెచ్చారు
- అవినీతి పోవాలంటే 500, 1,000, 2,000 నోట్లను రద్దు చేసి డిజిటల్ కరెన్సీ తేవాలి
- విజన్–2047 రిపోర్టు తయారు చేయాలని ఇటీవలి సమావేశంలో ప్రధాని మోదీకి చెప్పా..
- 25 ఏళ్ల కిందటి నా కృషి వల్లే నేడు హైదరాబాద్ రూపురేఖలు మారాయి
- టీడీపీ 41వ ఆవిర్భావ సభలో చంద్రబాబు

- వివరాలు 5లో▶



వివేకా కేసు విచారణకు నూతన సిట్

- సీబీఐ డీఐజీ చౌరాసియా నేతృత్వంలో ఐదుగురితో సిట్ బృందం
- ఏప్రిల్ 30 లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశం
- రాంసింగ్‌ను తప్పించిన సుప్రీం ధర్మాసనం

- వివరాలు 12లో▶

మే నెలలో ఏఈఈ ఉద్యోగ పరీక్షలు

- రద్దయిన పరీక్షలను మళ్లీ నిర్వహించనున్న టీఎస్‌పీఎస్సీ
- తాజాగా తేదీల ప్రకటన

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



జై శ్రీరాం!

క్లుప్తంగా...

మరోసారి బొగ్గు గనుల వేలం

ఏడో రౌండ్‌లో దేశంలోని 106 గనులు.. అందులో సింగరేణివి 2

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర బొగ్గు, గనుల శాఖ సింగరేణి పరిధిలోని గనులను మరోసారి అమ్మకానికి పెట్టింది. బుధవారం బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారికంగా ఏడో రౌండ్‌కు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈసారి దేశంలోని తెలంగాణతో సహా మరో 8 రాష్ట్రాల్లో ఉన్న 106 బొగ్గు బ్లాకులను వేలం వేయనుంది. ఇందులో సింగరేణికి చెందిన కొత్తగూడెం ఏరియాలోని పెనగడప, మందమర్రి ఏరియాలోని శ్రావణపల్లి బ్లాక్ ఉన్నాయి. గతంలో ఈ బ్లాక్‌ను వేలంలో చేర్చగా పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పటివరకు అన్ని రౌండ్లలోనూ సింగరేణి కంపెనీ వేలంలో పాల్గొనకుండా దూరంగా ఉంటూ వస్తోంది. తాజా రౌండ్‌లో పాల్గొంటుందా? లేదా? అనేది చూడాల్సి ఉంది.

సీఎస్‌కు ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ బాధ్యతలు




సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆమెకు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి వి.శేషాద్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సీఎస్‌గా ఉన్న సోమేశ్‌కుమార్ ఈ శాఖలను పర్యవేక్షించేవారు. కొత్త సీఎస్‌గా శాంతికుమారి బాధ్యతలు తీసుకున్నప్పటికీ ఆ రెండు శాఖల బాధ్యతలు ఆమె తీసుకోలేదు. ఈ నేపథ్యంలోనే సీఎస్‌కు ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎడ్విన్‌ను విడుదల చేయండి

పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ సరఫరా ఆరోపణల కేసులో కింది కోర్టు విడుదల ఉత్తర్వులిచ్చాక ఎడ్విన్ నూన్స్‌పై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయడం చెల్లదని హైకోర్టు వ్యాఖ్యానించింది. గత డిసెంబర్‌లో పోలీస్ కమిషనర్ జారీ చేసిన డిటెన్షన్ ఆర్డర్‌ను ఎడ్విన్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ పుల్లా కార్తీక్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పోలీస్ కమిషనర్ వద్ద ఎడ్విన్ రూ.లక్ష డిపాజిట్ చేయాలని ఆదేశించింది. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలు చేయబోనంటూ రెండు వారాల్లో అఫిడవిట్ ఫైల్ చేయాలని స్పష్టం చేసింది. విచారణను వాయిదా వేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి వాదించారు. ఏడీపీఎస్ కేసుల విచారణ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని, ఏ షరతులను పిటిషనర్ ఉల్లంఘించలేదని తెలిపారు. ఎడ్విన్ నుంచి పోలీసులు డ్రగ్స్ కూడా స్వాధీనం చేసుకోలేదన్నారు. అయినా నగర పోలీస్ కమిషనర్ పిటిషనర్‌పై నిర్బంధ ఉత్తర్వులను జారీ చేశారని చెప్పారు.

'స్వప్నలోక్' ప్రమాదంపై హైకోర్టు విచారణ



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో మార్చి 17న జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన సంఘటనను హైకోర్టు కేసును సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. 20 నుంచి 24 ఏళ్లలోపున్న మృతులంతా ఐదో అంతస్తులోని కాల్ సెంటర్ సిబ్బందే. ఘటనపై పత్రికల్లో ప్రచురితమైన కథనాల ఆధారంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పాలన ముఖ్యకార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, డీజీపీ, హైదరాబాద్ సీపీలను ప్రతివాదులుగా పేర్కొంది.

పేపర్ లీక్‌లో సీఎం, మంత్రుల హస్తం: భానుప్రకాశ్



చంచల్‌గూడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌లో సీఎం, మంత్రుల హస్తం ఉందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ కుంభకోణానికి సంబంధించి ఈనెల 14న యువ మోర్చా టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టింది. ఈ క్రమంలో పోలీసులు భానుప్రకాశ్‌తో పాటు రాజు నేత, శివ చంద్రగిరి, ఆయుష్, అవినాశ్, శివాజీ, రాము యాదవ్, పుల్ల శివ, భరత్‌గౌడ్, పవన్‌రెడ్డి, మన్మథను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో వారికి బెయిల్ మంజూరు కావడంతో బుధవారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు పేపర్ లీక్‌లో ప్రత్యక్ష పాత్ర ఉందని ఆరోపించారు. నిరసన తెలిపితే బోర్డులు పడగొట్టారని అక్రమంగా నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి జైళ్లకు తరలించారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్, కేటీఆర్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో పాటు ఉన్నతాధికారులపై సీబీఐ విచారణ చేపట్టాలని భానుప్రకాశ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పేపర్ లీక్‌లో ఉన్న పెద్దలందరూ ప్రగతిభవన్‌లో ఉన్నారని ఆరోపించారు.

పొరుగింటి పచ్చదనం



తలెత్తుకు నిలబడింది..

మూసీ ఒడ్డున ఉస్మానియా ఆస్పత్రి ఆవరణలోని ఈ చింతచెట్టు వయసు సుమారు 425 సంవత్సరాలపైనే. అయినా నిటారుగా నిలబడింది. వానలు, వరదలెన్ని వచ్చినా కదల్లేదు.. కారణం లోకల్ జాతి కావటమే. ఇక్కడి వాతావరణం, భూమితో పెనవేసుకున్న బలమైన బంధంతో ఇంకా అందరి 'చింత'తీరుస్తోంది. ఈ చెట్టే 1908 నాటి మూసీ వరదల్లో 150 మంది ప్రాణాలు కాపాడింది. ఆ ఏడాది సెప్టెంబర్ 27, 28 తేదీల్లో కుండపోత వానతో మూసీ ఉప్పొంగి తీర ప్రాంతాలను ముంచెత్తగా.. ఈ చెట్టు ఎక్కి కూర్చున్న వారు ప్రాణాలతో బయటపడ్డారు. అందుకే ఈ చెట్టుకు ఏటా సెప్టెంబర్ 28న ఉత్సవాన్ని కూడా నిర్వహిస్తారు.

- రాష్ట్రంలో గ్రీన్‌కవర్ పెరిగినా.. తగ్గిపోతున్న స్థానిక జాతుల చెట్లు
- విదేశాలు, ప్రాంతాలకు చెందిన చెట్లు, మొక్కల విస్తరణ
- వేగంగా పెరగడం, నీటి కొరతను తట్టుకోవడంతో ప్రాధాన్యమిస్తున్న జనం, ప్రభుత్వాలు
- పూలు, పండ్లు వంటివేవీ లేక అలంకరణకే పరిమితం
- వాటి ఆకులను పశువులు, మేకలు కూడా తినని తీరు
- ఇది పర్యావరణానికి చేటు చేస్తుందంటున్న నిపుణులు
- ఇప్పటికే రాష్ట్రమంతటా విషం చిమ్ముతున్న కోనోకార్పస్

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

గత పదేళ్లలో తెలంగాణలో 632 చదరపు కిలోమీటర్ల మేర పచ్చదనం పెరిగింది. దేశంలో ఆంధ్రప్రదేశ్ (647 చ.కి.మీ) తర్వాత పచ్చదనం పెరిగిన రెండో రాష్ట్రం తెలంగాణ అని ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ రిపోర్ట్ తాజాగా వెల్లడించింది. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ పెరుగుతున్న సమయంలో ఇది సంతోషకర పరిణామమే అయినా.. పర్యావరణవేత్తలు, జీవ వైవిధ్య నిపుణులు మాత్రం ఒక అంశంపై పెదవి విరుస్తున్నారు. అదేమిటంటే.. విస్తరిస్తున్న వనాల్లో స్థానిక మొక్కలు లేకపోవడం, ట్రాన్స్‌లొకేషన్ (భారీ వృక్షాలను ఒకచోటి నుంచి మరోచోటికి తరలించడం)లో సక్సెస్ రేటు సగం కూడా లేకపోవటమే. దక్కన్ పీఠభూమి విస్తారమైన ఆయుర్వేద మొక్కల నిలయమని, దేశంలోని జీవవైవిధ్య మండలాల్లో అత్యధిక దిగుబడి, పునరుత్పత్తి కలిగిన పశ్చిమ, తూర్పు కనుమల్లోని మొక్కలు, వృక్షాలు తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా కనిపించే పరిస్థితి ఉండేదని నిపుణులు చెప్తున్నారు. కానీ నేడు ఎక్కడ చూసినా విదేశీ జాతుల మొక్కలకే ప్రాధాన్యమివ్వటం వల్ల జీవవైవిధ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ అంటేనే 'బాగ్ నగర్'.. అంటే ఉద్యాన వనాల నగరం అని అర్థం. అప్పట్లో నగరమంతా పరుచుకున్న మొక్కలు, వృక్షాలన్నీ అన్నీ స్థానిక వెరైటీలే. నగరంలో జాంబాగ్, కుందన్‌బాగ్, సీతారాంబాగ్, బషీర్‌బాగ్, రాంబాగ్, పూల్‌బాగ్, కిషన్‌బాగ్,, మూసారాంబాగ్ ,

'బాగ్'నగర్‌లో.. బాగ్‌లు మాయం..

ఇబ్రహీంబాగ్, బాగ్‌లింగంపల్లిలతోపాటు చింత వనాలతో నిండిన ఇమ్లీబన్, చింతలబస్తీలతో హైదరాబాద్ నగరం ప్రపంచ జీవ వైవిధ్య పటంలో ప్రత్యేకంగా నిలిచేది. తూర్పు, పశ్చిమ కనుమల్లో ఉండే ప్రతిమొక్క, వృక్షం మూసీ పరీవాహకంతోపాటు హైదరాబాద్ నగరంలో కనిపించేవని పర్యావరణవేత్త డాక్టర్ కె.పురుషోత్తం రెడ్డి చెప్తున్నారు. అందులో అత్యధికం ఔషధ గుణాలున్నవేనని.. గండిపేట నీళ్లు, హైదరాబాద్ గాలి తాకగానే మనుషుల్లో మార్పు స్పష్టంగా కనిపించేదని అంటున్నారు. కానీ క్రమంగా జనావాసాలు పెరగడం, కాలనీలు, రోడ్ల విస్తరణ, ప్రభుత్వ, చెరువు భూముల కబ్జాలతో స్థానిక రకాలైన మర్రి, రావి, వేప, చింత, నేరేడు తదితర వృక్షాలన్నీ కనిపించకుండా పోయాయి. వాటి స్థానంలో అందం కోసమంటూ ఇతర ప్రాంతాలు, దేశాలకు చెందిన మొక్కలు, చెట్లను పెంచేశారు. కానీ అవి బలంగా లేక, ఈదురుగాలులకు కూలిపడుతుండటంతో ఏటా ఆస్తి, ప్రాణనష్టం జరుగుతోంది.

హరితహారంలోనూ ఇలాగే..!

➤ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలోనూ విదేశీ జాతుల మొక్కలనే ఎక్కువగా నాటుతున్నారు. స్థానిక జాతులైతే పెరిగేందుకు ఎక్కువ సమయం తీసుకుంటాయని.. వేగంగా పెరిగే విదేశీ జాతులను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఎడారి దేశాల్లో పెరిగే 'కోనోకార్పస్'అనే మొక్కను రాష్ట్రమంతటా నాటారు. పెద్దగా నీటి తడి లేకున్నా పెరిగి, ఏడాదంతా పచ్చగా కనిపించే ఈ చెట్లు ఇప్పుడు అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోనూ కనిపిస్తున్నాయి. అయితే కోనోకార్పస్ పూల నుంచి వెలువడే పుప్పొడి వల్ల అలర్జీ, శ్వాసకోశ, ఆస్తమా వంటి సమస్యలు వస్తున్నాయని పరిశోధనల్లో తేలింది. వాటి వేర్లు లోతుగా పాతుకుపోతూ.. మధ్యలో అడ్డు వచ్చే కమ్యూనికేషన్ కేబుళ్లు, డ్రైనేజీ లైన్లు, మంచినీటి వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయని.. సమీపంలో ఇతర చెట్లు పెరగకుండా చేస్తున్నాయని గుర్తించారు. ఈ చెట్ల ఆకులను స్థానిక జంతువులేవీ తినవు కూడా. దీంతో ఇప్పటికే పలు దేశాలు, రాష్ట్రాలు కోనోకార్పస్ నాటడాన్ని నిషేధించాయి.

ప్రధాన నగరాల్లో పచ్చదనం తీరు..

నగరం	గ్రీన్‌కవర్(చ.కి.మీ)	ర్యాంకు
ఢిల్లీ	194.24	1
ముంబై	110.77	2
బెంగళూరు	89.20	3
హైదరాబాద్	81.81	4
చెన్నై	22.70	5

(ఇండియన్ ఫారెస్ట్ సర్వే రిపోర్ట్ 2021 ప్రకారం)



పచ్చదనం వెనక.. పచ్చి విషం.. హరితహారంలో అంతటా నాటిన కోనోకార్పస్

ట్రాన్స్‌లొకేషన్.. ట్రాజెడీయే..



రహదారుల విస్తరణ సమయంలో భారీ వృక్షాలను ట్రాన్స్‌లొకేషన్ చేస్తున్నా.. తదనంతర జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్ల ఆశించిన ఫలితం రావటం లేదు. అదే విధంగా వేసవి కాలంలో ట్రాన్స్‌లొకేషన్ చేయొద్దు. అయినా ఇదే సమయంలో చేస్తున్నారు. ట్రాన్స్‌లొకేషన్‌కు సంబంధించి త్వరలోనే ఓ ప్రొటోకాల్ విడుదల చేయనున్నాం.

– ఉదయకృష్ణ, వట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

ఇక్కడి ప్రతి మొక్కలో ఔషధ గుణాలే..



దక్కన్ పీఠభూమిలో పెరిగే ప్రతి మొక్క జీవ వైవిధ్యానికి పనికి వచ్చేదే. ప్రకృతి వర ప్రసాదాన్ని మనం రక్షించుకోలేకపోతున్నాం. ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడ్డ వృక్షాలను తొలగించి.. వాటి స్థానంలో కాత, పూత లేని విదేశీ మొక్కలను నాటుతున్నారు. ఇది ఏ మాత్రం సరికాదు. తూర్పు, పశ్చిమ కనుమల్లో కనుగొన్న అపార వృక్ష సంపదను ప్రత్యేక విభాగాలతో సంరక్షించాల్సి ఉంది.

– డాక్టర్ కె.తులసీరావు, జీవ వైవిధ్య నిపుణుడు

క్షమాపణ చెప్పే ప్రసక్తే లే

▶ మొదటి పేజీ తరువాయి

పత్రాలు జారీ స్కాం మొదలు పేపర్ లీకేజ్ దాకా.. నాలాలో పడి పిల్లలు చనిపోయిన దగ్గర నుండి కుక్కల దాడిలో పసిపిల్లల చావు వరకు మున్సిపాలిటీ శాఖ మంత్రే బాధ్యత వహించి రాజీనామా చేయాలి'అని డిమాండ్ చేశారు.

నీ పరువు సరే.. వారి భవిష్యత్‌కు మూల్యమేంటి

కేటీఆర్ పరువు విలువ రూ.100 కోట్లయితే తెలంగాణలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న 30 లక్షల మంది యువత భవిష్యత్ వారి పాలనలో ప్రశ్నార్థమైందని సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. మరి వారికెంత మూల్యం చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పరువు నష్టం పేరుతో కూడా డబ్బులు సంపాదించాలనుకోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. 'సిట్ విచారణ అంశాలు అసలు కేటీఆర్‌కి ఎలా లీక్ అవుతున్నాయి. మొదట ఇద్దరు మాత్రమే నిందితులన్న కేటీఆర్ పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతుంటే ఎందుకు నోరిప్పడం లేదు? ఇద్దరు మాత్రమే దోషులంటూ కేసును నీరుగార్చేందుకు యత్నించిన కేటీఆర్‌పై ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టలేదో పోలీసులు సమాధానం చెప్పాలి. ప్రశ్నపత్రాల లీకేజీ విచారణను ప్రభావితం చేసే విధంగా మాట్లాడుతున్న ఆయనకు సిట్ ఎందుకు నోటీసులు ఇవ్వలేదో జవాబివ్వకుండా తప్పిదాలను ప్రశ్నిస్తున్న మాపై చర్యలు తీసుకుంటామంటూ బెదిరిస్తారా? సిట్ బెదిరింపులకు బెదిరేది లేదు'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కేటీఆర్‌కు వందల కోట్లు ఎలా వచ్చాయ్?

తెలంగాణ ఉద్యమానికి ముందు అమెరికాలో ఉద్యోగ స్థాయి నుంచి నేడు వందల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. 'పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగే వరకు,. కేటీఆర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం. ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించే దాకా, నష్టపోయిన నిరుద్యోగులకు రూ. లక్ష చొప్పన పరిహారం అందించే వరకు బీజేపీ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం'అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు..'ప్రధాని స్థాయిని, వయసును కూడా చూడకుండా విమర్శించడం కేసీఆర్ కొడుకు కుసంస్కారానికి నిదర్శనం. ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని ఒక సాధారణ అంశంగా మలిచేందుకు మంత్రులంతా ప్రయత్నిస్తున్నారు'అని మండిపడ్డారు. 'కేటీఆర్ ఓ ఒక స్వయం ప్రకటిత మేధావి. నాలుగు ఇంగ్లిష్ ముక్కలు మాట్లాడగానే అపర జ్ఞానిలా భావిస్తున్నాడు. ప్రశ్నిస్తే తట్టుకోలేని మూర్ఖుడు. పాలనలోని తప్పులను ఎత్తిచూపితే సహించలేని అజ్ఞాని'అని సంజయ్ ధ్వజమెత్తారు.

డేటా లీకు మూలం 'పునరుద్ధరణే'

- దేటా చౌర్యం కేసులో సైబరాబాద్ పోలీసుల పురోగతి
- ఇటీవల రక్షణ శాఖ, కేంద్ర సంస్థల సైట్ల రీడెవలప్
- నిర్ధారణ కోసం టెలికం, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు నోటీసులు
- త్వరలోనే మరికొందరి అరెస్టు!



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 16.8 కోట్ల మంది డేటా లీకు కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రక్షణ శాఖతో పాటు టెలికం, విద్యుత్, ఇంధనం వంటి కీలకమైన ప్రభుత్వ సంస్థల వ్యక్తిగత సమాచారం కూడా తస్కరణకు గురికావటాన్ని సైబరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచే ఈ కీలక సమాచారం బహిర్గతమైనట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. నిందితుల రెండో రోజు కస్టడీ విచారణపూర్తిగా ప్రభుత్వ సంస్థల డేటా లీకు మూలాలను కనుక్కొనే దిశలోనే సాగింది.

వెబ్‌సైట్ల పునరుద్ధరణ నుంచే లీకు..

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రక్షణ శాఖతో పాటు పలు కేంద్ర సంస్థలకు చెందిన వెబ్‌సైట్లను పునరుద్ధరణ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. సాధారణంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు డెబిట్, క్రెడిట్ కార్డుల నిర్వహణ సేవలను థర్డ్ పార్టీలకు అందిస్తుంటాయి. ఇదే తరహాలో కేంద్ర సంస్థల వెబ్‌సైట్ల రీడెవలప్ సేవలు కూడా ఆయా యాజమాన్యలు ఐటీ కంపెనీలకు అందించాయి. నోయిడా, ముంబైకి చెందిన ఔట్‌సోర్సింగ్ కంపెనీల నుంచే ఈ వ్యక్తిగత సమాచారం బహిర్గతమైందని సైబరాబాద్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

సర్వీస్ ప్రొవైడర్లకు నోటీసులు..

నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న 12 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, వెబ్‌సైట్లను సైబరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీసు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ (టీఎస్‌పీసీసీ) విశ్లేషించి.. పలు కీలక సమాచారాన్ని గుర్తించినట్లు తెలిసింది. పలు అనుమానిత ఈ–మెయిల్స్, వెబ్‌పేజీలను వినియోగించే చిరునామా యూనిఫాం రిసోర్స్ లోకేటర్ (యూఆర్ఎల్)లను గుర్తించారు. వీటిని నిర్ధారించేందుకు టెలికం సర్వీస్ ప్రొవైడర్లు (టీఎస్‌పీ), ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు (ఐఎస్‌పీ)లను విచారించాలని పోలీసులు నిర్ణయించారు. ఈమేరకు పలు కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారం గొలుసుకట్టు తరహాలో ఉండటంతో మరింతమంది ఈ కేసులో అరెస్టయ్యే అవకాశాలున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

ఉగ్రకోణం ఉంటే కేసు ఎన్ఐఏకు బదిలీ?

బహిరంగ మార్కెట్‌లో నిందితులు అమ్మకానికి పెట్టిన డేటాలో 2.60 లక్షల మంది రక్షణ శాఖకు చెందిన వ్యక్తిగత సమాచారం కూడా ఉండటం గమనార్హం. దీంతో ఇప్పటికే పలుమార్లు సైబరాబాద్ పోలీసులతో హైదరాబాద్, ఢిల్లీకి చెందిన రక్షణ శాఖ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో వివరాలు రాబట్టేందుకు కేంద్ర నిఘా సంస్థ (ఐబీ) అధికారులు కూడా భేటీ కానున్నట్లు తెలిసింది. సైబర్ మోసాల కోసమే డేటా చోరీ చేశారా లేక ఏమైనా ఉగ్రకోణం దాగి ఉందా అని తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఉగ్రకోణం అంశాలు వెలుగులోకి వస్తే గనక ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఏడుగురిలో నాగ్‌పూర్‌కు చెందిన జియా ఉర్ రెహ్మాన్ కీలకమని పోలీసుల విచారణలో తేలింది. ఇతను ముంబైకి చెందిన ఓ వ్యక్తి నుంచి డేటాను కొనుగోలు చేసి, జస్ట్ డయల్, డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గ్లోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో, ఇన్‌స్పైర్ డిజిటల్ మాధ్యమాల ద్వారా ఈ డేటాను విక్రయించేవాడు.

మే నెలలో ఏఈఈ ఉద్యోగ పరీక్షలు

- రద్దయిన పరీక్షలను మళ్లీ నిర్వహించనున్న టీఎస్‌పీఎస్సీ
- తాజాగా తేదీల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో రద్దయిన పరీక్షలను తిరిగి నిర్వహించేందుకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దృష్టి సారించింది. తాజాగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఉద్యోగ పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిర్దేశించిన తేదీల్లో హాజరు కావాలని స్పష్టం చేసింది. పరీక్ష తేదీకి వారం రోజుల ముందు హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వెల్లడించారు.

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అర్హత పరీక్ష తేదీలివే..

కేటగిరీ	పరీక్ష విధానం	పరీక్ష తేది
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్	సీబీఆర్‌టీ	08.05.2023 (ఉదయం, మధ్యాహ్నం)
అగ్రికల్చర్, మెకానికల్ ఇంజనీరింగ్	సీబీఆర్‌టీ	09.05.2023 (ఉదయం, మధ్యాహ్నం)
సివిల్ ఇంజనీరింగ్	ఓఎంఆర్	21.05.2023 (ఉదయం, మధ్యాహ్నం)

పని పూర్తి చేయమంటే పేపర్ అమ్మమన్నాడు!

- రాజేశ్వర్ ద్వారా డాక్యా నెట్‌వర్క్‌లోకి తిరుపతయ్య
- 'ఉపాధి' పనుల ఆలస్యంపై ప్రశ్నించడంతోనే తిరుపతయ్య దృష్టికి పేపర్ లీకేజీ విషయం
- ప్రశాంత్, రాజేంద్రలకు విక్రయంలో దళారీ పాత్ర.. తాజాగా అరెస్టయిన ముగ్గురి కస్టడీ కోరుతూ సిట్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకం పనుల ఆలస్యంపై ఓ సర్పంచ్ కుమారుడిని ప్రశ్నించడంతోనే తిరుపతయ్య తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్ష పేపర్ల లీకేజీ స్కామ్‌లో భాగస్వామి అయ్యాడని తెలుస్తోంది. ఇతడితో పాటు ఇద్దరు అభ్యర్థులను అరెస్టు చేసిన సిట్ అధికారులు వీరిని తమ కస్టడీలోకి తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరోపక్క లీకేజీ కేసులో జైలుకు వెళ్లిన టీఎస్‌పీఎస్సీ మాజీ ఉద్యోగులు షమీమ్, సురేశ్, రమేశ్‌లను పోలీసులు బుధవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శికి వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన ప్రవీణ్ కుమార్ నుంచి రేణుక, ఆమె భర్త డాక్యాలకు ఏఈ పరీక్ష ప్రశ్నపత్రాలు అందిన విషయం తెలిసిందే. వీటిని విక్రయించడానికి ఈ భార్యాభర్తలు ఏర్పాటు చేసుకున్న దళారుల్లో తమ స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం మన్సూర్‌పల్లి తండాకు చెందిన కేతావత్ రాజేశ్వర్ అలియాస్ రాజు ఒకరు. రాజేశ్వర్ తల్లి మన్సూర్‌పల్లి తండాకు సర్పంచ్‌గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ తండాకు సంబంధించిన అభివృద్ధి పనులను రాజేశ్వర్ పర్యవేక్షించేవాడు. సల్కర్‌పేట గ్రామానికి చెందిన తిరుపతయ్య ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇతడు ఎనిమిదేళ్లుగా గండీడ్ మండలంలో పని చేస్తున్నాడు. దీంతో తిరుపతయ్య, రాజేశ్వర్ మధ్య పరిచయాలు ఉన్నాయి. మన్సూర్‌పల్లి తండాలో జరిగే ఓ అభివృద్ధి పనిని తిరుపతయ్య పర్యవేక్షిస్తున్నాడు. అది నిర్ణీత సమయానికి పూర్తికాకపోవడంతో ఆలస్యానికి కారణం ఏమిటంటూ రాజేశ్వర్‌ను ప్రశ్నించాడు. అప్పటికే ఏఈ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వేటలో ఉన్న రాజేశ్వర్ అదే విషయం తిరుపతయ్యకు చెప్పి, ఆ బిజీలో ఉండటంతో అభివృద్ధి పనిని పర్యవేక్షించడం సాధ్యం కాలేదని, ఎవరైనా అభ్యర్థులు ఉంటే తీసుకురావాలని సూచించాడు. ప్రశ్నపత్రం విక్రయించగా వచ్చిన సొమ్ములో కమీషన్ ఇస్తానని చెప్పాడు. దీనికి అంగీకరించిన తిరుపతయ్య.. ఉపాధి హామీ పథకంలో పరిచయమైన రాజేంద్రకుమార్, ప్రశాంత్‌ను సంప్రదించాడు. వీరిని రాజేశ్వర్ వద్దకు తీసుకువెళ్లి, డాక్యా ద్వారా కర్మన్‌ఘాట్‌లోని ఓ లాడ్జి వద్ద ప్రశ్నపత్రం ఇప్పించాడు. వీరి నుంచి అడ్వాన్సుగా రూ.8 లక్షలు తీసుకున్నట్లు తెలిసింది.

కస్టడీకోసం కోర్టులో సిట్ పిటిషన్

ఈ కేసులో వీరిని మరింత లోతుగా ప్రశ్నించడంతో పాటు నగదు రికవరీ కోసం తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సిట్ పోలీసులు బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం గ్రూప్–1 ప్రిలిమ్స్ పేపర్ ప్రవీణ్, రాజశేఖర్‌ల ద్వారా ఈ ముగ్గురితో పాటు రాజశేఖర్ సమీప బంధువు ప్రశాంత్‌రెడ్డి వద్దకు మాత్రమే వెళ్లింది. రమేశ్, సురేశ్‌లకు ప్రవీణ్ ఇవ్వగా.. షమీమ్‌తో పాటు ప్రశాంత్‌రెడ్డిలకు రాజశేఖర్ ఇచ్చాడు. అయితే ఆ పేపర్ ఈ ఐదుగురితో పాటు ఇంకా ఎవరికైనా చేరిందా? అనే కోణంలో సిట్ వీరిని ప్రశ్నించనుంది. సిట్ అధికారులు గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షల్లో 100కు పైగా మార్కులు సాధించిన 121 మందిని ప్రశ్నించడం కొనసాగిస్తున్నారు. బుధవారం నాటికి 84 మందిని ప్రశ్నించారు. కాగా, ఏఈ ప్రశ్నపత్రం మాదిరిగా గ్రూప్–1 పేపర్ వ్యవహారంలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి

- నార్కో టెస్టుతోనే వాస్తవాలు
- టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై సీఎం కేసీఆర్ మౌనం వీడాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో కోదండరాం, ఆర్ఎస్ ప్రవీణ్ డిమాండ్



నిరాహార దీక్షలో అభివాదం చేస్తున్న కోదండరాం, ప్రవీణ్‌కుమార్, ఎర్ర సత్యనారాయణ తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ/ముషీరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలో బోర్డు చైర్మన్‌ను సస్పెండ్ చేసి సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, బీఎస్‌పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 30లక్షలమంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని, రాబోయే రోజుల్లో వారే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిరాహార దీక్షకు కోదండరాం, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకూ తమ పార్టీల తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు యూనివర్సిటీ లైబ్రరీలోని ఐసీఎస్ఎస్ఆర్ హాల్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో 'తెలంగాణలో విద్యార్థి, నిరుద్యోగుల భవిష్యత్తు' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కూడా వీరు పాల్గొని మాట్లాడారు.

పెద్దలను కాపాడేందుకే సిట్

పేపర్‌లీకేజీ వ్యవహారంలో పెద్దలను కాపాడేందుకు ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సిట్‌కు అప్పగించిందని, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన టీఎస్‌జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి నాయక్, కాంగ్రెస్ నాయకులు బెల్లయ్యనాయక్, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మంత్రి కేటీఆర్ ప్రమేయం లేకుండా ప్రశ్నపత్రాలు లీకేజీ కావని ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌కు నార్కోటెస్టులు జరిపిస్తే నిజాలు బహిర్గతమవుతాయన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, పీ.ఎల్.విశ్వేశ్వర్‌రావు టీఎస్ జేఏసీ అధ్యక్షుడు తుము నవీన్ యాదవ్, టీజేఎస్ నేతలు రమేశ్ ముదిరాజ్, సలీం పాషా, అరుణ్ కుమార్, కాంగ్రెస్ నేత కురువ విజయ్, బీజేపీ నేతలు దరవు ఎల్లన్న పాల్గొన్నారు.

800 రకాల ఔషధాల ధరలు పెరుగుదల

- ఒకటో తేదీ నుంచి 12.12 శాతం పెంచేందుకు కేంద్రం నిర్ణయం
- జాబితాలో జ్వరం, బీపీ, షుగర్, పెయిన్‌కిల్లర్స్, యాంటీబయోటిక్స్ మందులు
- తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ సంజయ్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 800 రకాల అత్యవసర మందుల ధరలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జ్వరం, బీపీ, షుగర్, పెయిన్ కిల్లర్స్, యాంటీబయోటిక్స్ మందులన్నింటి ధరలు 12.12 శాతం పెరుగుతాయని కేంద్రం వెల్లడించింది. దీని వల్ల ప్రతి ఒక్కరూ ప్రభావితమవుతారని, ఎక్కువ మందులు తీసుకునే వ్యక్తులపై భారం పడుతుందని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్ సంజయ్‌రెడ్డి అన్నారు. రక్త హీనత, మధుమేహం, గుండె జబ్బులకు వాడే అత్యవసర ఔషధాలు, అంటువ్యాధులు, చర్మవ్యాధులు, ఇన్ఫెక్షన్లు, టీబీ, వివిధ రకాల కేన్సర్లకు రోగులు ఉపయోగించే మందుల ధరలు పెరుగుతాయని చెపుతున్నారు. అలాగే మెడికల్ డివైజ్‌ల ధరలు కూడా భారీగా పెరుగుతాయని, జాతీయ ఔషధ ధరల నిర్ణాయక మండలి (ఎన్‌పీపీఏ) వీటి ధరలను పెంచిందని సంజయ్ పేర్కొన్నారు. అసలే కరోనా తర్వాత అనేకమంది పలు సైడ్‌ఎఫెక్ట్స్‌కు గురయ్యారు. దీంతో అనేకమంది నిత్యం పలు రకాల మందులు వాడుతున్నారు. మందుల ధరల పెంపువల్ల ఆదాయంలో కొంత భాగం వాటికి అదనంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. డ్రగ్స్ (ప్రైస్ కంట్రోల్) ఆర్డర్, 2013 ప్రకారం హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) సరళిని బట్టి ఈ ధరలు నిర్ణయించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది మందుల ధరలను 10.76 శాతం పెంచిన కేంద్రం.. ఈసారి ఏకంగా 12.12 శాతం పెంచింది. కాగా, ఏయే మందుల ధరలు పెరిగాయో వాటి జాబితాను కేంద్రం ఒకటిరెండు రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉందని సంజయ్‌రెడ్డి తెలిపారు.



YAMAHA RACING
The call of the BLUE
Ride Free
FZ-X
YAMAHA MOTORCYCLE CONNECT
WITH CONNECT
NEW
DARK MATTE BLUE
RIDE FREE FOR LIFE
Searching for the ultimate riding experience?
Gear up for a ride like no other! Explore the city, back roads or even highways with the bike's reliable engine and journey beyond the ordinary to ride free with the FZ-X.
TRACTION CONTROL SYSTEM
Reduces rear tyre slippage
Better control in any riding condition
BI-FUNCTIONAL LED HEADLIGHT WITH DRL
TRUSTED & EFFICIENT 149cc FI ENGINE
MULTI-FUNCTION LCD INSTRUMENT CLUSTER
TELESCOPIC SUSPENSION WITH FRONT FORK BOOT
SLEEK LED TAIL LIGHT
LED FLASHERS
ABS
SINGLE CHANNEL
MATTE COPPER
MATTE BLACK
Main Dealership: Kompally: 8886608622 | Somajiguda: 9052288129 | Malakpet: 9392482799 | Kukatpally: 9948704117 | Mettuguda: 9248046099 | AS Rao Nagar: 7997990139 | Attapur: 7330710606
Himayathnagar: 9392918685 | Trimulgherry: 8886655511 | Kondapur: 9848683193 | Ranigunj: 9248046068 | RC Puram: 8886620108 | LB Nagar: 9248046090. Branch: Uppal: 9248046061 Eragadda: 9032000745
Tolichowki: 7981955128 | Tadbund: 8886655509 | Lakadikapool: 9032000744. Yamaha Bike Corner: Suraram Colony: 9441039921 | Jagathgirigutta: 9505566661 | Manikonda: 7702648929 | Nagaram: 9100477333
Medak: 9676111306 | Shankerpally: 9885988559 | Medchal: 8886608617 | Vikarabad: 8885551014 | Siddipet: 9666160160.

సాక్షి
గురువారం, మార్చి, 30

ఆ వైభవం తిరిగొస్తుందా?

గత అక్టోబర్‌లో యాభై ఏళ్ళు నిండినప్పుడు అందరూ ఆగిచూసిన దక్షిణాది ప్రాంతీయ పార్టీ అఖిల భారత అన్నా ద్రావిడ మున్నేత్ర కళగం (అన్నాడీఎంకె)కు మంచి రోజులు రానున్నాయా? అప్పట్లో ద్రావిడ మున్నేత్ర కళగం (డీఎంకె)తో సరిపడక హీరో ఎమ్జీఆర్ బయటకొచ్చి స్థాపించిన ఈ పార్టీపై పట్టు కోసం కోర్టులో పోరు కొలిక్కి వచ్చినట్టేనా? పార్టీ నుంచి తనను బహిష్కరించడాన్నీ, తన ప్రత్యర్థి – మాజీ సీఎం ఈడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడాన్నీ సవాలు చేస్తూ మాజీ సమన్వయకర్త ఓ. పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) వేసిన పిటిషన్లను మద్రాస్ హైకోర్ట్ మంగళవారం తోసిపుచ్చింది. కోర్టులో ఓపీఎస్‌కు ఎదురుదెబ్బ ఇది వరుసగా మూడోసారి. తీర్పుపై అప్పీలుకు అవకాశం ఉన్నా, ఆయన రాజకీయ పునరాగమనానికి దారులు మూసుకుపోతున్నట్టే అనిపిస్తోంది. కేడర్‌పై విస్తరించిన పట్టు, కీలక స్థానాల్లో నమ్మినబంట్ల నియామకం, సమర్థ పరిపాలకుడిగా సాధించిన పేరు, తాజా కోర్టు తీర్పుతో... పార్టీ పగ్గాలు ఈపీఎస్ చేతికి దాదాపు వచ్చినట్టే. ఇది పార్టీ పునర్వైభవానికి దోహదమవుతుందా అన్నదే ఇక మిగిలిన ప్రశ్న.

అధినేత్రి జయలలిత మరణానంతరం క్రమంగా కష్టాల్లో పడ్డ అన్నాడీఎంకె గత రెండేళ్ళలో తేవర్లు, గౌండర్లు, వగైరా కులాల కుంపట్లతో ఒకటికి నాలుగు (ఈపీఎస్, ఓపీఎస్, పదవీచ్యుత ప్రధాన కార్యదర్శి శశికళ, ఆమె మేనల్లుడు – ఏఎంఎంకె అధినేత టీటీవీ దినకరన్) వర్గాలైంది. సాంప్రదాయికంగా అన్నాడీఎంకెకు పట్టున్న రాష్ట్రంలోని పశ్చిమ ప్రాంతంలో నిరుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో డీఎంకె పాగా వేసింది. మహిళలు, వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణాల ఓటు బ్యాంక్ క్రమంగా చెదిరిపోతోంది. ఈపీఎస్, ఓపీఎస్ శిబిరాల మధ్య పోరుతో పార్టీ దశ, దిశ కోల్పోయి బలహీనపడ్డ సమయంలో కోర్ట్ తీర్పు అయాచిత వరమే. పేరుకు ప్రధాన ప్రతిపక్షమైనా వర్గ విభేదాలు, పార్టీకి సారథి ఎవరో తెలియని అయోమయం, ఎన్నికల చిహ్నం రెండాకులపై పోరాటం సాగుతున్న వేళ ఈ తీర్పు పార్టీ ప్రస్థానానికి దిశానిర్దేశమే.

కోర్టు ఆదేశాలు ఈపీఎస్ వర్గానికి నైతికంగా పెద్ద అండ. నిజానికి, దివంగత జయలలితనే పార్టీ శాశ్వత అధినేత్రిగా ప్రకటించాలన్నది ఓపీఎస్ వర్గం దీర్ఘకాలిక డిమాండ్. ఇప్పుడీ తీర్పుతో వారి డిమాండ్‌కు గండిపడింది. ఈపీఎస్ మద్దతుదారులు తమ నేతను శాశ్వత ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొని, పార్టీని మళ్ళీ పట్టాలెక్కించాలని ఉవ్విళ్ళూరుతున్నారు. ఈ ఫిబ్రవరిలో సుప్రీం కోర్ట్ సానుకూలంగా ఇచ్చిన తీర్పూ వారికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పార్టీ జనరల్ కౌన్సిల్‌లో, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో మెజారిటీ సభ్యుల మద్దతు ఈపీఎస్‌కే ఉంది గనక ఈపీఎస్ యథేచ్ఛగా ప్రత్యేక సమావేశాలు పెట్టుకోవచ్చు. సదరు సమావేశాల్లో పార్టీలో ఓపీఎస్ లాంటి ప్రత్యర్థుల్ని ఇంటికి సాగనంపుతూ తీర్మానాలు చేసే వీలు చిక్కుతుంది. అవసరాన్ని బట్టి పార్టీ రాజ్యాంగాన్నీ సవరించుకోవచ్చు. ఇవన్నీ ఈపీఎస్‌కు కలిసొచ్చే అంశాలు.

ఇల్లలకగానే పండగ కాదనట్టు ఈపీఎస్‌కు అనేక సవాళ్ళు ముందున్నాయి. దాదాపు 1.5 కోట్ల మంది కార్యకర్తలున్న పార్టీని ఒంటరి దళపతిగా ఆయన ముందుకు నడపాలి. పార్టీకి మునుపు సారథ్యం వహించిన ఎమ్జీఆర్, జయలలిత లాంటి దిగ్గజాలకున్న ఇమేజ్, ప్రాచుర్యం ఈపీఎస్‌కు లేవు. వారిలా జనాకర్షణ, మాటే శాసనంగా పార్టీని నడిపే పట్టు ఆయన నుంచి ఆశించలేం. సొంత గూటి సంగతి పక్కన పెడితే, ప్రత్యర్థి పార్టీ అయిన డీఎంకెతో ఢీ అంటే ఢీ అనాలంటే ముందుగా కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జనంలో పార్టీపై నమ్మకం పెంపొందించాలి. మరోపక్క 2019 లోక్‌సభ ఎన్నికల్లో, 2021 తమిళ అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో విజయాలతో డీఎంకెను ముందుకు నడిపిన ఘనత స్టాలిన్‌ది. బలమైన ఈ ప్రత్యర్థితో తలపడడం ఈపీఎస్‌కు ఈజీ కాదు.

తమిళ రాజకీయాలెప్పుడూ డీఎంకె, అన్నాడీఎంకెల మధ్య... కరుణానిధి, జయలలితల మధ్య ఊగడం రివాజు. ఆ రాజకీయ దృశ్యం ఇప్పుడు గణనీయంగా మారింది. చిరకాలంగా తమిళ రాజకీయాలకు దిక్సూచైన ద్రావిడ సిద్ధాంతం క్రమంగా కుంచించుకుపోతోంది. ఇద్దరు రిటైర్డ్ ఐపీఎస్ అధికారులను (గవర్నర్ రవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై) 2021లో బరిలోకి దింపి, డీఎంకె వ్యతిరేక, హిందూత్వ జాతీయవాద వైఖరితో బీజేపీ కాలు దువ్వుతోంది. అలాగే, జయ మరణానంతరం అన్నాడీఎంకెకు పెద్దన్నగా వ్యవహరించిన బీజేపీ... ఆ పార్టీ బలహీనతల్ని వాటంగా చేసుకొని, జయ వదిలివెళ్ళిన స్థానంలో ప్రధాన ప్రతిపక్షంగా తాను కూర్చోవాలని శతధా ప్రయత్నిస్తోంది. పక్కనే పొంచివున్న ఈ ముప్పు పట్ల ఈపీఎస్ జాగరూకత వహించి, సమర్థంగా ఎదుర్కోవాలి.

ఒక్కమాటలో– 39 పార్లమెంటరీ స్థానాలున్న తమిళనాట రానున్న 2024 లోక్‌సభ ఎన్నికలు ఈపీఎస్‌కు తొలి పెద్ద పరీక్ష. దానిలో పార్టీని బలంగా నిలబెట్టి, తర్వాత మరో రెండేళ్ళకు వచ్చే 234 స్థానాల శాసనసభా సమరంలో అధికారం చేజిక్కించుకునేలా పోరాడాలి. నిరుటి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకె కూటమి 159 స్థానాలు సాధిస్తే, 75 సీట్లకే పరిమితమైన అన్నాడీఎంకె కూటమి ఆ లెక్కను తిరగరాయాలి. అదే జరిగితే అధినేతగా ఈపీఎస్‌కు తిరుగుండదు. లేదంటే, అన్నాడీఎంకెలో మరోసారి అసమ్మతి స్వరాలు పైకొస్తాయి. రిటైరయ్యానని ప్రకటించిన జయలలిత నెచ్చెలి శశికళను మళ్ళీ తెర పైకి తేవాలనే మాటలు వినిపిస్తాయి. అందుకే, రాగల మూడేళ్ళ కాలం ఈపీఎస్‌కు పరీక్షా సమయం. మంచి మార్కులు తెచ్చుకుంటేనే ఆయనకైనా, అన్నాడీఎంకెకైనా భవిష్యత్తు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.నవమి రా.11.54 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పునర్వసు రా.11.32 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.10.22 నుండి 12.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.03 నుండి 10.52 వరకు తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.8.51 నుండి 10.38 వరకు, శ్రీరామనవమి.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

పరీక్షల పద్ధతి మారాల్సిన తరుణం!

విశ్లేషణ



శ్రీధర్ రాజగోపాలన్

ప్రశ్నపత్రాల లీకులను నిరోధించడానికి కఠినమైన చర్యలు తాత్కాలికంగా అవసరమే కావొచ్చు. కానీ ఈ సమస్యకు నిజమైన పరిష్కారం, పరీక్షల వ్యవస్థలోనే సంస్కరణ జరగడం! ఇప్పుడు జరుగుతున్న పరీక్షల్లో గుర్తుపెట్టుకోవడమే ప్రధానం. ఇదే లీకులకు, కాపీలకు కారణమవుతోంది. దీన్ని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో ముఖ్యమైనవి: కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించడం, జ్ఞాపకశక్తిని పరీక్షించడం కాకుండా అవగాహనతో కూడిన సమాధానాలిచ్చే ప్రశ్నలను ఎక్కువగా ఇవ్వడం. కంప్యూటర్లను అందించడంలో మౌలిక వసతుల ఖర్చు పెరుగుతుంది. కానీ ప్రశ్నపత్రాల ముద్రణ, రవాణా, భద్రత అంశాల్లో ఖర్చులు తగ్గుతాయి. పైగా లీకుల వల్ల ఉత్పన్నమయ్యే ఖర్చు కూడా తగ్గుతుంది.

ప్రతి పరీక్షా సీజన్ కూడా ప్రశ్నపత్రాల లీకులు, కాపీయింగులు, అవి జరగకుండా భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకుంటామనే హామీలకు సంబంధించిన వార్తలను ప్రవాహంలా మోసుకొస్తుంది. ఆ ప్రమాణాల ప్రకారం చూసినా కూడా గత కొన్ని నెలల్లో తలెత్తిన వరుస వివాదాలు ఎంతో చెరుపుచేశాయి.

గత నెలలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం, రాష్ట్ర నియామక పరీక్షల్లో ఎవరైనా మోసానికి పాల్పడుతూ పట్టుబడితే కనీసం 10 సంవత్సరాల జైలుశిక్ష విధించేలా చట్టాన్ని చేసింది. కొన్ని రోజుల తర్వాత, ప్రశ్నపత్రాల లీకులను నిరోధించడానికి గుజరాత్ శాసనసభ ఏకగ్రీవంగా ఒక బిల్లును ఆమోదించింది. దోషులుగా రుజువైన వారికి పదేళ్ల జైలు శిక్ష, కోటి రూపాయల జరిమానాను ఈ బిల్లులో ప్రతిపాదించారు. అదే రోజు, రాజస్థాన్ ఉపాధ్యాయుల అర్హతా పరీక్ష పత్రాలు పరీక్ష తొలి రోజునే లీక్ అయ్యాయి. అవి వ్యాప్తి చెందకుండా వెంటనే ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేశారు. ఇక, గత వారంలోనే అస్సాంలో 10వ తరగతి ప్రశ్నపత్రాలు మళ్లీ మళ్లీ లీక్ అవుతుండటం రాజకీయ వివాదానికి దారితీసింది. ప్రశ్నపత్రాల లీకులను నిరోధించడానికి కఠినమైన, దండనాత్మక చర్యలు తాత్కాలికంగా అవసరమే కావొచ్చు. కానీ ఈ సమస్యకు నిజమైన పరిష్కారం ఏమిటంటే, మన పరీక్షల వ్యవస్థలోనే సంస్కరణ జరగడం! ఇది కాపీలను, లీకులను తగ్గించడమే కాదు, రానున్న సంవత్సరాల్లో అభ్యర్థులకు అవసరమైన సముచిత నైపుణ్యాలను పరీక్షించేలా ఉపకరిస్తుంది.

1970ల నుండి జాబ్ మార్కెట్ అవసరాలను పరిశీలిస్తే – సాధారణ అభిజ్ఞా నైపుణ్యాలు, శారీరక నైపుణ్యాలను పణంగా పెట్టి, రొటీనుకు తావులేని మానవ సహసంబంధాలు, విశ్లేషణాత్మక నిపుణతలు అనేవి నాటకీయంగా పెరుగుతూ వచ్చాయని ఒక పరిశోధన చెబుతోంది. ఆఫీస్ సెక్రటరీ లేక స్టెనోగ్రాఫర్, మానవ బ్యాంక్ టెల్లర్ వంటి సాంప్రదాయికమైన పాత్రలు వాస్తవంగా అదృశ్యమైపోవడం దీనికి ఉదాహరణ. ఇవన్నీ పునరుక్త శారీరక లేక అభిజ్ఞాపరమైన నిపుణతలను ఆశిస్తాయి. జాబ్ మార్కెట్లో ప్రవేశించేవారు అత్యున్నత నైపుణ్య స్థాయితో పోటీపడాల్సిన అవసరాన్ని కృత్రిమ మేధ (ఏఐ) ఉపకరణాల పెరుగుదల తప్పనిసరి చేసింది. ఈరోజు భారతీయ పరీక్షలు చాలావరకు సాధారణ అభిజ్ఞా నైపుణ్యాలను కొలవడం పైనే దృష్టి పెడుతున్నాయి. ఇదే లీకులకు, కాపీల వైపు మొగ్గుచూపే సమస్యలకు కారణమవుతోంది. దీన్ని పరిష్కరించడానికి స్వతంత్రమైనవే అయినా, పరస్పర అనుసంధానిత నాలుగు చర్యలు తీసుకోవచ్చు.

మొదటిది, కంప్యూటర్ ఆధారిత పరీక్షలు. దీనివల్ల చాలా ప్రయోజనాలున్నాయి. అభ్యర్థులకు విభిన్నమైన ప్రశ్నపత్రాలు ఇవ్వవచ్చు. మొత్తం ప్రశ్నల పూల్ చాలా పెద్దదిగా ఉండటం వల్ల లీకుల సమస్య తగ్గిపోతుంది. కాపీ చేయడం కష్టతరమైపోతుంది. వీటి ముద్రణ, రవాణా ప్రక్రియలు గణనీయంగా తగ్గిపోతాయి లేదా దాదాపుగా లేకుండా పోతాయి. పైగా, విభిన్న ప్రశ్నపత్రాలు ఉన్నప్పటికీ ఆధునిక గణాంక టెక్నిక్కులు అభ్యర్థుల తులనాత్మక పనితీరును అత్యంత కచ్చితంగా, వాస్తవంగా తక్షణం కొలవడానికి ఉపకరిస్తాయి.



అలాంటి పరీక్షలు అత్యున్నత నైపుణ్యాలను పరీక్షించే నిర్దిష్ట కర్తవ్యాలను కూడా అభ్యర్థులకు ఇవ్వగలుగుతాయి. పైగా కంప్యూటర్‌తోనే దిద్దించవచ్చు (ఉదాహరణకు, గ్రాఫ్ లేదా మ్యాపుపై పాయింటును గుర్తించడం, ఒక ప్యాసేజీలోని పదాన్ని మార్చడం). ఇప్పటికే అతి పెద్ద, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారతీయ పరీక్షలను చాలావరకు కంప్యూటర్లలో నిర్వహిస్తున్నారని గుర్తుంచుకోవాలి. పరీక్షలు జరపడం కోసం కంప్యూటర్లను అందించడంలో మౌలిక వసతుల ఖర్చు పెరుగుతుంది. కానీ ప్రశ్నపత్రాల ముద్రణ, రవాణా, భద్రత అంశాల్లో ఖర్చులు తగ్గుతాయి. లీకుల వల్ల ఉత్పన్నమయ్యే ఖర్చు కూడా తగ్గుతుంది. (ఇది అనివార్యంగానే పునఃపరీక్షలకు దారితీస్తుంది).

రెండు, ఓపెన్ బుక్ పరీక్షలను మరింతగా పెంచడం. ఈ విధానం పరీక్షా హాల్‌లోకి నిర్దిష్ట సామగ్రిని తీసుకెళ్లడానికి అభ్యర్థులను అనుమతిస్తుంది. ఇవి వాస్తవాలతోపాటు ప్రాథమిక ఫార్ములాలను కలిగి ఉన్న బుక్‌లెట్ల లాంటివి కావొచ్చు. సులభంగా కాపీ చేసే సమస్య దీంతో తొలగిపోతుంది. దీనివల్ల అభ్యర్థులు తమ జ్ఞానాన్ని వాస్తవ జీవితానికీ, మరింత పెద్ద సమస్యలకూ వర్తింపజేసుకోగలుగుతారు.

మూడు, కేవలం జ్ఞాపకశక్తిని పరీక్షించడం కాకుండా అవగాహనతో కూడిన సమాధానాలు అవసరమైన ప్రశ్నలను ఎక్కువగా ఇవ్వడం. ఒకవేళ కంప్యూటర్లు లేక ఓపెన్ బుక్ పరీక్షలను ఉపయోగించనప్పటికీ, కేవలం గుర్తు తెచ్చుకోవడం మాత్రమే కాకుండా అర్థం చేసుకుని, అన్వయించడంపై ఆధారపడిన నైపుణ్యాల కోసం అభ్యర్థులను పరీక్షించాలి. ఇప్పుడు జరుగుతున్న పరీక్షల్లో గుర్తు పెట్టుకోవడమే ప్రధాన అవసరంగా ఉంటోంది. ఈ విధంగా ప్రశ్నలను మెరుగుపర్చినప్పుడు, సమాధానాలు ఇవ్వడం అనేది ఎప్పుడూ యాంత్రికంగా ఉండదు (ఈ విధానంలో కూడా ప్రశ్నలు ఆబ్జెక్టివ్ లేదా మల్టిపుల్ ఛాయిస్‌గానే ఉండవచ్చు). ఇలాంటి అనేక ప్రశ్నలు ఒక అపరిచిత నేపథ్యం నుంచి ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు వాటి సందర్భాన్ని అర్థం చేసుకుని ఆ తర్వాతే ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. జాతీయంగా, అంతర్జాతీయంగా అత్యుత్తమ పరీక్షలు ఇప్పటికే ఇలా జరుగుతున్నాయి. ఇలాంటి ప్రశ్నలను గూగుల్ చేయలేము. పైగా, జీపీటీ–4 వంటి విధానంలో కూడా సులువుగా వీటికి సమాధానాలు కనుగొనలేమని గుర్తించారు (కాకపోతే నెమ్మదిగా అదీ సాధ్యమవుతోంది).

నాలుగు, పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడం. సులువుగా పరీక్షా ప్రక్రియను మెరుగుపర్చడానికి ఉన్న అవకాశం, పరీక్షలకు సంబంధించిన వివిధ అంశాల గురించి దేశ, రాష్ట్రాల స్థాయుల్లో ప్రజావగాహన ప్రచారాలు నిర్వహించాలి. అభ్యర్థులు లేక వారి కుటుంబ సభ్యులు తరచుగా పరీక్షల సంస్కరణలను వ్యతిరేకిస్తుంటారు. ఎందుకంటే పరీక్షల్లో మార్పు చేస్తే తమకు తెలియని పద్ధతిని ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడతారు. నష్టం కలుగుతుందని భావిస్తారు. ఈ కొత్త పరీక్షల గురించిన ప్రచారం అవెందుకు మెరుగో వివరిస్తుంది. సాపేక్ష గ్రేడింగ్, పర్సెంటైల్స్ వంటి భావనలను కూడా సరిగ్గా వివరించలేకపోతే వ్యతిరేకత మూటగట్టుకుంటాయి. కొన్నిసార్లు కోర్టుల్లో కూడా వీటికి వ్యతిరేకత వ్యక్తం కావొచ్చు.

చివరగా, పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే కాకుండా, ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షల్లో కూడా మంచి స్కోర్ సాధించేలా అభ్యర్థులకు ఈ ప్రచారాలు టిప్స్ అందిస్తాయి. ఇలాంటి ప్రచారాలు జరగకపోతే, అభ్యర్థులు జరిగే మార్పుల గురించి తెలుసుకోలేరు. ట్యూషన్, కోచింగ్ క్లాసుల నుంచి అందే వాస్తవాలే వీరికి ప్రామాణికం అవుతాయి. ఇవి దాదాపుగా యథాతథ స్థితినే నిలిపి ఉంచుతాయి.

నియామకాల కోసం గానీ లేక అకెడమిక్ కోర్సుల కోసం గానీ నిర్వహించే పరీక్షల నాణ్యత అనేదే మానవ పెట్టుబడి నాణ్యతను నిర్దేశిస్తుందని చాలా దేశాలు గుర్తించాయి. అందుకే మనం దీనికి గొప్ప ప్రాముఖ్యతను ఇవ్వడానికి ఇదే మంచి తరుణం. కాపీలు, లీకులు అనేవి కునారిల్లుతున్న వ్యవస్థ తాలూకు లక్షణాలను విస్తృతంగా ప్రదర్శిస్తుండటాన్ని మనం చూశాము. అందుకే ఈ రంగంలో మార్పు తప్పనిసరి.

వ్యాసకర్త సహ–వ్యవస్థాపకుడు, 'ఎడ్యుకేషనల్ ఇనీషియేటివ్స్'
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అర్థం తెలిస్తే...



ఇండియానూ, హిందూ దేవీ దేవతలనూ దుర్భాషలాడుతున్న ఖలిస్తానీలు పరోక్షంగా సిక్కుమతాన్ని కూడా తిడుతున్నట్టే! వాళ్లకు 'వాహె గురు' (సిక్కులు దేవుడికి మారుగా వాడే పదం) అంటే అర్థం తెలియదు. వా – సత్యయుగంలోని విష్ణు వాసుదేవ్, హె – ద్వాపరలోని హరి కృష్ణ, గు – కలియుగంలోని గురు గోవింద్, రు – త్రేతాయుగ రాముడు కలిస్తేనే వాహె గురు! ఈ అర్థాన్ని భాయీ గురుదాస్ జీ (17వ శతాబ్దపు సిక్కు బోధకుడు) చక్కగా వివరించారు.

– తేజిందర్ పాల్ సింగ్ బగ్గా, బీజేపీ ఢిల్లీ

ఆకాంక్షలను గౌరవించాలి



ప్రధానమంత్రి రిషీ సునాక్‌తో మాట్లాడాను – పెరుగుతున్న జీవన వ్యయ సంక్షోభం మొదలుకొని భిన్నాంశాల మీద మా మధ్య నిర్మాణాత్మక చర్చ జరిగింది. అలాగే స్కాట్‌లాండ్ ప్రజలను, పార్లమెంట్ ప్రజాస్వామిక ఆకాంక్షలను యూకే ప్రభుత్వం గౌరవించాలని స్పష్టం చేశాను.

– హమ్జా యూసఫ్, స్కాట్‌లాండ్ ఫస్ట్ మినిస్టర్

చీతాల భారతం



1952లో భారత్‌లో చీతాలు అంతరించాయని ప్రకటించారు. 2022లో నమీబియా నుంచి 8 చీతాలను తెచ్చి, కూనో జాతీయ పార్కు(మధ్యప్రదేశ్)లో విడుదల చేశారు. అందులో ఒకటి కిడ్నీ సమస్యలతో చనిపోయింది. దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఇండియాలో నాలుగు కూనలు పుట్టాయి. ఆ కూనలకు స్వాగతం!

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

ఎక్కడికి ముడిపెట్టారు!



ఒక ఇండియన్ ఫ్రెండ్ ఇలా పరిహాసం ఆడుతున్నాడు: 'పాకిస్తాన్ నుంచి వలన వచ్చిన కుటుంబపు వ్యక్తిని (హమ్జా యూసఫ్) స్కాట్‌లాండ్ ప్రధానంగా తమ విభజన కోసం ఎన్నుకుంది. అంటే ఒక వలస పాకిస్తానీ కుటుంబపు వ్యక్తి, భారత వలస కుటుంబపు వ్యక్తితో(రిషి సునాక్) యూకే విభజన గురించి చర్చలు జరుపుతారన్నమాట!

– టుంకు వరదరాజన్, కాలమిస్ట్

వేరేలా పరిష్కరించాలి!



నిన్న రాత్రి, మానసిక సమస్య లున్న తన కొడుకు చేతిలో కత్తి పట్టుకుని ఉన్నాడని ఒక మనిషి సాయం కోరాడు. న్యూయార్క్ పోలీస్ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు అక్కడికి వచ్చి కేవలం 28 సెకన్లలో ఆ అబ్బాయిని కాల్చేశారు. చట్టపరంగా చంపేవాళ్లకు నిధులు ఇవ్వడం కాదు... మానసిక ఆరోగ్యాంశాలను పట్టించుకునేవాళ్లకు ప్రోత్సాహం ఇవ్వాలి.

– ఒలాయెమీ ఒలూరిన్, కామెంటేటర్

'ఉన్నత' ఆహారం



మనుషుల కొత్త సూపర్ ఫుడ్ 'పురుగులు' అచ్చంగా చికెన్ రుచే కలిగి ఉంటాయనడం కేవలం లాభాల కోసమే. 2019లో 11.2 కోట్ల డాలర్లుగా ఉన్న ఈ 'బగ్ ఫుడ్' పరిశ్రమ మార్కెట్ 2026 నాటికి 183 కోట్ల డాలర్లకు పెరగనుందని అంచనా. ఉన్నత వర్గాలు, ప్రభుత్వాలు దీనికి నిధులు సమకూర్చుతున్నప్పుడు రైతుల గురించి ఎవరు ఆలోచిస్తారు?

– బెర్నీ స్పాఫోర్డ్, కాలమిస్ట్

ఇన్‌బాక్స్

ప్రజా ఉద్యమానిదే పైచేయి

ఇజ్రాయెల్ ప్రధాని నెతెన్యాహూ దిగివచ్చి తన ప్రభుత్వం తలపెట్టిన న్యాయ సంస్కరణలను తాత్కాలికంగా నిలుపుదల చెయ్యడం అక్కడి ప్రజా ఉద్యమ విజయం. న్యాయ సంస్కరణల పేరుతో ఆయన న్యాయపాలికను గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం చేశారు. న్యాయమూర్తుల నియామకం, కార్యనిర్వాహక వ్యవస్థ పైచేయిగా ఉండేలా మార్పులు, ప్రధానిని అవినీతి కేసుల్లో విచారించే అవకాశం లేకుండా చెయ్యడం లాంటి నిర్ణయాలతో శాసనాన్ని అమలు చేయాలని నెతెన్యాహూ భావించారు. వీటిపై సొంత కేబినెట్‌లోనే విమర్శలు రాగా, ఒక మంత్రికి ఉద్వాసన పలికారు. అయితే వేలాది మంది పౌరులు ఉద్యమాన్ని వీధుల్లోకి తీసుకువచ్చి, ఉధృతం చేశారు. కార్మిక సంఘాలు, పౌరులు ఈ ప్రతిపాదనల్ని ప్రభుత్వం విరమించకపోతే ఉద్యమ తీవ్రతను పెంచనున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు అంతర్జాతీయ సమాజం నుండి ఉద్యమానికి మద్దతుగా, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఒత్తిడి పెరగసాగింది. దీంతో ప్రధాని నెతెన్యాహూ వెనకడుగు వేసి తాత్కాలికంగా న్యాయ సంస్కరణల ప్రయత్నాలను ఆపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇలా శాసన వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు నడుమ అధికారంలో పైచేయి కోసం ప్రయత్నాలు పలు దేశాల్లో జరుగుతున్నాయి.



మన దేశంలో కూడా ఇంతకు ముందు కన్నా ఇప్పుడు ఈ రెండు వ్యవస్థల నడుమ దూరం పెరిగింది. ఒకదానిపై ఒకటి విమర్శ చేసుకోవడం సాధారణమై పోయింది. ప్రజాస్వామ్యపు ఆరోగ్యానికి రెండు వ్యవస్థలూ సమానాధికారంతో ఉండడం అవసరం. ఒక దానికి ఇంకొకటి చెక్‌గా ఉండాలి. ప్రజాస్వామ్య విధానాన్ని ఇష్టపడేవారు ఆ బ్యాలెన్స్ తప్పే పరిస్థితులు రానివ్వరాదు.

– డా. డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

సీతమ్మ చెప్పిన కల్యాణ ఘట్టం

సందర్భం



వనం జ్వాలా నరసింహారావు

అరణ్యవాసంలో భాగంగా చిత్రకూటం నుండి సీతాలక్ష్మణ సమేతంగా బయల్దేరిన శ్రీరాముడు అత్రి మహాముని ఆశ్రమానికి చేరుకుని, ఆయనకూ, ఆయన భార్య అనసూయాదేవికీ సీతాదేవిని పరిచయం చేశాడు. అప్పుడు... శ్రీ రామచంద్రమూర్తి తన పరాక్రమంతో స్వయంవరంలో సీతను పెళ్లి చేసుకున్నాడని వినడమే కానీ, అదెలా జరిగిందో వివరంగా వినలేదనీ, ఆ కథ వినాలని ఉందనీ, జరిగినదంతా వివరంగా చెప్పమనీ సీతను అనసూయ అడిగింది.

జవాబుగా సీతాదేవి, ముందు తన జన్మ వృత్తాంతాన్ని వివరించింది. వివాహం చేయ సంకల్పించిన తరువాత వరుని కోసం వెతికినా తగినవాడు లభించకపోవడంతో 'స్వయంవరం' ప్రకటించాలని ఆలోచించారని పేర్కొంది. 'ఈ ప్రకారం ఆలోచించిన నా తండ్రి... తాను చేసిన ఒక గొప్ప యజ్ఞంలో వరుణుడు తనకు ఇచ్చిన మనుష్యులు కదిలించ సాధ్యపడని, రాజులు కలలో కూడా ఎక్కుపెట్టలేని వింటినీ; అక్షయబాణాలనూ, రాజులందరికీ చూపించి ఆ విల్లు ఎక్కుపెట్టిన వాడు తన కూతురుకు భర్త కాగలడని ప్రకటించాడు. అక్కడికి వచ్చిన రాజులు దానిని ఎత్తలేక, చూడగానే భయపడి దానికి ఒక నమస్కారం చేసి పోయారు' అని చెప్పింది సీత.

'ఇదే సమయంలో, విశ్వామిత్రుడు తన యాగ రక్షణకై దశరథ కుమారులైన రామలక్ష్మణులను వెంట తీసుకుపోయి, తన కార్యం నెరవేర్చుకున్న అనంతరం వారికి కల్యాణం జరిపించాలన్న ఆలోచనతో, తన వెంట మిథిలా నగరానికి తీసుకుని వచ్చాడు.

శ్రీరాముడు అవలీలగా వింటిని అరచేత్తో పట్టుకొని, పెట్టె నుంచి బయటకు తీసి, రాజులందరు చూస్తుండగా అల్లెతాటిని బిగువుగా లాగుతుంటేనే, విల్లు ఫెళ్లుమని రెండుగా విరిగిపోయింది' అన్నది సీత. తన తండ్రి అన్న మాట ప్రకారం శ్రీరామచంద్రమూర్తికి కన్యాదానం చేయడానికి జలపాత్ర చేతిలో తీసుకున్నాడనీ, కాని తమ తండ్రి అభిప్రాయం తెలుసుకోవాలని చెప్పి శ్రీరాముడు దానం తీసుకోలేదనీ చెప్పింది. అప్పుడు దశరథ మహారాజు దగ్గరకు దూతలను పంపగా ఆయన వచ్చాడని పేర్కొంది.



తన వివాహ సమయంలో తన తండ్రి శ్రీరామచంద్రమూర్తితో: 'కౌసల్యా కుమారా! ఈ సీత నా కూతురు. నీ సహధర్మచారిణి. ఈమె పాణిగ్రహణం చేసుకో. నీకు జగత్ ప్రసిద్ధమైన మేలు కలుగుతుంది. నీకు శుభం కలుగుతుంది. మంత్ర పూర్వకంగా ఈమె చేతిని నీ చేత్తో పట్టుకో. రామచంద్రా! మహా భాగ్యవతి అయిన నీ సీత, నీ నీడలా ఒక్కసారైనా నిన్ను విడిచి వుండదు' అంటూ, మంత్రోచ్చారణతో పవిత్రవంతమైన జల ధారలను రాముని చేతుల్లో ధారపోశాడని సీత చెప్పింది.

శ్రీరామావతారం వైవస్వత మన్వంతరంలో ఐదవ మహాయుగమైన త్రేతాయుగంలో సంభవించింది. కొడుకులకై దశరథుడు పుత్రకామేష్టి చేయగా శ్రీరామ జననం అయింది. జన్మించింది విళంబినామ సంవత్సరం కాబట్టి హేవిళంబిలో అశ్వమేధయాగం, పుత్రకామేష్టి చేశాడు. దుర్ముఖి చైత్రమాసంలో అశ్వం విడిచారు. శ్రీరాముడి జనన కాలంలో గురువు, చంద్రుడు, కర్కాటక లగ్నంలో ఉన్నారు. అంటే జన్మ లగ్నం కర్కాటకం కాగా, మేషంలో రవి, బుధులు; తులలో శని, మకరంలో కుజుడు, మీనంలో శుక్రుడు ఉన్నారు. పునర్వసు నక్షత్రంలో బుధవారం నాడు శ్రీరామజననం. చైత్ర బహుళ పంచమి నాడు నామకరణం జరిగింది. పరాభవ నామ సంవత్సరంలో తొమ్మిదో ఏట ఉపనయనం జరిగింది. శ్రీరాముడికి 12 ఏళ్ల వయసున్నప్పుడు, సౌమ్యనామ సంవత్సరంలో యాగ రక్షణ కొరకు విశ్వామిత్రుడి వెంట అరణ్యాలకు పోయాడు. అరణ్యవాసానికి పోయేటప్పుడు శ్రీరాముడికి 25 ఏళ్లు కాగా, సీతాదేవికి 18 ఏళ్లు. శ్రీరాముడికి 12, సీతకు ఆరేళ్ళ వయసుల్లో వారి వివాహం జరిగింది.


ఈ నేపథ్యంలో ఒక్క విషయం చెప్పుకోవాలి ఇక్కడ. ఇటీవల కొందరు మహానుభావులు భద్రాచల క్షేత్రాన్ని రామనారాయణుడి గుడి చేశారు. శ్రీరాముడు పుట్టిన చైత్ర శుద్ధ నవమి నాడు భద్రాచలంలో కల్యాణం జరుగుతున్నదని అంటే, ఆ జరిగేది సీతాదేవికీ, శ్రీరాముడికే కదా! అలాంటప్పుడు, దశరథ, జనకుల గోత్రాలు, ప్రవర చెప్పకుండా... పూజారులు, అశేషమైన భక్తులను మభ్యపెడుతూ రామనారాయణ పేరుతో అచ్యుత గోత్రం చదివి, పరబ్రహ్మ శర్మ, వ్యూహనారాయణ శర్మ, విభవవాసుదేవ శర్మ చెబుతున్నారు. సీతాదేవికి సౌభాగ్య గోత్రం చెప్పి, విశ్వంభర శర్మ, రత్నాకర శర్మ, క్షీరార్ణవ శర్మ అంటున్నారు. ఇదెక్కడి న్యాయం? ఈ తప్పును ఎవరు సరిచేయాలి? ఇదేంటి అని ప్రశ్నించేవారిది అరణ్యరోదన అవుతున్నదే కానీ వినే నాథుడు ఎవరూ లేరని స్థానికుల ఆవేదన!

వ్యాసకర్త తెలంగాణ సీఎం సీపీఆర్వో
(నేడు శ్రీరామనవమి)

గురువే ఓ బోధన

అనగనగా ఓ యువకుడు ఒక జెన్ గురువు వద్దకు వెళ్లి తనకు ఏదైనా నేర్పమన్నాడు. అలాగేనని ఆ జెన్ గురువు అతనిని అక్కడే కూర్చోమన్నారు. చాలా మంది ఆ గురువుగారి దగ్గరకు వచ్చిపోతున్నారు. వచ్చిన వారందరూ తమ తమ సమస్యలు చెప్తుంటే వాటిని వింటున్న గురువు గారు అందరికీ తనకు తెలిసిన పరిష్కారాలు ఇస్తున్నారు.

కానీ తనను ఏమాత్రం పట్టించుకోవడం లేదని భావించిన యువకుడు గురువు దగ్గరకు వెళ్ళి 'అయ్యా, నేనూ చాలా సేపటి నుంచి మిమ్మల్నే చూస్తూ కూర్చున్నాను. ఎటూ పోలేదు. కానీ మీరు నాకేమీ బోధించలేదు. అయితే మీ వద్దకు వచ్చిన వారందరికీ ఏవేవో చెప్తున్నారు. నాకెప్పుడు నేర్పుతారు' అని అడిగాడు.



జ్యోతిర్మయం

అతను చెప్పినదంతా విన్న గురువుగారు ఓ చిన్న నవ్వు నవ్వారు. 'ఏమిటంటున్నావు? నీకు నేనేమీ చెప్పలేదా... ఎందుకలా అనుకుంటున్నావు? కొన్ని గంటల తరబడి నా దగ్గరకు వచ్చిపోతున్న వారందరికీ వారు అడిగిన వాటికల్లా సమాధానాలు చెప్తూనే ఉన్నాను కదా. వాటిని నువ్వు వింటూనే ఉన్నావుగా... వాటిలో కావలసిన వాటిని స్వీకరించు. నీకు ఏది ఉపయోగపడుతుందో వాటిని మనసులో ఉంచుకోవాలి' అన్నారు గురువుగారు.

గురువు అనే గొప్ప మనిషి ప్రత్యేకంగా దేనినీ బోధించరనీ, ఆయనే ఓ బోధన అనీ ఆ యువకుడికి తెలిసి వచ్చింది.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

గవర్నర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శ గుణగణాలు, ధర్మపాలనకు మారుపేరైన శ్రీరాముడి జన్మనక్షత్రం 'పునర్వసు'సందర్భంగా శ్రీరామనవమి ఉత్సవాలను దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా సీతారాముల కల్యాణమహోత్సవం నిర్వహించి ధర్మావతారమైన శ్రీరాముడిలా జీవించేందుకు స్ఫూర్తి పొందుతామన్నారు.

శ్రీరాముని జీవితం స్ఫూర్తిదాయకం: సీఎం



సాక్షి, హైదరాబాద్: ఎన్ని కష్టాలు ఎదురైనా నమ్మిన సత్యశీలత, ధర్మనిరతిని ఆచరించి చూపిన శ్రీరాముని జీవితం స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆయన రాష్ట్ర, దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారాముల వారి కల్యాణ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సీతారామచంద్రస్వామి కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రంతోపాటు, యావత్ భారతదేశం సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు.

ప్రజలకు ఏపీ సీఎం జగన్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు



సాక్షి,అమరావతి: ప్రజలకు ఏపీ సీఎం వైఎస్ జగన్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారాముల దీవెనలు, అనుగ్రహంతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని అభిలషించారు. భద్రాద్రి, ఒంటిమిట్ట ఆలయాలతో పాటు, తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంటింటా శ్రీరామ నవమి పర్వదినాన్ని, రాములవారి కళ్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

యువత శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: శ్రీరామచంద్రుడి ఆదర్శాలతో యువతరం నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సమృద్ధిని తీసుకురావాలని అభిలషిస్తున్నట్టు పేర్కొన్నారు.

వెన్నుపోటు పొడిచి కట్టుకథలా?: కొడాలి నాని



సాక్షి, అమరావతి: టీడీపీని స్థాపించిన ఎన్టీఆర్‌కు చంద్రబాబు ఎందుకు వెన్నుపోటు పొడిచారో పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజైనా సమాధానం చెప్పాలని ఏపీ మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) నిలదీశారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలు, పథకాలకు తూట్లు పొడిచి ఆయన ఆశయాలతో టీడీపీ నడుస్తోందంటూ చంద్రబాబు కట్టుకథలు చెబుతూ డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బడుగులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని చంద్రబాబు పెత్తందార్ల పార్టీగా మార్చారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ.2కే కిలో బియ్యం, హార్స్‌పవర్ రూ.50కే కరెంట్ వంటి పథకాలకు మంగళం పాడారు. రాజ్యసభ, ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు అమ్ముకుని టీడీపీని వ్యాపారసంస్థగా మార్చారు' అని పేర్కొన్నారు.

నేడు భద్రాద్రి రాముడి కల్యాణం

- కల్యాణ శోభ సంతరించుకున్న భద్రాచలం
- ఉభయ రాష్ట్రాల నుంచి పోటెత్తుతున్న భక్తులు
- వైభవంగా సాగిన ఎదుర్కోలు ఉత్సవం
- రేపు శ్రీరామచంద్రుడికి పుష్కర పట్టాభిషేకం



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/భద్రాచలం: పట్టాభిరాముడి కల్యాణానికి భద్రాచలం సిద్ధమైంది. పావన గోదావరి తీరంలో భద్రగిరిపై మిథిలా స్టేడియంలో ఏర్పాటుచేసిన కల్యాణ మండపంలో అభిజిత్ లగ్నంలో సీతమ్మ వారిని శ్రీరాముడు వివాహమాడనున్నారు. గురువారం జరగనున్న ఈ వేడుకను కనులారా చూసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు భద్రాచలానికి చేరుకుంటున్నారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఏటా వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అందులో భాగంగా చైత్రశుద్ధ నవమిన సీతారాములకు కల్యాణం జరిపిస్తారు. ఈసారి గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపంలో వైభవంగా వేడుకలు జరగనున్నాయి.

పోటెత్తుతున్న భక్తులు

జానకిరాముల కల్యాణ ఘట్టాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు భక్తులు భారీగా భద్రాచలానికి తరలివస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ సంస్థలు సుమారు 420 బస్సులను భద్రాచలానికి నడిపిస్తున్నాయి. వీటికి తోడు వ్యక్తిగత వాహనాల్లోనూ భక్తులు భద్రాచలం బాట పట్టారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచే భద్రాద్రిలో భక్తుల సందడి నెలకొంది. దేవస్థానం, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఉన్న సత్రాలు, ప్రైవేట్ లాడ్జీల్లో గదులన్నీ ఇప్పటికే బుక్ అయిపోయాయి. దీంతో దేవస్థానం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద కొందరు బస చేయగా మరికొందరు గోదావరి తీరంలో కరకట్ట, స్నానఘట్టాల దగ్గర ఆరు బయట విశ్రమించారు.

కొనసాగుతున్న ఏర్పాట్లు

శ్రీరామ నవమి వేడుకలకు లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా ఆలయం, మిథిలా స్టేడియం, గోదావరి తీరం వెంట స్నానఘట్టాలు, కరకట్ట, విస్తా కాంప్లెక్స్ దగ్గర ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపకాంతుల్లో రామాలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మిథిలా స్టేడియాన్ని సెక్టార్ల వారీగా విభజించి రూ.150 నుంచి రూ.7,500 వరకు వివిధ కేటగిరీల్లో టికెట్లు విక్రయానికి పెట్టగా సింహభాగం అమ్ముడయ్యాయి. ప్రధాన కూడళ్లలో తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలు, హెల్ప్ సెంటర్లు, సమాచార కేంద్రాలను ఏర్పాటుచేశారు. సుమారు రెండు వేల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు.

మా వంశం గొప్పది..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఉత్తర ద్వారం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. సీతమ్మ, రామయ్య తరఫున అర్చకులు రెండు బృందాలుగా విడిపోయి తమ వంశం గొప్పదంటే తమ వంశం గొప్పదంటూ వాదనలకు దిగడం ఆసక్తి కలిగించింది. వేలాది మంది భక్తుల మధ్య వాడీవేడిగా సంవాదం కొనసాగిస్తూ ఉత్సవాన్ని రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు పట్టాభిషేకం

నవమి రోజైన గురువారం కల్యాణం జరగనుండగా, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కోదండ రాముడికి పుష్కర పట్టాభిషేకం చేయనున్నారు. పట్టాభిషేక ఘట్టానికి గవర్నర్ తమిళిసై ప్రత్యేక అతిథిగా హాజరవుతారు.

ఖరారు కాని సీఎం పర్యటన

తానీషా కాలం నుంచి భద్రాద్రి రాముడి కల్యాణ వేడుకలకు పాలకులు స్వయంగా వచ్చి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. గత కొన్నేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ వేడుకలకు రాలేదు. ఆయన తరఫున దేవాదాయ శాఖ మంత్రులే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందిస్తున్నారు. ఈసారి కూడా బుధవారం రాత్రి వరకు సీఎం కేసీఆర్ భద్రాచలం పర్యటన అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. సీఎం కేసీఆర్ రాని పక్షంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించాలి

- వీహెచ్‌పీ నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

పంజగుట్ట (హైదరాబాద్): పన్నెండేళ్లకోసారి వచ్చే శ్రీరాముని పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారికంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, పండరీనాథ్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి మాట్లాడారు. రెండవ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారాముల వారిపై ముఖ్యమంత్రి పూర్తి వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తానీషా కాలం నుంచి ఎవరైతే రాజుగా (ముఖ్యమంత్రి గా) ఉంటారో వారే అధికారికంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారని గుర్తుచేశారు. ఆలయ అభివృద్ధికి వంద కోట్లు కేటాయిస్తున్నామని 2016లో ప్రకటించారని, 2017 బడ్జెట్‌లో కూడా పొందుపరిచారని, కానీ వంద రూపాయలు కూడా కేటాయించలేదని విమర్శించారు. శ్రీరామనవమి వేడుకలకు రూ.2 కోట్లు ఖర్చవుతుందని ఆలయ అధికారులు అంచనా వేసి ఫిబ్రవరిలోనే సీఎంకు నివేదిక పంపితే ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. దీంతో ఆలయ అధికారులు చందాలు వసూలు చేసేందుకు సిద్ధపడ్డారని, ఇంతటి ఘోరపరిస్థితి రాములవారికి మునుపెన్నడూ రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది తెలుసుకుని ఈనెల 28న రాత్రి రూ.కోటి ప్రకటించారని, ఒకరోజు ముందు ప్రకటిస్తే ఏర్పాట్లు ఎలా చేస్తారని నేతలు ప్రశ్నించారు. హిందువుల శోభాయాత్రలు అంటేనే 144 సెక్షన్ విధించడం, అనుమతులు అంటూ వేధించడం అనవాయితీగా మారిపోయిందని, శ్రీరాముని శోభాయాత్రకు ఎలాంటి అనుమతులు లేకుండా చేసుకునేలా పోలీసులు సహకరించాలని కోరారు. సమావేశంలో భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, రాంసింగ్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు!

- 10న మంత్రులు హరీశ్, గంగుల, నిరంజన్‌రెడ్డిలతో పౌరసరఫరాల అధికారుల సమావేశం

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఏప్రిల్ మూడో వారం నుంచి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతి తీసుకుని ఏప్రిల్ 21 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా అన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ, సంస్థల అధికారులకు ఆదేశాలు పంపారు. ఈసారి ధాన్యం సేకరణ ప్రక్రియ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. యాసంగి ధాన్యం సేకరణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక కోసం ఏప్రిల్ 10న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి భేటీ కానున్నారు. పౌరసరఫరాలు, వ్యవసాయ అనుబంధ శాఖల రాష్ట్రస్థాయి అధికారులతో పాటు.. అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, జిల్లా మేనేజర్లతో హైదరాబాద్ ఎంసీహెచ్చార్డీలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 56.45 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 1.40 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి ఉంటుంది. దీనిలో ప్రైవేటు అమ్మకాలు, సొంత అవసరాలు పోగా.. 80 నుంచి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశముంది. ఈమేరకు 7 వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన గోనె సంచులతో పాటు ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, కాంటాలు, ప్రొక్యూర్మెంట్ చేయాలని మార్కెటింగ్ శాఖను కూడా అప్రమత్తం చేశారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖమంత్రి గంగుల కమలాకర్ సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు సమాచారం. ముఖ్యమంత్రి అనుమతితో కార్యాచరణ ప్రారంభం కానుంది.

'దిశ' కేసులో వాయిదాలు సరికాదు

- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు అసహనం
- నిందితుల ఎన్‌కౌంటర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ
- ఏప్రిల్ 12కు వాయిదా వేసిన ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన 'దిశ'హత్య కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో వాదనలు వినిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాయిదాలు కోరడంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వాదనలను వినిపించకుండా తప్పించుకుంటున్నట్లు కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. రాష్ట్రం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది వాదిస్తారని, అత్యున్నత న్యాయస్థానంలో వ్యాజ్యాలకు హాజరుకావడంలో ఆయన చాలా బిజీగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ ఉండగా, ఢిల్లీ నుంచి న్యాయవాదులు ఎందుకు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఏదేమైనా చివరి వాదనలను ఏప్రిల్ 12కు వాయిదా వేస్తున్నామని, ఆ రోజు నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా అయినా వాదనలు వినిపించాలని సీజే ధర్మాసనం ఆదేశించింది.

పోలీసులపైనే హత్య కేసు పెడితే ఎలా అన్న సీనియర్ న్యాయవాది

– 2019, డిసెంబర్ 6న 'దిశ'కేసు నిందితుల ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌ను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాం జీ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. 'దిశ'కేసు అత్యాచారం, హత్య కేసులో దర్యాప్తు అధికారి తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపించారు. పోలీసులపైనే హత్య కేసు పెడితే పోలీసు అధికారి జీవించే హక్కుకు భంగం కలిగినట్టే అవుతుందన్నారు. ఆర్టికల్ 21 కింద నిర్దేశించిన జీవించే హక్కు ప్రమాదంలో ఉన్నప్పుడు పౌరులు హైకోర్టుకు వస్తారని.. కానీ, కమిషన్ నివేదిక ఆధారంగా కేసు నమోదుకు హైకోర్టు ఆదేశిస్తే, పోలీసు అధికారులు ఎక్కడికి వెళ్లగలరని ప్రశ్నించారు. 'దిశ'తండ్రి తరఫున కె.వివేక్‌రెడ్డి వాదిస్తూ.. 2012లో ఏపీ హైకోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం హత్యల ఘటనల్లో పోలీసులు తగిన విధానాన్ని అనుసరించాలని స్పష్టంగా పేర్కొందన్నారు. కమిషన్ నివేదికను పరిగణనలోకి తీసుకునే ముందు విధివిధానాలను అనుసరించాలన్నారు. నిందితుల హత్యలను 'దిశ'తండ్రి సమర్థిస్తున్నారా అని ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఆస్పత్రి బాత్‌రూమ్‌లో ప్రసవించిన మహిళ

- నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో దారుణం

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చిన ఓ మహిళ.. ఆస్పత్రి బాత్‌రూమ్‌లోనే ప్రసవించింది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ తన భర్త లింగయ్యతో కలిసి నాలుగు రోజుల కిందట రెండో కాన్పు కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చింది. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ప్రసవానికి మరో వారం రోజులు పడుతుందని చెప్పారు. అయితే, పార్వతమ్మకు బుధవారం ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. ఆ సమయంలో ఆమె బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. నొప్పులు ఎక్కువ కావడంతో పార్వతమ్మ అక్కడే ప్రసవించింది. ఆస్పత్రి సిబ్బంది శిశువును ఐసీయూకు తరలించి తల్లీబిడ్డలకు చికిత్స అందిస్తున్నారు. నొప్పులు వచ్చిన సమయంలో సరైన విధంగా వైద్యులు స్పందించి చికిత్స చేసి ఉంటే బాత్‌రూమ్‌లో ప్రసవించేదికాదని, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని పార్వతమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నిస్తుండగా అకస్మాత్తుగా నొప్పులు రావడంతో ప్రసవించిందని వైద్యులు చెబుతున్నారు.

సీఎంఓ దృష్టికి 'జీరో' బిల్లుల వ్యవహారం

- నాగర్‌కర్నూల్‌లో విద్యుత్ కనెక్షన్లకు జీరో యూనిట్లపై ఈఆర్సీ నివేదిక

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏకంగా 10,783 విద్యుత్ కనెక్షన్లకు జీరో యూనిట్ల విద్యుత్ వినియోగంతో బిల్లులు జారీ చేసిన వ్యవహారాన్ని .. ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) తీసుకెళ్లినట్టు తెలిసింది. డిస్కంల నష్టాలపై ఇప్పటికే ఆందోళనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సీరియస్‌గా స్పందించినట్టు సమాచారం. సీఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు ఈ అంశంపై పరిశీలన చేస్తున్నట్టు తెలియవచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తప్పుడు విద్యుత్ బిల్లులు జారీ వ్యవహారంపై విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదిక ఆధారంగా '10,783 కనెక్షన్లకు జీరో బిల్లు'శీర్షికతో బుధవారం 'సాక్షి'లో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పందిస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్) యాజమాన్యం వివరణ ఇచ్చింది. మీటర్లు లేకుండా బిల్లులు జారీ చేసిన 'కొన్ని సర్వీసు కనెక్షన్ల'ను గుర్తించి తక్షణమే వాటికి మీటర్లను అమర్చినట్టు పేర్కొంది. అయితే, 10,783 కనెక్షన్లలో ఏకంగా 4,842 కనెక్షన్లకు మీటర్లు లేవని గతంలో నాగర్‌కర్నూల్ డీఈ(టెక్నికల్) సమర్పించిన నివేదికలో పేర్కొనడం గమనార్హం.

సంస్థకు నష్టమేమి జరగలేదు: మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల జారీ కోసం సెక్షన్ ఆటోమేషన్ సిస్టం యాప్(సాసా) విధానాన్ని 2022 అక్టోబర్‌లో అమలు చేయగా, నాగర్‌కర్నూల్‌లోని మారుమూల ఎస్టీ, ఎస్సీల తాండాల్లోని గృహాలకు బిల్లుల జారీలో సమస్యలున్నట్టు గుర్తించామని టీఎస్ఎస్పీడీసీఎల్ వివరణలో పేర్కొంది. ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాకి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, వారి సగటు వినియోగం 101 యూనిట్లలోపే ఉండడంతో ఈ వ్యవహారంతో సంస్థకు ఎలాంటి నష్టం జరగలేదని తెలిపింది.

నా రిపోర్టుతోనే డిజిటల్ కరెన్సీ

- గతంలో నేనిచ్చిన రిపోర్టు ఆధారంగానే వాజ్‌పేయి సెల్‌ఫోన్లు తెచ్చారు
- అవినీతి పోవాలంటే 500, 1,000, 2,000 నోట్లను రద్దు చేసి డిజిటల్ కరెన్సీ తేవాలి
- విజన్–2047 రిపోర్టు తయారు చేయాలని జీ–20 సమావేశంలో మోదీకి చెప్పా..
- 25 ఏళ్ల కిందటి నా కృషి వల్లే నేడు హైదరాబాద్ రూపురేఖలు మారాయి
- టీడీపీ 41వ ఆవిర్భావ సభలో చంద్రబాబు



సభలో కార్యకర్తలు బహూకరించిన నాగలితో చంద్రబాబు. చిత్రంలో బాలకృష్ణ, అచ్చెన్న, కాసాని

సాక్షి, హైదరాబాద్: ''ఐటీ విషయంలో నీకు బాగా అనుభవం ఉంది. డిజిటల్ కరెన్సీ మీద రిపోర్టు ఇవ్వు అని ప్రధాని మోదీ అడిగితే రిపోర్టు ఇచ్చాను. నేనిచ్చిన రిపోర్టు ఆధారంగానే డిజిటల్ కరెన్సీని తెచ్చారు. ఈరోజు కూరగాయల దుకాణం నుంచి ఎక్కడ చూసినా డిజిటల్ కరెన్సీ ఉంది. అలాగే 500, వెయ్యి, రెండు వేల నోట్లు రద్దు చేసి డిజిటల్ కరెన్సీని డెవలప్ చేద్దామని చెప్పాను. అది వస్తే దేశ ఆదాయం పెరుగుతుంది..''అని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. తెలుగుదేశం పార్టీ 41వ వ్యవస్థాపక దినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎప్పటిలాగానే తన గురించి చెప్పుకునేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలో పెద్దనోట్లను రద్దు చేసి, డిజిటల్ కరెన్సీని అభివృద్ధి చేయాలని, అప్పుడే అవినీతి పోతుందని చెప్పారు.

నా వల్లే సెల్‌ఫోన్లు వచ్చాయి: గతంలో తాను ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే వాజ్‌పేయి టెలికం రంగంలో సంస్కరణలు తెచ్చారని, సెల్‌ఫోన్లు వచ్చాయని అన్నారు. ఇటీవల ఓ సమావేశంలో ప్రధాని మోదీని కలిసినప్పుడు విజన్–2027 రిపోర్టు తయారు చేయాలని.. దానితో ప్రపంచంలో భారత్ నంబర్ వన్ అవుతుందని చెప్పానని వివరించారు. అంటరానితనాన్ని నిర్మూలించిన పార్టీ టీడీపీ అని, జస్టిస్ పున్నయ్య కమిషన్ ద్వారా అంటరాని తనం లేకుండా చేశానని అన్నారు. మొదటి నేషనల్ హైవే తెలుగుదేశం హయాంలోనే వచ్చిందన్నారు. 1995లో తాను సీఎం అయిన తర్వాతే రంగారెడ్డి జిల్లాలో, రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు వచ్చాయని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అధికారం కావాలని ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాలేదని, తెలుగు ప్రజల రుణం తీర్చుకునేందుకే పార్టీ పెట్టారన్నారు. త్వరలో రాజమండ్రిలో మహానాడు నిర్వహిస్తామని, ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు పాటుపడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇక హిందూపురం ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు సినీ రంగానికి, రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ సభలో పార్టీ తెలంగాణ, ఏపీల అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, అచ్చెన్నాయుడు, నందమూరి రామకృష్ణ, పార్టీ ఏపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

బెంగాల్‌పై కేంద్రం వివక్ష

మమతా బెనర్జీ ధర్నా



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌పై మోదీ సర్కారు దారుణమైన వివక్ష చూపుతోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. కేంద్ర పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులివ్వడం లేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా బుధవారం కోల్‌కతాలో ఆమె రెండు రోజుల ధర్నా ప్రారంభించారు. పార్టీ సీనియర్ నేతలు ఇందులో పాల్గొన్నారు. పార్టీ తరపున ధర్నా చేస్తున్నట్టు మమత తెలిపారు.

కేంద్రంలో ఉద్యోగ ఖాళీలు... 9.79 లక్షల పై చిలుకు!

న్యూఢిల్లీ: కేంద్రంలో పలు విభాగాల్లో 9.79 లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉందని ప్రభుత్వం బుధవారం తెలిపింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ''2021 మార్చి 1 నాటికి అన్ని శాఖలు, విభాగాలు, సంస్థల్లో 9.79 లక్షలకుపైగా ఖాళీలున్నాయి. రైల్వేశాఖలోనే 2.93 లక్షలున్నాయి. రక్షణ శాఖలో 2.64 లక్షలు, హోం శాఖలో 1.43 లక్షలు, రెవెన్యూలో 80,243, ఆడిట్–అకౌంట్ విభాగంలో 25,934, అణు ఇంధన శాఖలో 9,460 ఖాళీలున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని ఆదేశించాం'' అన్నారు.

జైపూర్ పేలుళ్ల కేసులో నలుగురు దోషులకు విముక్తి

జైపూర్: 2008 మే 13న జరిగిన జైపూర్ వరుస బాంబు పేలుళ్ల కేసులో కిందికోర్టులో మరణ శిక్ష పడిన నలుగురికి రాజస్తాన్ హైకోర్టు బుధవారం విముక్తి కలిగించింది. దర్యాప్తు సంస్థలు సక్రమంగా విచారణ చేపట్టలేదని ఆక్షేపించింది. ఐదో నిందితుడికి ట్రయల్ కోర్టులో ఇప్పటికే లభించిన విముక్తిని కోర్టు సమర్థించింది. ఐదేళ్ల క్రితం జైపూర్‌లో వరుస బాంబు పేలుళ్లలో 71 మంది మృతిచెందారు. 185 మంది గాయపడ్డారు. ఈ కేసులో 2019 డిసెంబర్‌లో ప్రత్యేక న్యాయస్థానం మొహమ్మద్ సైఫ్, మొహమ్మద్ సల్మాన్, సైఫుర్, మొహమ్మద్ సర్వర్ అజ్మీకి మరణ శిక్ష విధించింది. షహబాజ్ హుస్సేన్ అనే నిందితుడిని నిర్దోషిగా తేల్చింది. మరణ శిక్షను సవాలు చేస్తూ నలుగురు దోషులు రాజస్తాన్ హైకోర్టును ఆశ్రయించారు.

3 కర్ణాటకలో ముక్కలాట!



బీజేపీ..

అనుకూలం..
- ప్రధాని మోదీ ఇమేజ్. కేంద్ర నేతలు చేస్తున్న పర్యటనలు. డబుల్ ఇంజిన్ నినాదం.
- సంఘ పరివార్ సంస్థాగత బలం.
- లింగాయత్ సామాజిక వర్గం మద్దతు, వక్కలిగ అనుకూల వైఖరితో మైసూర్ ప్రాంతంలో పెరుగుతున్న పట్టు.
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు.
- డిజిటల్ మీడియా ప్రచారంలో పార్టీకున్న పట్టు.

వ్యతిరేకం..
- ప్రభుత్వ వ్యతిరేకత, బొమ్మై ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు.
- 40% కమీషన్ల ప్రభుత్వమన్న విపక్షాల ఉధృత ప్రచారం.
- ఎన్నికలకు ముందు మైనార్టీల ఓబీసీ కోటా రద్దుతో ముస్లింలు పార్టీకి మరింత దూరం.
- టికెట్ దక్కే అవకాశం లేని ఆశావహుల అసమ్మతి.

జేడీ(ఎస్)

అనుకూలం..
- వక్కలిగ సామాజిక వర్గం మద్దతు.
- కన్నడ ఆత్మగౌరవం నినాదం మిన్నంటుతున్న వేళ ప్రాంతీయ పార్టీగా ఉన్న ఇమేజ్.
- రైతు అనుకూల విధానాలతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టు.
- హంగ్ వస్తే బీజేపీ, కాంగ్రెస్‌ల్లో ఎవరికైనా మద్దతివ్వగల వైఖరి.

వ్యతిరేకం..
- కుటుంబ పార్టీ ముద్ర.
- వక్కలిగ మినహా మిగతా సామాజిక వర్గాల ఆధిపత్యమున్న ప్రాంతాల్లో ఎదగకపోవడం.
- సొంత బలంపై పార్టీ అధికారంలోకి వచ్చే సత్తా లేకపోవడం.. చాలాచోట్ల గెలుపు గుర్రాలు లేకపోవడం.
- 2018 నుంచి పార్టీ నుంచి కొనసాగుతున్న వలసలు.

కాంగ్రెస్

అనుకూలం
- బలమైన స్థానిక నాయకత్వం.
- బీజేపీ హిందూత్వ ఎజెండాను ఎదుర్కోవడానికి అనుసరిస్తున్న అహిండా (మైనార్టీలు, వెనుకబడిన తరగతులు, దళితుల) సోషల్ ఇంజనీరింగ్ విధానంతో. తద్వారా వర్గాల ఓటు బ్యాంకును ఆకట్టుకునే ప్రయత్నం.
- బీజేపీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలపై పేసీఎం, 40% కమీషన్ అంటూ చేస్తున్న ప్రచారం.
- కర్నాటకకు చెందిన దళిత నేత మల్లిఖార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడయ్యాక వస్తున్న తొలి ఎన్నికలు కావడంతో ఆ వర్గం ఓటు బ్యాంకును కొల్లగొట్టే అవకాశం.
- గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్రాడ్యుయేట్లకు రూ.3,000 నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,000 ఆర్థిక సాయం వంటి హామీలు.

వ్యతిరేకం
- శివకుమార్, సిద్దరామయ్య వర్గాల మధ్య పోరు.
- జి.పరమేశ్వర, హెచ్.కె.పాటిల్, కె.హెచ్.మునియప్ప వంటి నేతల్ని పక్కన పెట్టడంతో అసమ్మతి. కీలకమైన లింగాయత్ సామాజిక వర్గంలో ఓటు బ్యాంకును పెంచుకోలేకపోవడం.
- ప్రధాని మోదీ ఇమేజ్‌కి దీటైన కేంద్ర నాయకత్వం లేకపోవడం.
- ఆశావహులు ఎక్కువవటంతో అసమ్మతి భగ్గుమనే ఆస్కారం.


అధికార వ్యతిరేకతకు ఎదురొడ్డి 40 ఏళ్ల చరిత్రను తిరగరాయాలని తహతహలాడుతూ బీజేపీ..
కన్నడ నాట పార్టీ జెండా ఎగురవేసి 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని పొందాలని కాంగ్రెస్..
కన్నడ ఆత్మగౌరవ నినాదాన్ని మరింత రాజేసి కింగ్‌మేకర్ స్థాయి నుంచి కింగ్‌గా మారాలని జేడీ(ఎస్)..

పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలతో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రసకందాయంలో పడ్డాయి


సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటక ఓటర్లు ప్రతీసారి ఒకే తీర్పు ఇవ్వడం లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. 1985 నుంచి ఏ పార్టీ కూడా వరసగా రెండోసారి గెలవలేదు. ఈసారీ అదే సంప్రదాయం కొనసాగుతుందా, అధికార బీజేపీకి మళ్లీ పట్టం కడతారా అన్నది ఉత్కంఠగా మారింది. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రభుత్వంపై అధికార వ్యతిరేకతను ప్రధాని మోదీ ఇమేజీతో ఎదుర్కొనే వ్యూహంతో బీజేపీ ముందుకు వెళుతోంది. మొత్తం 224 అసెంబ్లీ స్థానాల్లో 150 సీట్లు గెలవడం లక్ష్యంగా పెట్టుకుంది. బలహీనంగా ఉన్న పాత మైసూరు (ఉత్తర కర్ణాటక)లో బలపడటంపై దృష్టి పెట్టింది. 89 స్థానాలున్నా ప్రాంతంలో మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తరచూ పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర బీజేపీ అంతగా బలంగా లేకపోవడం, బొమ్మై ప్రభుత్వంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదాన్నే వారు నమ్ముకున్నారు. 100 సీట్లలో కీలకమైన లింగాయత్ ఓటు బ్యాంకును నమ్ముకుంది. బీజేపీ ఇలా కేంద్ర నాయకత్వాన్ని నమ్ముకుంటే, కాంగ్రెస్‌కు స్థానిక నాయకత్వమే బలంగా ఉంది. పీసీసీ చీఫ్ డి.కె శివకుమార్, సీనియర్ నేత సిద్దరామయ్య కుడి, ఎడమ భుజాలుగా ఉన్నారు. ముస్లింల 4 శాతం రిజర్వేషన్ల రద్దు, ధరల పెరుగుదల, హిజాబ్ వంటివాటిపై పార్టీ దృష్టి పెట్టింది. ప్రభుత్వ అవినీతిని ప్రధానాస్త్రంగా మలచుకుంటోంది. జేడీ(ఎస్) కన్నడ ఆత్మగౌరవ నినాదంతో ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది. మాజీ సీఎం హెచ్.డి.కుమారస్వామి అంతా తానై నడుపుతున్నారు. ముక్కోణ పోరులో విజయం ఎవరిదోనన్న ఉత్కంఠ నెలకొంది....

జనాభాలో ఎవరెంత?



కర్ణాటకలో మొత్తం అసెంబ్లీ స్థానాలు: 224



కాంగ్రెస్‌దే అధికారం..!

కర్ణాటక ఎన్నికల నగారా మోగిన రోజే విడుదలైన ఏబీపీ–సీఓటర్ ఎన్నికల సర్వే కాంగ్రెస్ పార్టీయే అధికారాన్ని హస్తగతం చేసుకుంటుందని అంచనా వేసింది. కాంగ్రెస్‌కు 115 నుంచి 127 సీట్లు వస్తాయని, బీజేపీ 68–80 సీట్లు గెలుచుకుంటే జేడీ (ఎస్) 23–25 సీట్లతో సరిపెట్టుకుంటుందని సీ ఓటర్ సర్వేలో తేలింది. బసవరాజ్ బొమ్మై పరిపాలన అసలు బాగోలేదని సర్వేలో పాల్గొన్న ఏకంగా 50.5%మంది తేల్చి చెప్పారు. 57శాతం మంది ప్రస్తుత ప్రభుత్వం మారిపోవాలని అభిప్రాయపడినట్టు ఆ సర్వే వెల్లడించింది.

మే 10న కర్ణాటక ఎన్నికలు

షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మరో కీలక ఎన్నికల పోరుకు తెర లేచింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మే 10న ఒకే దశలో రాష్ట్రంలో పోలింగ్ ముగియనుంది. ఫలితాలు మే 13న వెల్లడవుతాయి. ఈ మేరకు రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఆ వెంటనే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియామవళి కూడా అమల్లోకి వచ్చింది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బుధవారం పోలింగ్ జరపాలని నిర్ణయించినట్టు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ చెప్పారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సోమ, శుక్రవారాల్లో పోలింగ్ ఉంటే ఆ రోజు సెలవు వీకెండ్‌తో కలిసిపోయి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా రూ.80 కోట్ల నగదు జప్తు చేశామని వివరించారు.

- కర్ణాటకలో మొత్తం ఓటర్లు 5.24 కోట్లు.
- మొత్తం 58,282 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు.
- సగం పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్.
- 1,320 పోలింగ్ స్టేషన్లలో మహిళా సిబ్బంది.
- అత్యంత వెనకబడ్డ గిరిజన జాతుల కోసం 40 ఎత్నిక్ పోలింగ్ స్టేషన్లు.
- థర్డ్ జెండర్ ఓటర్లు కూడా పోలింగ్‌లో భారీగా పాల్గొనేలా చర్యలు.

కర్ణాటక ఎన్నికల ముఖచిత్రం

- ✔ నోటిఫికేషన్ విడుదల: ఏప్రిల్ 13
- ✔ నామినేషన్ల దాఖలుకు గడువు: ఏప్రిల్ 20
- ✔ నామినేషన్ల పరిశీలన: ఏప్రిల్ 21న
- ✔ ఉపసంహరణకు చివరి తేదీ: ఏప్రిల్ 24
- ✔ పోలింగ్: మే 10
- ✔ ఫలితాలు: మే 13

వయనాడ్‌పై తొందరేమీ లేదు: ఈసీ

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించే విషయంలో తామేమీ తొందర పడటం లేదని ఈసీ పేర్కొంది. ఫిబ్రవరి నాటికి ఖాళీ అయిన నియోజకవర్గాల ఎన్నికలపై మాత్రమే ప్రస్తుతానికి నిర్ణయం తీసుకున్నట్టు సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. 'మోదీ ఇంటిపేరు' వ్యాఖ్యలపై పరువు నష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించడం, ఆ వెంటనే ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దవడం తెలిసిందే. ''అప్పీలుకు రాహుల్‌కు నెల రోజుల గడువున్నందున వేచి చూస్తాం. ఆ తర్వాత ఓ నిర్ణయానికి వస్తాం'' అని సీఈసీ సీఈసీ చెప్పారు.

లక్షద్వీప్ ఎంపీ సభ్యత్వం పునరుద్ధరణ

- లోక్‌సభ సచివాలయం నిర్ణయం • సభకు హాజరైన ఫైజల్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. హత్యాయత్నం కేసులో పదేళ్ల కఠిన కారాగార శిక్ష నేపథ్యంలో రద్దు చేసిన లక్షద్వీప్ ఎన్సీపీ ఎంపీ మొహమ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పది వారాల అనంతరం లోక్‌సభ పునరుద్ధరించింది. శిక్ష అమలుపై కేరళ హైకోర్టు జనవరి 25న స్టే ఇచ్చింది. తన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని అప్పటినుంచీ ఆయన లోక్‌సభ స్పీకర్‌ను కోరుతున్నారు. కేంద్ర న్యాయ శాఖ కూడా ఆ మేరకు సిఫార్సు చేసింది. అయినా లాభం లేకపోవడంతో ఫైజల్ మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బుధవారం దానిపై విచారణకు కొద్ది గంటల ముందు వేటును ఎత్తేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది! దీన్ని ఎన్సీపీ స్వాగతించింది. ఈ పని ఎప్పుడో చేసుండాల్సిందని పేర్కొంది. ఫైజల్ బుధవారం లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యారు. ఈ నిర్ణయాన్ని తానూహించలేదన్నారు. విషయాన్ని ఇంతకాలం సాగదీయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఫైజల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు నేపథ్యంలో లక్షద్వీప్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరపనున్నట్టు జనవరి 18న ఎన్నికల సంఘం ప్రకటించింది! కేరళ హైకోర్టు స్టే నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని జనవరి 30న వెనక్కు తీసుకుంది.

ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి భారత్

- పాలకులను ఎన్నుకొనే ఆలోచన ఇక్కడే పుట్టింది
- 'ప్రజాస్వామ్యం కోసం శిఖరాగ్ర' సదస్సులో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిలాంటిదని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ''అంతర్జాతీయంగా ఎన్నో ప్రతికూలతలు ఉన్నా, వేగంగా ఎదుగుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ప్రజాస్వామ్యంతో సత్ఫలితాలు లభిస్తాయనడానికిదే నిదర్శనం'' అన్నారు. గురువారం నిర్వహించిన 'ప్రజాస్వామ్యం కోసం శిఖరాగ్ర సదస్సు–2023'లో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు దేశ ప్రజల సమ్మిళిత ప్రయత్నాలే తగిన బలాన్ని ఇస్తున్నాయని చెప్పారు. పాలకులను ప్రజలంతా కలిసి ఎన్నుకొనే ఆలోచన ప్రపంచ దేశాల కంటే చాలా ఏళ్ల ముందే భారత్‌లో ఆవిర్భవించిందని గుర్తుచేశారు. ప్రజల ప్రథమ విధి పాలకులను ఎన్నుకోవడమేనని మహాభారతంలో ఉందని తెలిపారు. ప్రాచీన భారతదేశంలో ఎన్నో గణతంత్ర రాజ్యాలుండేవని చెప్పడానికి చారిత్రక ఆధారాలున్నాయని వివరించారు. ''గణతంత్ర రాజ్యాల్లో పాలనాధికారం వారసత్వంగా దక్కేది కాదు. పాలకులను ప్రజలు ఎన్నుకునేవారు'' అని వెల్లడించారు. ప్రజాస్వామ్యం అనేది కేవలం ఒక నిర్మాణం కాదని, అదొక స్ఫూర్తి అని మోదీ పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యం కోసం శిఖరాగ్ర సదస్సు–2023'కు అమెరికా, కోస్టారికా, జాంబియా, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా దేశాల అధినేతలు ఆతిథ్యం ఇస్తున్నారు.

'అవినీతిపరులూ పారిపోండి' పథకం !

ప్రధాని మోదీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విసుర్లు



న్యూఢిల్లీ: అవినీతిపరులంతా ఒక్కటవుతున్నారంటూ విపక్షాలపై ప్రధాని మోదీ చేసిన విమర్శలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఘాటుగా స్పందించారు. 'అదానీ షెల్ కంపెనీల్లో ఎవరు రూ.20,000 కోట్లు పెట్టుబడి పెట్టారు? లలిత్ మోదీవా, నీరవ్ మోదీవా?మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతావా? భారత్‌లో వేలకోట్లు ఎగొట్టి విదేశాలకు పారిపోయిన 'అవినీతిపరులూ, పారిపోండి' పథకం సభ్యులా? ఈ కూటమికి మీరే కన్వీనర్‌గా ఉన్నారా?'' అంటూ బుధవారం ట్వీట్ చేశారు.

అదే కోలార్ నుంచి కాంగ్రెస్ సత్యమేవ జయతే

బెంగళూరు: 'దొంగలందరి ఇంటి పేరు మోదీ' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాలుగేళ్ల క్రితం చేసిన వివాదాస్పద ప్రసంగానికి వేదికైన కర్ణాటకలోని కోలార్ నుంచే 'సత్యమేవ జయతే' పేరిట ఏప్రిల్ 5న జాతీయ స్థాయి నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుడుతోంది. ఆ వ్యాఖ్యలపై నేరపూరిత పరువునష్టం కేసులో రాహుల్‌పై ఎంపీగా అనర్హత వేటు పడటం తెల్సిందే. ''రాహుల్ ప్రసంగంతో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం మొదలవుతుంది. అలా కోలార్ మార్పుకు వేదిక కానుంది'' అని పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ చెప్పారు.

మత రాజకీయాలు ఆపితేనే... విద్వేష ప్రసంగాలకు తెర: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు కన్నెర్రజేసింది. రాజకీయ నాయకులు మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం ఆపినప్పుడే వాటికి అడ్డుకట్ట పడుతుందని పేర్కొంది. ''దేశం ఎటు పోతోంది? విద్వేష ప్రసంగాలు ఓ విషవలయం. రాజకీయాలను మతంలో కలపడం పెను సమస్యకు దారి తీస్తోంది. విచ్ఛిన్న శక్తులే ఇందుకు పాల్పడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం తక్షణం ఓ మార్గం చూడాలి'' అని న్యాయమూర్తులు కె.ఎం.జోసెఫ్, బి.వి.నాగరత్న ధర్మాసనం బుధవారం అభిప్రాయపడింది. ఇటీవలి తీర్పులోనూ సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని నొక్కిచెప్పిందని గుర్తు చేసింది. ''టీవీల్లో, మీడియాలో, బహిరంగ వేదికలపై రోజూ ఇలాంటి శక్తులు ఇతరులపై విద్వేష వ్యాఖ్యలకు పాల్పడుతూనే స్తూనే ఉన్నాయి. ఎంతమందిపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టగలం? తోటివారిపై, సామాజిక వర్గాలపై విద్వేష వ్యాఖ్యలు చేయబోమని ప్రజలే ప్రతినబూనితే బాగుంటుంది'' అని సూచించింది. దివంగత ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటివారి ప్రసంగాలు ఎంతో హుందాగా ఉండేవంటూ గుర్తు చేసింది.

వాడీవేడి వాదనలు

''విద్వేష ప్రసంగాలపై సకాలంలో చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు నిస్తేజంగా మారాయి. అందుకే కోర్టులకు పని పడుతోంది'' అంటూ ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇలా మౌనంగా ఉండే పక్షంలో ప్రభుత్వాల ఉనికికి అర్థమేముందని ప్రశ్నించింది? రాష్ట్రాల సంగతేమోగానీ ఈ వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వానికి వర్తించవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. కేరళ, తమిళనాడుల్లో నేతల విద్వేష ప్రసంగాల ఉదంతాలను కూడా ఈ పిటిషన్‌తో కలిపి విచారించాలని కోరారు. వాటికి సంబంధించిన వీడియో క్లిప్‌ల ప్రదర్శనకు అనుమతించాలని కోరడంతో దీన్నో డ్రామాగా మార్చొద్దని ధర్మాసనం పేర్కొంది. ''దేనికైనా ఓ పద్ధతుంటుంది. మేం వీడియో క్లిప్‌లు చూడాలని మీరు భావిస్తే దాన్ని మీ పిటిషన్లో చేర్చండి'' అని సూచించింది. విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేసింది.

క్రైస్తవులపై దాడులపై నివేదిక సమర్పించండి

కేంద్ర హోంశాఖకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశంలో క్రైస్తవ సంస్థలు, క్రైస్తవ మతపెద్దలు, క్రైస్తవులపై దాడులపై నివేదిక సమర్పించాలని కేంద్ర హోం శాఖను సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. వీటిని అరికట్టడానికి గతంలో తాము జారీ చేసిన మార్గదర్శకాల అమలుపైనా నివేదిక ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం పేర్కొంది. విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది.



మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్కులో కనువిందు చేస్తున్న నాలుగు బుల్లి చీతాలు. నమీబియా నుంచి తీసుకొచ్చిన చీతాల్లో ఒకటి తాజాగా వీటికి జన్మనిచ్చింది.

పార్లమెంట్‌లో అదే రచ్చ

అదానీపై జేపీసీ నియమించాలని విపక్షాల డిమాండ్

- లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు, నిరసనలు
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా
- లోక్‌సభలో కాంపిటీషన్ (సవరణ) బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ డిమాండ్లపై ఏమాత్రం పట్టు వీడటం లేదు. బుధవారం సైతం ఎంపీల నినాదాలు, నిరసనల కారణంగా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. కేంద్రం తీరుకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు నల్లదుస్తులతో హాజరయ్యారు. అదానీ ఉదంతంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారు. దాంతో సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13న ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఉభయ సభల్లో రగడ కొనసాగుతూనే ఉంది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు జేపీసీ కోసం నినాదాలు ప్రారంభించారు. 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 దాకా వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమయ్యాక సభ్యుల నినాదాల మధ్యే కేంద్ర పర్యావరణ శాఖ భూపేంద్ర యాదవ్ అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు–2023ను ప్రవేశపెట్టారు. తర్వాత కాంపిటీషన్(సవరణ) బిల్లు–2022 ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు సభాపతి స్థానంలో ఉన్న రమాదేవి ప్రకటించారు. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా సెలవు కాగా, పలువురు సభ్యుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం సభ నిర్వహించవద్దని నిర్ణయించారు.



అదానీ–మోదీ భాయి భాయి

రాజ్యసభలోనూ ఉదయం సమావేశం ప్రారంభం కాగానే 'మోదీ–అదానీ భాయి భాయి' అంటూ కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. అదానీ గ్రూప్‌పై ఆరోపణలపై విచారణకు జేపీసీకి డిమాండ్ చేశారు. దాంతో సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. సభ పునఃప్రారంభమైన తర్వాత అటవీ(సంరక్షణ) సవరణ బిల్లు–2023పై జాయింట్ కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కమిటీలో బీజేపీ ఎంపీలు అశోక్ బాజ్‌పాయ్, అనిల్ బలూనీ, సమీర్ ఓరావాన్, సీఎం రమేశ్, ఏఐటీసీ ఎంపీ జవహర్ సిర్కార్, బీజేడీ ఎంపీ ప్రశాంత్ నందా, ఎడీఎఫ్ ఎంపీ హిషె లాచూంగ్‌పా, ఏజీపీ ఎంపీ బిరేంద్ర ప్రసాద్ భైశ్యాను సభ్యులుగా నియమించారు. మూజువాణి ఓటుతో తీర్మానం ఆమోదం పొందింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ వెల్లడించారు.

అమెరికా వీసాకు తగ్గిన ఎదురుచూపులు

వాషింగ్టన్: అమెరికా వీసా ఇంటర్వ్యూలకు వెయిటింగ్ పీరియడ్ భారీగా తగ్గిందని ఆ దేశ విదేశాంగ శాఖ డెప్యూటీ అసిస్టెంట్ (వీసా సేవలు) జూలీ స్టఫ్ వెల్లడించారు. పర్యాటక వీసా ఇంటర్వ్యూల వెయిటింగ్ 60 శాతం తగ్గిపోయిందని పీటీఐ వార్తా సంస్థతో చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు దౌత్య సేవలను పెంచినట్టు వివరించారు. కోవిడ్ ఆంక్షలు ఎత్తేశాక అమెరికా వీసాల కోసం భారత్ నుంచి దరఖాస్తులు వెల్లువెత్తడం తెలిసిందే. దాంతో బిజినెస్, టూరిస్ట్ వీసాల వెయిటింగ్ పీరియడ్ 2022 అక్టోబర్‌లో ఏకంగా 1,000 రోజులకు పెరిగింది. ఈ ఏడాది విద్యార్థి, ఉద్యోగి సహా అన్ని కేటగిరీల్లో 10 లక్షల వీసాలు జారీ చేయాలన్నది లక్ష్యమని స్టఫ్ చెప్పారు. 'వందకు పైగా దౌత్య మిషన్ల ద్వారా భారతీయులకు వీసాలు జారీ చేస్తున్నాం. బ్యాంకాక్, ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, అబుదాబీల్లోనూ దరఖాస్తులను ప్రాసెస్ చేస్తున్నాం. భారత్‌లో వీసాల జారీ ప్రక్రియ 40 శాతం పెరిగింది. గత నెలలో గరిష్టాన్ని తాకింది. కొన్ని విభాగాల్లో ఇంటర్వ్యూలను ఎత్తేయడంతో ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతమైంది. రెన్యువల్‌కు కోసం అమెరికాలోనే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాం. ఇది భారత టెకీలకు పెద్ద ఊరట'' అని చెప్పారు.



భోపాల్‌లో ఫౌజీ మేళాలో సెల్ఫీ పాయింట్ వద్ద సైనిక కటౌట్‌తో ఫొటో దిగుతున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్

క్లుప్తంగా...

జీపీఎఫ్ వడ్డీ 7.1 శాతం

ఆరు నెలల వడ్డీ నిర్ధారిస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) కింద జమ చేసుకునే మొత్తానికి వడ్డీని నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలోని రెండో అర్ధ వార్షికానికి అంటే... గత ఏడాది అక్టోబర్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జమ చేసుకున్న జీపీఎఫ్‌కు భారత ప్రభుత్వం నిర్ధారించిన మేరకు 7.1 శాతం వడ్డీని చెల్లించనున్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు భారత ప్రభుత్వం నిర్ధారించిన వడ్డీ రేటు చెల్లించనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాజధాని బస్సు దగ్ధం



ఖమ్మం మామిళ్లగూడెం/సూర్యాపేట క్రైం: ఖమ్మం డిపోకు చెందిన రాజధాని ఏసీ బస్సు మంగళవారం అర్ధరాత్రి సూర్యాపేట వద్ద దగ్ధమైంది. ఖమ్మం డిపోకు చెందిన (టీఎస్ 04 జెడ్ 0198) రాజధాని ఏసీ బస్సు మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకు 18 మంది ప్రయాణికులతో ఖమ్మం నుంచి మియాపూర్‌కు బయల్దేరింది. ఈ బస్సు సూర్యాపేట జిల్లా చివ్వెంలకు చేరుకోగానే బాయినెట్‌లో పొగలు రావడంతో డ్రైవర్ ఖమ్మం డిపో అధికారులకు సమాచారం ఇవ్వగా వారి సూచనల మేరకు ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. అప్పటికే చేరుకున్న ఖమ్మం మెకానిక్‌లతో కలిసి సూర్యాపేట డిపోకు బస్సును తరలిస్తుండగా...సూర్యాపేట బ్రిడ్జి వద్ద బాయినెట్‌లో మంటలు మొదలై ఉవ్వెత్తున ఎగిసిపడటంతో డ్రైవర్, మెకానిక్‌లు ఏమీ చేయలేకపోయారు. ఫైరింజన్ వచ్చినప్పటికీ మంటలు అదుపులోకి రాక బస్సు పూర్తిగా దగ్ధమైంది. కాగా, ఘటనాస్థలాన్ని పరిశీలించిన అధికారులు షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. బస్సు దగ్ధంతో రూ.25 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. కాగా, ఖమ్మం డిపోలో ఏసీ బస్సు నిర్వహణలో శిక్షణ పొందిన డ్రైవర్లు పది మందే ఉన్నారని, ప్రతీ డ్రైవర్ టిమ్ సర్వీస్ నడిపించాలనే ఉద్దేశంతో శిక్షణ లేని డ్రైవర్లతోనే వాటిని నడిపిస్తున్నారని, ఈ కారణంగా ప్రమాదం జరిగిందని తెలుస్తోంది.

శంషాబాద్‌లో 3 కేజీల బంగారం పట్టివేత



శంషాబాద్ (హైదరాబాద్): నలుగురు సుడాన్ మహిళల నుంచి 3 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. సుడాన్‌కు చెందిన నలుగురు మహిళలు దుబాయ్ నుంచి ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే–524 విమానంలో బుధవారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వీరి కదలికలను అనుమానించిన అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మలద్వారంలో క్యాప్సుల్స్ రూపంలో బంగారం తీసుకొచ్చినట్లు మహిళలు అంగీకరించడంతో.. వైద్యుల సాయంతో వాటిని బయటికి తీయించారు. మొత్తం 13 క్యాప్సుల్స్‌లో 3175 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించారు. బంగారం విలువ రూ.1.94 కోట్లు ఉంటుందని నిర్ధారించారు. ఈ మేరకు మహిళలను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరంతా బంగారం స్మగ్లర్లకు క్యారియర్లుగా వ్యవహరించినట్టు అనుమానిస్తున్నారు. బంగారం ఎవరికి సరఫరా చేస్తున్నారనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు.

డంపింగ్ యార్డులో చిరుత కళేబరం



నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ సమీపంలోని చందనపల్లి చెత్త డంపింగ్ యార్డులో బుధవారం చిరుత కళేబరం బయటపడింది. పది రోజుల క్రితం మృతిచెంది ఉంటుందని అటవీశాఖ అధికారులు, పశువైద్యులు భావిస్తున్నారు. 15 రోజుల క్రితం నల్లగొండ మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో చిరుత సంచరిస్తోందంటూ రైతులు అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు మాత్రం ఇక్కడ అటవీ ప్రాంతం లేనందున చిరుత వచ్చే అవకాశం లేదని కొట్టిపారేశారు. కాగా, డంపింగ్ యార్డు సమీప పొలాలను ఊర పందులు ధ్వంసం చేస్తుండటంతో రైతులు కొద్ది రోజుల క్రితం తవుడులో మందు కలిపి పెట్టారు. అది తిన్న ఓ పంది డంపింగ్ యార్డు వద్ద చనిపోయింది. ఆ పంది కళేబరాన్ని చిరుత తినడంతోనే చనిపోయిందని అధికారులు భావిస్తున్నారు. చిరుత కళేబరం సమీపంలోనే పంది కళేబరం కూడా ఉంది. చిరుత దాని గొంతుకొరికి అవయవాలు తిన్నట్లు ఆనవాళ్లున్నాయి. పశువైద్యాధికారి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అక్కడే కళేబరాన్ని కాల్చేశారు. దాని అవయవాలు, గోర్లను సేకరించి హైదరాబాద్‌లోని పశువైద్య బయోలాజికల్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపించారు.

కర్ణాటక ఎన్నికలకు బీఆర్‌ఎస్ దూరం

- అక్కడ లోక్‌సభ ఎన్నికల్లోనే పోటీ చేయాలని నిర్ణయం
- కర్ణాటక ఎన్నికలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందం
- బీజేపీ, కాంగ్రెస్, జేడీ (ఎస్) ఎత్తుగడలపై కేసీఆర్ దృష్టి
- జేడీఎస్ ఒంటరిగా పోటీచేస్తే కేసీఆర్ ప్రచారానికి వెళ్తారంటున్న పార్టీ వర్గాలు
- ఆ పార్టీతో బీఆర్‌ఎస్ మైత్రి బంధంపై అస్పష్టత
- ప్రస్తుతానికి మహారాష్ట్ర స్థానిక ఎన్నికలపైనే బీఆర్‌ఎస్ ఫోకస్



సాక్షి, హైదరాబాద్: మరో రెండు నెలల్లో జరగనున్న కర్ణాటక శాసనసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) నిర్ణయించింది. గతంలోనే తీసుకున్న నిర్ణయం మేరకు అక్కడ లోక్‌సభ ఎన్నికల్లోనే పోటీ చేస్తామని పేర్కొంది. అయితే కర్ణాటకలో పరిస్థితులు ఎలా ఉంటాయి? ఎన్నికల్లో అక్కడి ఏయే పార్టీలు ఎలాంటి వ్యూహాలను అమలు చేస్తాయి? పొత్తులు, ఇతర అంశాల ప్రభావం ఏమిటి? అన్న అంశాలను బీఆర్‌ఎస్ క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని కర్ణాటకకు పంపనుంది.

మొదట్లో హడావుడి చేసినా..

జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టేందుకు టీఆర్‌ఎస్ గత ఏడాది అక్టోబర్‌లో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)గా అవతరించగా.. మొదట్లో పొరుగునే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల్లో అడుగు పెట్టేందుకు హడావుడి చేసింది. అయితే వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల వరకు ఇతర రాష్ట్రాల్లో జరిగే అన్ని ఎన్నికలకు దూరంగా ఉంటామని తర్వాత ప్రకటించింది. కానీ ఈ నిర్ణయాన్ని పాక్షికంగా సడలిస్తూ.. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇటీవల నిర్ణయించారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌ను రిజిస్టర్ చేయడంతోపాటు పార్టీ బలోపేతం లక్ష్యంగా ఎన్సీపీ, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే నాందేడ్, కాంధార్–లోహాలో బహిరంగ సభలు నిర్వహించారు. మరిన్ని సభలు, సమావేశాలకు సన్నాహాలు చేస్తున్నారు.

పోటీ చేయకున్నా.. చురుగ్గా..

కర్ణాటకలో శాసనసభ ఎన్నికలకు తాజాగా షెడ్యూల్ విడుదలైంది. అక్కడ ప్రత్యక్ష పోటీకి దూరంగా ఉంటూనే.. చురుకైన పాత్ర పోషించాలనే యోచనలో కేసీఆర్ ఉన్నట్టు సమాచారం. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల నాటికి కర్ణాటకలో అడుగుపెట్టనున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలను నిశితంగా అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒకట్రెండు రోజుల్లో ప్రత్యేక కమిటీని ప్రకటించే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. కర్ణాటకలో ప్రధాన రాజకీయపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్, జేడీ(యూ) ఎన్నికల ఎత్తుగడలపై కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపాయి.

సరిహద్దు జిల్లాలపై స్పెషల్ నజర్

గతంలో హైదరాబాద్ స్టేట్‌లో అంతర్భాగంగా ఉండి ప్రస్తుతం కల్యాణ కర్ణాటకగా పిలుస్తున్న బీదర్, రాయచూర్, యాద్గిర్, కొప్పల్, కలబుర్గి జిల్లాల్లో బీఆర్‌ఎస్ బలోపేతం లక్ష్యంగా కొంత హడావుడి జరిగింది. మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితోపాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో పర్యటించి వివిధ పార్టీల నేతలతో భేటీ అయ్యారు. కానీ తర్వాత కర్ణాటకపై ఫోకస్ తగ్గించి మహారాష్ట్ర, ఏపీ, ఒడిశా రాష్ట్రాలపై దృష్టిపెట్టారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా.. అక్కడ అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష కాంగ్రెస్ వ్యతిరేక ఓటు బ్యాంకులో చీలికను నివారించడం, భావసారూప్య పార్టీ జనతాదళ్ (సెక్యులర్)కు మేలు చేసేందుకే కన్నడ రాజకీయాలపై ఫోకస్ తగ్గించినట్టు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. మాజీ ప్రధాని దేవెగౌడ, ఆయన కుమారుడు, మాజీ సీఎం కుమారస్వామి నేతృత్వంలోని జేడీ (ఎస్) కర్ణాటక ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసేపక్షంలో.. ఆ పార్టీ తరఫున కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఎన్నికల అవగాహన కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జేడీఎస్‌ను సంప్రదించాయని ఇటీవల కుమారస్వామి ప్రకటించారు. ఒకవేళ జేడీఎస్ ఇతర పార్టీలతో ఎన్నికల అవగాహన కుదుర్చుకుంటే కర్ణాటక ఎన్నికల్లో ఎలాంటి వైఖరి అనుసరించాలనే అంశంపై కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

జేడీ(ఎస్)తో మైత్రి కొనసాగుతున్నట్టేనా?

కుమారస్వామిని మరోమారు కర్ణాటక సీఎంగా చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని కేసీఆర్ గతంలో ప్రకటించారు. గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ, డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమాలకు కుమారస్వామి హాజరయ్యారు. అయితే ఈ ఏడాది జనవరిలో ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సభకు కేసీఆర్‌తోపాటు మరో ముగ్గురు సీఎంలు హాజరైనా కుమారస్వామి రాలేదు. ఫిబ్రవరి 17న తెలంగాణ సచివాలయాన్ని ప్రారంభించేందుకు పలువురు సీఎంలు, విపక్ష నేతలను ఆహ్వానించగా.. అందులో కుమారస్వామి పేరు కనిపించలేదు. దీనితో జేడీ(ఎస్)తో బీఆర్‌ఎస్ మైత్రి బీటలు వారిందని ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో తలమునకలైన కుమారస్వామికి తీరిక లేనందునే బీఆర్‌ఎస్ సమావేశాలకు దూరంగా ఉన్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

బీఆర్‌ఎస్ మీటింగ్‌లో అన్నం గిన్నె మోసిన ఎస్సై

- సోషల్ మీడియాలో ఫొటో వైరల్...
- కార్యకర్తల్ని అదుపు చేసేందుకు గిన్నెను పక్కకు పెట్టాను
- వివరణ ఇచ్చిన ఎస్సై

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎస్సై వెంకటరెడ్డి అన్నం గిన్నె మోస్తున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. హుజూర్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి వెంకటరెడ్డి బందోబస్తు కోసం వెళ్లారు. అక్కడ బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి అన్నం గిన్నెను మోయడం చర్చనీయాంశమైంది. 'అక్కడ చాలామంది కార్యకర్తలు ఉన్నా కూడా ఓ ఎస్సై ఇలా ప్రవర్తించడం విస్మయానికి గురిచేసిందని, హుజూర్‌నగర్‌లో పోలీసులు చివరికి బీఆర్‌ఎస్ పార్టీ మీటింగ్‌లలో అన్నం గిన్నెలు మోసే స్థితికి దిగజారారు, ఇంకా ప్రజలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందా'అంటూ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సామాజిక మాధ్యమాలలో కామెంట్ పోస్టు చేశారు. ఈ విషయమై సదరు ఎస్సై వివరణ ఇస్తూ..భోజనం కోసం కార్యకర్తల మధ్య గొడవ జరుగుతుండగా వారిని అదుపు చేయడం కోసమే అన్నం గిన్నెను పక్కకు జరిపామని చెప్పారు.



టెన్షన్ లేకుండా టెన్త్ పరీక్షలు

- వేసవి దృష్ట్యా పిల్లలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు..
- కరెంట్ పోకుండా చూడండి
- జిల్లా కలెక్టర్లకు మంత్రి సబిత ఆదేశం.. పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్



జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సబిత

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా పదవ తరగతి పరీక్షలు రాసేందుకు సన్నద్ధం చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, వారికి అసౌకర్యం కలగకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల 3 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పాఠశాల విద్య సంచాలకురాలు దేవసేనతో కలసి మంత్రి సబిత బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసి, వారిలో మనోధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలతో పాటు అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ఉందన్నారు. లక్షల్లో విద్యార్థులు హాజరవుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 4,94,620 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని, వీరి కోసం 2,652 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణలో జిల్లా కలెక్టర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున, పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించే ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్ష పేపర్లను 11 నుంచి 6 కు కుదించామని, సైన్స్ పరీక్ష రోజున భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రానికి సంబంధించి ప్రశ్న పత్రాలను విడివిడిగా అందిస్తామని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణం చేసే సౌకర్యం కూడా కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు పేపర్లకే అదనపు సమయం

- టెన్త్ పరీక్షలపై విద్యాశాఖ స్పష్టత
- ఈ విషయం విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలి
- క్షేత్రస్థాయి అధికారులకు దేవసేన ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 3 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల సమయ పాలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైన్స్, మొదటి భాష (కాంపొజిట్ పేపర్ల) పరీక్షలు 3.20 గంటలు ఉంటాయని, ఈ రెండు మినహా మిగతా పేపర్లన్నీ 3 గంటల పాటు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఈ రెండు పేపర్లను పార్ట్ –1, పార్ట్ –2 గా నిర్వహించనుండటంతో అదనపు సమయాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను 11 పేపర్లకు బదులుగా 6 పేపర్లకే నిర్వహిస్తున్నట్టు పునరుద్ఘాటించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

ఆ రెండు పేపర్ల సమయంలోనే మార్పులు

- సైన్స్, కాంపొజిట్ పేపర్లను మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులిచ్చారు.
- కాంపొజిట్ తెలుగు, ఉర్దూ పేపర్ల పార్ట్ –1ను 80 మార్కులకు నిర్వహిస్తారని, ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.
- పార్ట్ –బీ (ఆబ్జెక్టివ్ టైపు) పేపర్‌ను ఉదయం 11 గంటలకు ఇస్తారని, ఉదయం 11.30 గంటలతో ఈ పేపర్‌ను ముగించాలని స్పష్టం చేశారు. ఆ తర్వాత పార్ట్ – 2 పేపర్ ఇస్తారని, ఈ పరీక్షను ఉదయం 11. 50 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.
- సైన్స్ పేపర్‌లో మొదట పార్ట్ –1 (భౌతికశాస్త్రం) పేపర్‌ను ఇస్తారు. ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పార్ట్ –బీ పేపర్ (ఆబ్జెక్టివ్ టైపు)ను ఉదయం 10:45 గంటలకు ఇస్తారు. 11 గంటలకు ముగించాలని తెలిపారు.
- పార్ట్ –2 (జీవశాస్త్రం) పేపర్‌ను ఉదయం 11:20 గంటల నుంచి మధ్యాహ్నం 12 : 50 గంటల వరకు, పార్ట్ –బీ పేపర్ (ఆబ్జెక్టివ్ టైపు)ను మధ్యాహ్నం 12.35 గంటల ఇవ్వనుండగా, మధ్యాహ్నం 12.50 గంటల లోపు ముగించాలని వివరించారు. ఈ రెండు పేపర్లకు వేర్వేరు ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాలు ఇవ్వాల్సి ఉండటం, వీటిని మార్చుకునేందుకు గడువునివ్వడంలో భాగంగా అదనపు సమయాన్ని కేటాయించినట్టు పేర్కొన్నారు.

'సర్వే'తోనే చాన్స్..!

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల చేయడం.. తెలంగాణలోనూ అభ్యర్థులను ముందుగానే ప్రకటించాలన్న డిమాండ్ల నేపథ్యంలో.. 'సర్వే' అంశం చర్చనీయాంశంగా మారింది.

'చాన్స్'పై చర్చ

ఈ ఏడాది నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగవచ్చనే అంచనాల నేపథ్యంలో.. ఇక్కడ అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారనే దానిపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆరు నెలల ముందే అభ్యర్థులను అధికారికంగా క్షేత్రంలోకి పంపాలని భువనగిరి ఎంపీ, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముందు నుంచీ కోరుతున్నారు. రాష్ట్ర ఇన్‌చార్జులు, ఏఐసీసీ పెద్దలను కలిసినప్పుడు కూడా దీనిపై విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా కర్ణాటకలో అభ్యర్థుల ప్రకటన తర్వాత చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర కాంగ్రెస్‌లో దాదాపు 50 శాతం సీట్లు ఖరారైనట్టేనని.. 60 మంది వరకు అభ్యర్థుల ప్రకటనకు ఇబ్బందులు లేవని ఆయన హాథ్‌సే హాథ్ జోడో యాత్రల సందర్భంగా పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో పేర్కొన్నారు. ఈ లెక్కన ఎన్నికల ముందే ఒక జాబితా రావొచ్చని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఎవరికి ఖాయంగా టికెట్లు?

రాష్ట్ర కాంగ్రెస్‌లో పెద్ద తలలుగా గుర్తింపు పొందిన నేతలంతా తమకు టికెట్ ఖాయమనే ధీమాలో ఉన్నారు. పార్టీ తరఫున ఉన్న ముగ్గురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీతోపాటు మరికొందరికి టికెట్ ఖాయమనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఎంపీలు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, సీతక్క, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డితోపాటు మహేశ్వర్‌రెడ్డి, ప్రేమ్ సాగర్‌రావు, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, మధుయాష్కీ, గీతారెడ్డి, షబ్బీర్‌అలీ, ఈరవత్రి అనిల్, మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్, పొన్నాల లక్ష్మయ్య, దొంతి మాధవరెడ్డి, ఉత్తమ్ పద్మావతి, జానారెడ్డి, సంపత్‌కుమార్, వంశీచందర్‌రెడ్డి, నాగం జనార్దనరెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, టి.రామ్మోహన్‌రెడ్డి, బలరాం నాయక్, ఫిరోజ్‌ఖాన్, బాలూనాయక్, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, విజయరమణారావు, రాజ్‌ఠాకూర్, అద్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, విజయారెడ్డి, నందికంటి శ్రీధర్, మెట్టు సాయికుమార్, శ్రీరంగం సత్యం టికెట్ చాన్స్ జాబితాలో ఉన్నారు.

సర్వేలో ప్రతికూల ఫలితమొస్తే..?

చాలా మందికి టికెట్ ఖాయమని భావిస్తున్నా, మరికొందరికి చాన్స్ ఎక్కువేనని అంచనా వేస్తున్నా పరిస్థితి ఎలా మారుతుందోనని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కచ్చితంగా టికెట్ వస్తుందన్నదా, లేదా అన్నది ఇప్పుడే చెప్పలేమని... ఏఐసీసీ సర్వేల ఆధారంగానే టికెట్ ఇవ్వాలా, వద్దా అన్నది నిర్ణయమవుతుందని గాంధీభవన్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కర్ణాటకలో తొలి జాబితా కింద ప్రకటించిన 124 మందికి కూడా ఏఐసీసీ సర్వే తర్వాతే టికెట్లు ఖరారు చేశారని.. దీనితో చాలా మంది పోటీచేసే స్థానాలు కూడా మారాయని చెప్తున్నాయి.

ఇప్పటికే కసరత్తు ముమ్మరం..

తెలంగాణలో నియోజకవర్గాలు, అభ్యర్థుల బలాబలాలపై వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఇప్పటికే సర్వేలు చేస్తోంది. ఇప్పటికే రెండు, మూడు సర్వే నివేదికలను అధిష్టానానికి అందజేసింది. ఈ సర్వేలతోపాటు ఏఐసీసీ సర్వే త్వరలోనే ప్రారంభంకానున్నాయి. టీపీసీసీ నేతలకు కూడా సమాచారం లేకుండా జరిగే ఈ సర్వే వివరాలు నేరుగా అధిష్టానానికి అందుతాయని.. టికెట్ల కేటాయింపు సమయంలో వాటినే ప్రాధాన్యతగా తీసుకుంటారని అంటున్నారు. సీనియర్లయినా, జూనియర్లు అయినా, టికెట్లు ఎప్పుడు ప్రకటించినా 'సర్వే' సూత్రం ఆధారంగానే జరుగుతుందని చెప్తున్నారు. రాష్ట్రంలో పునర్వైభవం పొందేందుకు.. ఈ ఏడాది జూన్ నెలలో భారీ బహిరంగసభను నిర్వహించాలని, సోనియా, రాహుల్, ప్రియాంకలలో ఒకరిని రప్పించాలని టీపీసీసీ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ఏప్రిల్ 17 నుంచి కరెంటోళ్ల సమ్మె..

పిలుపునిచ్చిన పవర్ జేఏసీ

- యాజమాన్యాలతో జేఏసీల మూడో దఫా చర్చలు విఫలం
- రేపు సమ్మె నోటీసులు ఇస్తామని ప్రకటన

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఏప్రిల్ 17 నుంచి సమ్మెకు దిగాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ సాయిబాబు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ సంస్థల సీఎండీలకు సమ్మె నోటీసులు అందిస్తామని వెల్లడించారు. పీఆర్సీ ఫిట్‌మెంట్‌శాతం పెంపుతో పాటు 1999–2004 మధ్యకాలంలో నియమితులైన ఉద్యోగులకు ఈపీఎఫ్‌కి బదులు జీపీఎఫ్ అమలపై స్పష్టమైన హామీ రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఏడాది కాలంగా వేచిచూసినా ఫలితం లేకపోవడంతో సమ్మె అనివార్యమైందని సాయిబాబుతో పాటు జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ శ్రీధర్, బీసీ రెడ్డి వెల్లడించారు.

చర్చలు విఫలం కావడంతో

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు బుధవారం విద్యుత్ సౌధలో ఉభయ జేఏసీలతో నిర్వహించిన మూడో దఫా చర్చలూ విఫలమయ్యాయి. విద్యుత్ ఉద్యోగులకు 2 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు చేయాలని సీఎం కేసీఆర్ సూచించారని, ఆయన్ను ఒప్పించి 6 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు చేస్తామంటూ ప్రభాకర్ రావు చేసిన ప్రతిపాదనను.. విద్యుత్ ఉద్యోగ సంఘాల ఉభయ జేసీలు తిరస్కరించాయి. దీంతో ఏప్రిల్ 17 నుంచి సమ్మెకు దిగాలని నిర్ణయం తీసుకున్నామని సాయిబాబు ప్రకటించారు. భవిష్యత్ కార్యాచరణపై అన్ని అనుబంధ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ ఎస్.శివాజీ ప్రకటించారు. చర్చల్లో దక్షిణ, ఉత్తర డిస్కంల సీఎండీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జనగణనలో కులగణన చేపట్టాలి: శ్రీనివాస్‌గౌడ్


బీసీల చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): దేశ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని ఎక్సైజ్ శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టకుండా బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బీసీలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఏప్రిల్ 3న చేపట్టనున్న పార్లమెంట్ ముట్టడి సందర్భంగా 'హలో బీసీ.. చలో ఢిల్లీ పోస్టర్' ను బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేశ్‌సాగర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గుజ్జ కృష్ణ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నందగోపాల్, రాజ్‌కుమార్, కె.రాము, కీర్తిలత తదితరులు పాల్గొన్నారు.


రాహుల్‌పై వేటు అప్రజాస్వామికం

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




సాక్షి, యాదాద్రి: ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ ఐక్యత కోసం కష్టపడుతున్న జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేయడాన్ని దేశమంతా ఖండిస్తోందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సార్లు ప్రధానమంత్రిగా అవకాశం వచ్చినా వదులుకున్న చరిత్ర రాహుల్‌గాంధీది అని చెప్పారు. అలాంటి నేతకు అధికారిక బంగ్లా ఖాళీ చేయాలని చెప్పడం అప్రజాస్వామికమన్నారు. గతంలో ఎంతో మందికి కింది కోర్టులో శిక్ష పడితే హైకోర్టుల్లో స్టే తెచ్చుకున్నారని గుర్తుచేశారు. కోర్టు సమయం ఇచ్చినా లోక్‌సభ సచివాలయం 24 గంటల లోపు అనర్హత వేటు వేయడం తొందరపాటు చర్య అని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. దీనిపై ఇప్పటికే నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఏప్రిల్ చివరి వరకు నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిందని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీకేజీకి బాధ్యత వహించి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సీబీఐ విచారణ చేయాలని, దీనిపై కేంద్ర హోంమంత్రిని కలుస్తామన్నారు.

కరీంనగర్‌కు 'బండి' నయాపైసా తేలేదు



సాక్షి, హైదరాబాద్: ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నయాపైసా తీసుకురాలేదని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ టి.భానుప్రసాద్ విమర్శించారు. ఆయన ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి బుధవారం బీఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ అంశంలో మంత్రి కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై బండి సంజయ్ స్పందించిన తీరును ఖండించారు. రూ.లక్ష కోట్ల లిక్కర్ స్కామ్, 30 లక్షల మంది నిరుద్యోగులంటూ పొంతన లేకుండా మాట్లాడుతున్న బండి సంజయ్‌కు.. అంకెలు లెక్కపెట్టడం కూడా తెలియదని ఎద్దేవా చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న బండి సంజయ్.. గతంలో యూపీఎస్సీ పేపర్ లీక్ ఘటనలో బీజేపీ రూ.కోటి ఇచ్చిందో లేదో చెప్పాలని భానుప్రసాద్ డిమాండ్ చేశారు.

కేసీఆర్, కేటీఆర్‌లకు ఓటమి భయం



సాక్షి, హైదరాబాద్: మళ్లీ అధికారంలోకి వస్తామో.. రామోనన్న అపనమ్మకంతో పాటు.. ఇంకా తమకు ఆర్నెళ్ల సమయమే ఉందనే భయం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లలో కనిపిస్తోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనా రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలవబోమనే భయంతో బీజేపీని, మోదీ సర్కార్‌ను బద్నాం చేసేందుకు కేసీఆర్, కేటీఆర్ ఇష్టం వచ్చిన భాషలో అబద్ధాలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం వరంగల్ నేషనల్ హైవే పనులకు శంకుస్థాపన చేసి ఐదేళ్లు గడిచినా ముందుకు సాగడం లేదని, తాము మాత్రం వేగంగా పనులు పూర్తి చేస్తున్నట్టు కేటీఆర్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు.

సౌర కాంతుల సిటీ

గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్‌గా విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలు

రోజుకు సగటున 180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్లలో 11,968 నెట్ మీటర్ కనెక్షన్లు

సొంత అవసరాలకు వినియోగం..అదనపు విద్యుత్ అమ్మకం

- నగరంలోని 34 బల్దియా కార్యాలయాలపై రూ.4.5 కోట్ల వ్యయంతో 941 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర ఫలకాలు ఏర్పాటు చేశారు. ఒక్కో ప్యానెల్ ఏడాదికి సగటున 1,500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఈవిధంగా జీహెచ్‌ఎంసీ సోలార్ విద్యుత్ ఉత్పత్తితో తన కరెంటు బిల్లుల వ్యయాన్ని ఏడాదికి రూ.1.50 కోట్ల మేర తగ్గించుకుంది.
- బండ్లగూడ నగరపాలిక పరిధి గిరిధారి ఎగ్జిక్యూటివ్ పార్క్‌లోని పది బహుళ అంతస్తుల్లో 518కుటుంబాలు నివసిస్తున్నాయి. వ్యక్తిగత, ఉమ్మడి అవసరాలకు నెలకు రూ.12 లక్షల విలువ చేసే కరెంట్ వినియోగించేవారు. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు రూ.2.60 కోట్లతో 750 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటిద్వారా నెలకు 85వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఫలితంగా వారి నెలవారీ విద్యుత్ బిల్లు రూ.6 లక్షలకు తగ్గిపోయింది.



- ఈయన పీవీ రంగనాయకులు. కాప్రాలోని వెస్టన్ బ్లీస్ విల్లాస్‌లో నివసిస్తున్నారు. 2022 నవంబర్‌లో రూ.3 లక్షలు ఖర్చు చేసి ఇంటిపై ఐదు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు సగటున 25 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీంతో అప్పటివరకు నెలకు రూ.5,000 వచ్చే కరెంటు బిల్లు రూ.150 నుంచి రూ.200కు పడిపోయింది.

సాక్షి, హైదరాబాద్

భాగ్యనగరం సౌరకాంతులు వెదజల్లుతోంది. నగరంలోని పలు గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాలు, ప్రభుత్వ..ప్రైవేటు సంస్థల కార్యాలయాలు, ఇళ్లపై సౌర ఫలకాలు (సోలార్ ప్యానెళ్లు) ఏర్పాటవుతున్నాయి. ఇవి సొంతింటి విద్యుత్ అవసరాలను తీర్చడమే గాకుండా ఇతరత్రా అవసరాలకు కూడా ఉపయోగపడుతున్నాయి. అదనపు ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్నాయి. సాధారణ విద్యుత్ బిల్లుల మోత మోగుతుండడంతో 'సిటీ'జనులు సౌర విద్యుత్ వైపు మొగ్గు చూపుతున్నారు. మొదట్లో దీనిపై అంతగా అవగాహన లేకున్నా.. క్రమేణా సౌర విద్యుత్‌పై ప్రజలకు ఆదరణ పెరుగుతోంది.

- గ్రేటర్ పరిధిలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 220 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మినీ సోలార్ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున 170 నుంచి 180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. వేసవిలో మరో 30% అదనంగా ఉత్పత్తి జరిగే అవకాశం ఉంది. నగరం

అదనపు విద్యుత్ డిస్కంకు..

లో రోజుకు సగటున 2,500 మెగావాట్లకు పైగా విద్యుత్ డిమాండ్ ఉండగా, ఇందులో థర్మల్, జల విద్యుత్ 2,300 మెగావాట్లు, సోలార్ ద్వారా 220 మెగావాట్ల వరకు రికార్డవుతోంది. నగరంలో సౌర విద్యుత్‌కు సంబంధించి మొత్తం 11,968 రూఫ్ టాప్ నెట్ మీటర్ కనెక్షన్లు ఉన్నాయి. మిద్దెలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు వీటి ద్వారా తమ రోజువారీ అవసరాలు తీర్చుకుంటూ, మిగిలిన విద్యుత్‌ను నెట్ మీటరింగ్ ద్వారా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)కు సరఫరా చేస్తున్నారు. తద్వారా ఇంటి విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో వెలుస్తున్న విల్లా ప్రాజెక్టుల్లో అధికశాతం గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యతనిస్తున్నాయి. సోలార్ విద్యుత్‌ను అదనపు ఫెసిలిటీగా కస్టమర్లకు చూపుతూ వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి.

పాఠశాలలకూ సోలార్ హంగులు

సర్కారీ పాఠశాలలను కరెంట్ బిల్లుల భారం నుంచి తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'మన ఊరు– మన బడి'లో భాగంగా 11 జిల్లాల పరిధిలో తొలి విడతగా 1,521 ప్రభుత్వ పాఠశాలలపై రూ.32.02 కోట్లతో 3,072 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే ఆయా పాఠశాలల భవనాలపై సౌర ఫలకాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించింది.


ఓ పాఠశాలపై ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్

మరికొన్ని ప్రాజెక్టులు

- శంషాబాద్ విమానాశ్రయంలో 2015లో ఐదు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2021 జూలైలో అదనంగా మరో ఐదు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంటును అమర్చారు. ప్రస్తుతం విమానాశ్రయం విద్యుత్ అవసరాలు 50% సౌరశక్తి ద్వారానే తీరుతుండటం గమనార్హం. కాచిగూడ రైల్వేస్టేషన్ సైతం సోలార్ ఎనర్జీతో నెలవారీ విద్యుత్ బిల్లుల భారం నుంచి గట్టెక్కింది.
- రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీలోవార్షిక విద్యుత్ బిల్లు రూ.కోటికి పైగా వచ్చేది. భవనాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు తర్వాత ఈ బిల్లు రూ.40 లక్షలకు తగ్గింది.
- శామీర్‌పేట జినోమ్ వ్యాలీలో 952, జవహర్‌నగర్‌లో 947, కోకాపేట్ ఓపెన్ స్పేస్‌లో 100, కిమ్స్ రెసిడెన్సీలో 275, హిమాయత్‌సాగర్ ఓనర్స్ అసోసియేషన్ పరిధిలో 710 కిలోవాట్ల సామర్థ్యం గల ప్యానెల్స్ ఏర్పాటయ్యాయి. విద్యుత్ బిల్లులు తగ్గిపోయాయి. నిథమ్ క్యాంపస్‌లో 200 కిలోవాట్ల సామర్థ్యం గల ప్యానెళ్ల ద్వారా నెలకు 2.50 లక్షల బిల్లు ఆదా చేస్తున్నారు.

- మల్కాజ్‌గిరికి చెందిన శ్యామ్‌సుందర్ సింగ్ తన ఇంటిపై 6 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు. రోజుకు సగటున 30 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఇంటి అవసరాలు పోను మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు విక్రయిస్తున్నారు.



గేటెడ్ కమ్యూనిటీలు, టౌన్‌షిప్‌లు, ఇతర రెసిడెన్షియల్ కాలనీలకు డిస్కం వ్యక్తిగతంగా కాకుండా అందరికీ కలిపి ఒకే కనెక్షన్ (హెచ్‌టీ) జారీ చేస్తుంది. ఆ తర్వాత వ్యక్తి

ఒక్కసారి బిగిస్తే.. 25 ఏళ్ల పాటు ఉత్పత్తి

గత మీటర్లు అమర్చుకుని ఎవరికి వారు బిల్లులు చెల్లిస్తుంటారు. ఇందుకు ఆయా వినియోగదారుల నుంచి డిస్కం యూనిట్‌కు రూ.6.30 పైసల చొప్పున వసూలు చేస్తుంది. అదే వారి ఇంటిపై ఉత్పత్తి అయిన విద్యుత్‌కు రూ.4.09 పైసలు చెల్లిస్తుంది. ఒకసారి ఇంటిపై ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లపాటు విద్యుత్ ఉత్పత్తికి ఢోకా ఉండదు. అంతేకాదు ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం 25 నుంచి 50 శాతం రాయితీ కూడా ఇస్తుంది.



– బి.అశోక్, అధ్యక్షుడు, తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్

సింగరేణి ఎన్నికల్లో ఓడిపోతామని కేసీఆర్‌కు భయం

అందుకే ఎన్నికలు నిర్వహించడం లేదు ● సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



బెల్లంపల్లి: ఓడిపోతామనే భయంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం ఆయన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర క్యాంపు వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొగ్గుబాయి, బొంబాయి, దుబాయి.. అని తెలంగాణ ప్రజల బతుకులపై అనేక సభల్లో మాట్లాడిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో ఏమీ మార్చలేదని అన్నారు. సింగరేణిలో ఒకప్పుడు లక్షా ఐదు వేల మంది ఉద్యోగులు ఉంటే వారి సంఖ్యను 42 వేలకు తగ్గించడంతో స్థానికులు ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడ్డారని ధ్వజమెత్తారు. సింగరేణిలో రిటైర్మెంట్ తప్ప రిక్రూట్‌మెంటు లేదని, కారుణ్య నియామకాలు తప్ప కొత్త ఉద్యోగావకాశాలు లేవని పేర్కొన్నారు. పేదల ఇంటికి రూ.3 లక్షలు ఇస్తామని మోసపు మాటలు చెబుతున్నారని, దళితబంధు కోసం బడ్జెట్‌లో రూ.17,500 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా నయాపైసా విదిల్చలేదన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఎత్తివేసి బెల్లంపల్లి ప్రాంతానికి చుక్క నీరు రాకుండా చేశారని అన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతకానితనం వల్లే నియోజకవర్గం అభివృద్ధి సాధించలేదని విమర్శించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, పీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్య రాజీనామా చేయాలి: కొప్పు బాషా

సాక్షి, హైదరాబాద్: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాషా డిమాండ్‌చేశారు. బుధవారం బాషా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు నిత్యం మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చిన్నయ్య వ్యవహారం మహిళా సమాజాన్ని భయాందోళనలకు గురిచేస్తుందని బాషా ఆందోళన వ్యక్తంచేశారు. బెల్లంపల్లి అసెంబ్లీలో నెన్నెల మండలంలో 200 ఎకరాల భూమిని ఆయన కబ్జా చేసినట్లు ఆరోపణలు న్నాయని తెలిపారు. గతంలో లక్ష్మి అనే మహిళ తన భూమి చిన్నయ్య, అతడి అనుచరులు అక్రమంగా కబ్జా చేశారని మంత్రి హరీశ్‌రావు సమక్షంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు.

హిందువులంటే అదానీ, అంబానీలేనా?

బీజేపీకి పేదలు కనిపించరా?: ప్రకాశ్ కారత్



సభలో మాట్లాడుతున్న ప్రకాశ్ కారత్. చిత్రంలో వీరయ్య, చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం, తెలకపల్లి రవి, జూలకంటి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: హిందువులంటే అదానీ, అంబానీలేనా? అని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ను సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కారత్ ప్రశ్నించారు. వారి సంక్షేమం కోసమే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. హిందువుల్లో భాగమైన పేదలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు బీజేపీకి కనిపించరా? అని నిలదీశారు. మతతత్వం, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ, అదానీ, అంబానీల ప్రభుత్వాన్ని కూల్చాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న వరంగల్‌లో ప్రారంభమైన జనచైతన్య యాత్ర ముగింపు సభ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశ్‌కారత్ మాట్లాడుతూ, గతంలో టాటా, బిర్లా ప్రభుత్వం అనే వాళ్లమని, కేంద్రంలో ఇప్పుడున్న సర్కారు అదానీ, అంబానీ ప్రభుత్వంగా మారిపోయిందన్నారు. అదానీఅక్రమ సంపాదనపై పార్లమెంటులో చర్చించకుండా సమాధానం చెప్పలేక సభను వాయిదా వేస్తున్నారని విమర్శించారు. 2014లో అదానీ ఆస్తులు రూ.50 వేల కోట్లుండేవనీ, మోదీ ప్రధాని అయ్యాక ఇప్పుడు రూ.10.3 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. ఈ అక్రమ సంపాదనపై దర్యాప్తు సంస్థలు పట్టించుకోవడం లేదనీ, పార్లమెంటులో చర్చకు కేంద్రం అంగీకరించడం లేదని చెప్పారు.

అందుకే రాహుల్‌పై వేటు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై, ముఖ్యంగా ముస్లింలపై దాడులు జరుగుతున్నాయని ప్రకాశ్‌కారత్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ముక్త భారత్‌ను మోదీ కోరుకుంటున్నారని విమర్శించారు. అందులో భాగంగానే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారన్నారు. ఆ క్రమంలోనే ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, బీఆర్ఎస్ నేత కవితలను విచారిస్తున్నారనీ, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్టు చేశారని అన్నారు.

కమ్యూనిస్టు పార్టీల మద్దతుతోనే మునుగోడు ఫలితం: తమ్మినేని

మునుగోడు ఎన్నికల్లో కేసీఆర్ అడగడంతో సీపీఎం, సీపీఐ మద్దతు ఇచ్చాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. దీనిపై అప్పట్లో అక్కడక్కడ విమర్శలు వచ్చాయనీ కానీ మునుగోడు ఫలితాలు వచ్చిన తర్వాత సీపీఎం, సీపీఐలు తీసుకున్న వైఖరిపై సానుకూలత వచ్చిందన్నారు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి కేవలం 10 వేల మెజారిటీతో గెలిచారని, ఈ రెండు పార్టీలు మద్దతు ఇవ్వకపోతే బీఆర్ఎస్‌కు ఆ ఫలితం వచ్చేది కాదని తమ్మినేని విశ్లేషించారు. రాబోయే ఎన్నికల్లో కూడా సీపీఐ, సీపీఎంలతో కలిసి పనిచేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కలిసుంటామా లేదా అన్నది ఇప్పుడు ప్రశ్న కాదన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా చేసే పోరాటంలో, ప్రజాసమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్‌తో కలిసే ఉంటామని స్పష్టం చేశారు. అయితే ఎన్నికలప్పుడు సీట్ల విషయంలో ఎలా ఒప్పందాలు జరుగుతాయో ఇప్పుడే తెలియదన్నారు. సీట్ల విషయంలో సరిగా ఒప్పందం జరిగితే కలిసి పోటీ చేస్తామని, లేదంటే విడిగా పోటీచేసే అవకాశముందని తమ్మినేని ప్రకటించారు. ఎర్రజెండాలు కలిసి పోటీచేయాలని నిర్ణయించామన్నారు. ఏప్రిల్ 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సీపీఐ-సీపీఎం ఆధ్వర్యంలో సంయుక్తంగా పార్టీ శ్రేణులతో సభ నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. సభలో సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, సీపీఎం నాయకులు ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి మాట్లాడారు.


మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు

కేసీఆర్ రైతుల | ఆదాయం పెంచుతున్నారు

బీజేపీ అంబానీ, అదానీ ఆదాయం పెంచుతోంది

- మనకు అల్లావుద్దీన్ దీపం లేదు..కేసీఆర్ అనే దీపం ఉన్నాడు
- పేటీఎం, గూగుల్ పే వినియోగించే వారికి కేంద్రం త్వరలో 1.1% పన్ను
- సిద్దిపేటలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ అంబానీ, అదానీల ఆదాయం మాత్రమే పెంచుతుంటే, సీఎం కేసీఆర్ మాత్రం రైతుల ఆదాయాన్ని పెంచుతున్నారని మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. సంపద పెంచి రైతుబంధు, కేసీఆర్ కిట్, రైతుభీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్‌తో పేదలకు పంచుతుంటే, బీజేపీ వారు పేదలదగ్గర పన్నుల పేరుతో గుంజుకుని అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. నగదు రహిత సేవలు అని ప్రారంభించి ఇప్పుడు గూగుల్ పే, పేటీఎంలు వినియోగించిన వారికి త్వరలో 1.1% పన్ను విధించనున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగనూరులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..పంటలకు అవసరమైన విద్యుత్, టైమ్‌కు ఎరువులు, పంట పెట్టుబడికి రూ.10వేలు, కాళేశ్వరం నీరు సీఎం కేసీఆర్ తెచ్చినందునే నేడు రాష్ట్రంలో రైతులు బాగున్నారని తెలిపారు. మనకు అల్లావుద్దీన్ దీపం లేదు, కేసీఆర్ అనే దీపం ఉందని ఆ దీపం అండతోనే రాష్ట్రంలో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతూ బీజేపీ సమాధులు తవ్వే పనిలో ఉంటే సమైక్యతతో బలమైన పునాదులు తవ్వే పనిలో సీఎం కేసీఆర్ ఉన్నారని వివరించారు.

బీఆర్ఎస్‌ను కాపాడుకునే బాధ్యత మనదే

బీఆర్ఎస్ కన్నతల్లిలాంటిది, కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని పార్టీ శ్రేణులకు మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కార్యకర్తల మధ్య చిన్నచిన్న విభేదాలు ఉంటే మాట్లాడుకోవాలని, కేసీఆర్ నాయకత్వాన్ని దేశ వ్యాప్తంగా బలపరచడానికి పార్టీ శ్రేణులందరూ సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే గృహ లక్ష్మి కార్యక్రమం ప్రారంభం అవుతుందని ప్రతి పేదవారికి తప్పకుండా ఇళ్లు ఇస్తామని హామీనిచ్చారు. దేశవ్యాప్తంగా యాసంగిలో 97లక్షలు వరి సాగైతే తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో 56లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందన్నారు.సగం దేశానికి అన్నం పెట్టే ధాన్యాగారంగా తెలంగాణ మారిందన్నారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర కీలక నేత

కేసీఆర్ సమక్షంలో యువనేత అభయ్ కైలాస్‌రావు చేరిక


అభయ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలో పార్టీ బలోపేతానికి కసరత్తు చేస్తున్న బీఆర్ఎస్ ఇతర పార్టీల నుంచి చేరికలకు ప్రాధాన్యమిస్తోంది. ఈ నేపథ్యంలో ఔరంగాబాద్, నబ పర్బణీ ప్రాంతాల్లో పట్టు కలిగిన రాజకీయ కుటుంబానికి చెందిన యువనేత అభయ్ కైలాస్‌రావు పాటిల్ చిక్టాగావోంకర్ బుధవారం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం ప్రగతిభవన్‌లో అభయ్ కైలాస్‌రావును పార్టీలోకి ఆహ్వానిస్తూ సీఎం కేసీఆర్ గులాబీ కండువాను కప్పారు. కైలాస్‌రావు పాటిల్ తండ్రి తాత ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. కైలాస్‌రావు బాబాయి బావు సాహెబ్ పాటిల్ కూడా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేయగా, పాటిల్ మేనత్త ఔరంగాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. 'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని ఈ సందర్భంగా కైలాస్‌రావు పాటిల్ అన్నారు. బీఆర్ఎస్‌లో పాటిల్ చేరిక కార్యక్రమంలో ఆర్మూరు ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి కూడా ఉన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో పాటిల్ చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది.

6న 'పల్లెపల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ'

- ప్రారంభించనున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- రాహు-కేతువులుగా రాహుల్, కేసీఆర్: బూర నర్సయ్య



సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరులో 'పల్లె పల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని ఏప్రిల్ 6న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రారంభించనున్నారు. బీసీల ప్రయోజనాల పరిరక్షణకు మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించేందుకు ఏప్రిల్ 14 దాకా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ ప్రకటించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 6న మొదలుపెట్టి బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు కేసీఆర్ సర్కార్ బీసీలకు పెడుతున్న గోసలను వివరించి చైతన్యపరిచేలా దీన్ని నిర్వహిస్తామన్నారు. బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, కరపత్రాలను భాస్కర్‌రాజ్, శాంతి కుమార్, బూర నర్సయ్యగౌడ్, కడకంచి రమేశ్, నందనం దివాకర్ విడుదలచేశారు. ఈ సందర్భంగా బూర నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల అణచివేత జీవిత లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగుతోందని మండిపడ్డారు. బీసీల పట్ల జాతీయస్థాయిలో రాహుల్‌గాంధీ, కేసీఆర్ రాహువు-కేతువులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ హయాంలో గడీల పాలన మళ్లీ మొదలైందన్నారు. డబ్బులున్నవారికే కేసీఆర్ రాజ్యసభ, ఎమ్మెల్సీ సభ్యత్వాలు కట్టబెట్టడం ద్వారా వివక్షను స్పష్టంచేస్తున్నారని విమర్శించారు. బీసీలను గోస పెట్టిన బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరును ఎండగట్టి బీజేపీ భరోసాగా నిలుస్తుందని బూర నర్సయ్య హామీనిచ్చారు.

బీసీ కులగణన చేయకుంటే | బీజేపీకి ఇవే చివరి ఎన్నికలు


దీక్షలో పాల్గొన్న ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు

బీసీ జనగణన దీక్షలో జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ : బీసీ కులగణన చేపట్టాలని..లేనిపక్షంలో 2024లో ఎన్నికలే బీజేపీకి దేశంలో చివరి ఎన్నికలు కానున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా జాతీయ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో బీసీ జనగణన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ...ప్రధానిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించినందుకు బీసీలంతా తమకే ఓట్లు వేసి గెలిపించాలని బీజేపీ అన్ని అబద్ధాలు చెబుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ సహా 25 పార్టీలు బీసీ కులగణనకు ఇప్పటికే మద్దతు తెలిపారని చెప్పారు. బీజేపీ మాత్రమే బీసీ కులగణనను వ్యతిరేకిస్తోందన్నారు.

బీసీనని ప్రధాని మోదీ ఎలా చెప్పుకుంటారు?

అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో బీసీలకు ఏం చేయకుండా పొద్దున లేస్తే తాను బీసీనని ప్రధాని నరేంద్ర మోదీ ఎలా చెప్పుకుంటారని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. బీసీ కులగణన, ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు, ఎందుకు చేయడం లేదని నిలదీశారు. ఇటీవల రాయపూర్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో బీసీ డిమాండ్లపై తీర్మానం చేశామని..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేసి తీరుతామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఈ దీక్షలో ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీబీ పాటిల్, రవీంద్ర కుమార్, ఏపీ, తెలంగాణ అధ్యక్షులు కేసన శంకర్‌రావు, కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యాం కుర్మా, మహిళా సంఘం అధ్యక్షురాలు బి.మణి మంజరి సహా తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 30 । మార్చి । 2023



పని ప్రదేశంలో 'భద్రత' చర్యలు

నగరంలో వివిధ పనులు చేపట్టే ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాట్లపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది.

-10లో




బాలుడి అపహరణకు విఫలయత్నం

యాచన కోసం ఏడాదిన్నర బాలుడిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన నలుగురు సభ్యుల ముఠాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

-10లో

6న ఓయూలో 'బలగం' చిత్ర ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏప్రిల్ 6న సాయంత్రం 4 గంటలకు 'బలగం' సినిమాను ఉచితంగా ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంపస్ కాలేజీల విద్యార్థులతో పాటు నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కాలేజీ, కోఠి మహిళా కళాశాల విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉన్నట్లు చెప్పారు. గూగుల్ లింక్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99857 01254.





విద్యుద్దీపాల వెలుగుల్లో లంగర్‌హౌజ్‌లోని రామాలయ పరిసరాలు

అంతా రామమయం

సీతారాముల కల్యాణానికి దేవాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం రాత్రి విద్యుద్దీపాలతో కాంతులీనాయి. నేడు శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా జరగనున్నాయి. ఈ సందర్భంగా నగరంలో పండగ వాతావరణం నెలకొంది. మార్కెట్‌లో సీతారాముల ప్రతిమల విక్రయాలు ఊపందుకున్నాయి. జానకీ రాముల పరిణయ ఘట్టాలను నేత్రానందంగా వీక్షించేందుకు భక్తులు వేయి కళ్లతో వేచి ఉన్నారు.



ఉప్పల్‌లో ప్రతిమలు



నాగోల్‌లోని రామాలయం

న్యూస్‌రీల్

సీతారామచంద్రుల సన్నిధిలో సీఎం సతీమణి



నల్లకుంట: నల్లకుంట పాతరామాలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన సీతారామచంద్రుల పూజల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి శోభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ప్రధాన అర్చక స్వామి అనంతాచారి వేద మంత్రాలతో స్వాగతం పలికారు. సీఎం కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. పూజల్లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. సీఎం సతీమణి ప్రతి నెలా ఈ ఆలయంలో పూజలు, హోమాలు నిర్వహిస్తుంటారు.

వాణిజ్య పన్నుల వసూళ్లలో నిమగ్నమైన సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: వాణిజ్య పన్నుల వసూళ్లలో ఆ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ నెల 31తో పన్నుల వసూళ్లకు గడువు ముగుస్తుండటంతో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో ముందుకెళ్తున్నారు. బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించాలి ఆయా సర్కిల్‌ల ఉన్నత అధికారులు డీలర్లకు సూచిస్తున్నారు. ఏ డీలర్ రిటర్న్స్ దాఖలు చేయలేదు? ఎంత బకాయి ఉంది? ఎంత టార్గెట్ పూర్తి అయింది? నగరంలోని ఏ వాణిజ్య పన్ను శాఖ కార్యాలయానికి వెళ్లిన ఇదే సీన్ కనిపిస్తోంది. మరో రెండు రోజులే పని దినాలు కావడంతో ఉన్నత అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది పన్ను వసూళ్లలో జోరు పెంచారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు యాప్‌ల్లో టార్గెట్‌లను సిబ్బందికి నిర్దేశిస్తున్నారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులను యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

పోలీసు వృత్తికే వన్నె తెచ్చిన ఉమేష్‌చంద్ర

- డీజీపీ అంజనీకుమార్



సనత్‌నగర్: క్రమశిక్షణతో పాటు విధి నిర్వహణలో అంకితభావం కనబర్చిన ఉమేష్‌చంద్ర పోలీసు వృత్తికే వన్నె తెచ్చారని డీజీపీ అంజనీకుమార్ కొనియాడారు. దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 57వ జయంతి సందర్భంగా బుధవారం ఎస్సార్‌నగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి డీజీపీ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజనీకుమార్ మాట్లాడుతూ.. తానూ, ఉమేష్‌చంద్ర కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసిస్టెంట్ ఎస్పీలుగా కెరీర్‌ను ప్రారంభించామని ఈ సందర్భంగా తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దేశ సమగ్రత, ప్రజల భద్రత కోసం ఉమేష్‌చంద్ర తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అని అభివర్ణించారు. కార్యక్రమంలో ఉమేష్‌చంద్ర తండ్రి వేణుగోపాలరావు, పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, డీఐ రాంప్రసాదరావు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల టోకెన్

- అడ్వాన్స్ చెల్లింపు గడువు 15 వరకు

సాక్షి, సిటీబ్యూరో: బండ్లగూడ, పోచారంలలోని రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను కొనుగోలు చేసేందుకు టోకెన్ అడ్వాన్స్ చెల్లింపు గడువు మరోసారి పొడిగించారు. ఏప్రిల్ 15 వరకు అవకాశం కల్పిస్తూ హెచ్‌ఎండీఏ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఫేజ్-4లో వేలం కింద ఫ్లాట్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు 2బీహెచ్‌కే ఫ్లాట్ రూ.2 లక్షలు, 1 బీహెచ్‌కే కోసం రూ.1 లక్ష టోకెన్ అడ్వాన్స్‌ను మెట్రోపాలిటన్ కమిషనర్, హెచ్‌ఎండీఏ పేరు మీద డీడీ తీయాలని అధికారులు తెలిపారు.

నీళ్లకో 'నాణ్యత' యాప్





వినియోగదారుల ఇంటి వద్దనే నీటి పరీక్షలు

- యాప్‌లో సమయ పాలన, నాణ్యత వివరాల నమోదు
- త్వరలో ప్రాంతాలవారీగా వినియోగదారుల ఎంపిక

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సరఫరా చేస్తున్న తాగునీటిపై మరింత జవాబుదారీతనం కోసం జలమండలి ప్రత్యే చర్యలకు ఉపక్రమించింది. నీటి సరఫరా సమయపాలన, నాణ్యత సమస్యలను గుర్తించి వినియోగదారులకు సేవలు మరింత మెరుగుపర్చడమే లక్ష్యంగా 'నాణ్యత' పేరుతో మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ప్రయోగాత్మకంగా వినియోదారుడి ఇంటి వద్దనే ఎప్పటికప్పుడు నీటి సరఫరా సమయంలో స్వచ్ఛతను పరీక్షించే విధంగా చర్యలు చేపట్టింది. పరీక్షలు నిర్వహించేందుకు సిబ్బంది, ఎన్జీఓ ప్రతినిధుల ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి రంగంలోకి దింపింది. నీటి సరఫరా సమయంలో నలుగురు వినియోగదారుల ఇళ్లకు వెళ్లి ప్రత్యేక కిట్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వినియోగదారుల నుంచి నీటి సరఫరా సమయం కూడా అడిగి తెలుసుకుంటున్నారు. అనంతరం అక్కడిక్కడే వారి సమక్షంలోనే యాప్‌లో నీటి సరఫరా సమయం, నాణ్యత వివరాలు నమోదు చేస్తున్నారు.

రోజుకు 15 వేల పరీక్షలు..

- ప్రతి రోజూ సుమారు 15 వేల నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తోంది. వినియోగదారుల ఇంటి వద్ద చేసే పరీక్షలు, యాప్‌లో నమోదైన సమాచారంపై ఎన్జీఓ, థర్డ్ పార్టీ పర్యవేక్షణ కొనసాగుతోంది. నీటిలో కోర్లినేషన్ జీరో నమోదైతే మాత్రం కస్టమర్ కేర్ కేసు నమోదు చేసుకొని అధికారులను అప్రమత్తం చేస్తోంది. తక్షణమే సంబంధిత పైపులైన్‌కు నీటి సరఫరా నిలిపివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. మొత్తం మీద నీటి సరఫరా, నాణ్యత సమస్యలను గుర్తించి అధిగమించేందుకు యాప్ ఉపయోగపడుతుందని జలమండలి అధికారులు భావిసున్నారు.
- పైపుల లీకేజీలు ఇతరత్రా కారణాలతో కాలుష్య జలాలు సరఫరా అవుతున్నాయని తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. అప్పటికప్పుడు వీటిని పరిశీలించడానికి సాధ్యం కాకపోవడంతో ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపేసి ట్యాంకర్లతో నీటిని అందించడం సర్వసాధారణమైంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రజల సమక్షంలోనే నీటి పరీక్షలు చేసి భరోసా కల్పించేందుకు 'నాణ్యత పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్షలు, యాప్‌లో నమోదు సత్ఫలితాలు ఇస్తుండటంతో త్వరలో ప్రాంతాలవారీగా వినియోగదారులను ఎంపిక చేసి బాధ్యత అప్పగించాలని అధికారులు యోచిస్తున్నారు.

మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ

ఇప్పటికే జలమండలి నీటి సరఫరాలో మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అమలు చేస్తోంది. మొదటి దశలో నీటిశుద్ధి కేంద్రాల వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరినేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఐఎస్ఓ 10500 – 2012 ప్రకారం శాస్త్రీయంగా అన్ని జాగ్రత్తలనూ తీసుకుంటున్నట్లు జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

ట్రోల్ చేస్తే తోలు తీస్తారు!

అభ్యంతరకరమైన వాటిపై చట్టప్రకారం చర్యలు

- ఇటీవల 20 కేసులు నమోదు చేసిన సైబర్ కాప్స్
- ఎనిమిది మందిని గుర్తించి నోటీసులు జారీ
- ఎమ్మెల్సీ కవితపైనా ట్రోలింగ్స్: డీసీపీ స్నేహ




సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్

సాక్షి, సిటీబ్యూరో: సోషల్ మీడియాతో పాటు యూట్యూబ్ చానళ్లల్లో విచ్చలవిడిగా, విచక్షణ మరిచి ట్రోలింగ్స్ చేసే వారిపై నగర సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు వీటిపై కేసులు నమోదు చేసి, కంటెంట్ డిలీట్ చేయించడానికే పరిమితమయ్యారు. ఈ ధోరణి ట్రోలర్స్‌కు లోకువగా మారి మరీ రెచ్చిపోతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత వ్యవహారంలో కొన్ని ట్రోలింగ్ చానల్స్ బరితెగించాయి. అభ్యంతరకరంగా, అసభ్యంగా, పరువు నష్టం కలిగించేలా, మహిళల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లేలా ఉన్న పోస్టులకు సంబంధించి 20 కేసులు నమోదు చేసి ఎనిమిది మందికి నోటీసులు ఇచ్చారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటుతో..

- దర్యాప్తు దశలోనే ఉన్న ఓ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితతో పాటు మరికొందరు రాజకీయ నాయకులపై ట్రోల్ కుర్రాడు, మిస్టర్ మస్సబ్బాయ్, యంకమ్మ ట్రోల్స్, తెలుగు ట్రోల్స్ న్యూ, చిమ్టు ట్రోల్స్, టీమ్ ఆఫ్ ట్రోలింగ్, బంతిపువ్వు ట్రోల్స్, చందు ట్రోల్స్, చెవిలోపువ్వు చానళ్లల్లో ట్రోలింగ్స్‌తో పాటు ఫొటోల మార్ఫింగ్ సైతం చేశారు. ఓ మహిళా ప్రజా ప్రతినిధిపైనే ఈ స్థాయిలో జరిగితే సాధారణ మహిళల విషయం ఏంటన్న అంశంపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. బాధ్యుల్ని పట్టుకోవడానికి ఇన్‌స్పెక్టర్లు పి.పద్మ, డి.దర్శుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.
- అసెంట్‌గా పిలిచే ఓపెన్ సోర్స్ ఇంటిలిజెన్స్ టూల్స్ ఆధారంగా దర్యాప్తు చేసిన స్పెషల్ టీమ్స్ ఈ తొమ్మిది చానళ్లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది మంది బాధ్యుల్ని గుర్తించారు. ఆయా ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఎ.శ్రీనివాసరావు (విజయనగరం), ఎస్.మణికంఠ (కడప), బి.శ్రవణ్ (నిజామాబాద్), ఎం.శ్రీను (వరంగల్), పీఎస్ జ్యోతి కిరణ్ (కృష్ణా), వి.నవీన్ (జగిత్యాల), బి.చంద్రశేఖర్ (కరీంనగర్), బి.శ్రీకాంత్‌లకు (కడప) నోటీసులు జారీ చేశారు. వీరంతా 20–30 ఏళ్ల మధ్య వయస్కులని, ఎలాంటి రాజకీయ కోణం లేకపోయినా లైక్స్, టీఆర్పీ, రెవెన్యూ కోసమే ఇలా చేస్తున్నారని గుర్తించారు. వీరితోనే ఆయా చానల్స్‌లోని కంటెంట్‌ను డిలీట్ చేయిస్తున్న పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయనున్నారు.



వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

ఇలాంటి ట్రోలర్స్‌తో పాటు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టే వారికి ఇదో హెచ్చరికని, ఏ మహిళను ట్రోల్ చేసినా వదిలిపెట్టమని స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. యూ ట్యూబ్ ధోరణిపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సీ) లేఖ రాయాలని నిర్ణయించామన్నారు. యూ ట్యూబ్ సహా మరికొన్ని సామాజిక మాధ్యమాల్లో ఉన్న అనేక అంశాలపై దృష్టి పెడుతున్నామని ఏసీఈప కేవీఎం ప్రసాద్ చెప్పారు. దీనికోసం సైబర్ క్రైమ్ ఠాణాలో సోషల్ మీడియా టీమ్ పని చేస్తోందన్న ఆయన నిర్దిష్ట ఫిర్యాదులు లేకపోవడంతో కేసులు నమోదు చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. కరాటే కళ్యాణి మాదిరిగా ప్రతి సామాజిక కార్యకర్త ముందుకు వచ్చి ఈ వ్యవహారాలపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి, బాధ్యతలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ మూటల మాటేంటి?

బల్దియా కార్యాలయంలో ఇష్టారీతిగా వ్యర్థాల పడవేత

- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం.. రాకపోకలకు ఇబ్బందులు
- ఫైర్‌సేఫ్టీపై అందరికీ చెబుతూ సొంతింటినే మరువొచ్చా?

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల అగ్నిప్రమాదం జరిగిన సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు, రాకపోకలకు ఆటంకంగా దారిలో చెత్త, నిర్వహణ లేమి తదితర కారణాలను అధికారులు గుర్తించారు. దీంతో ఫైర్‌సేఫ్టీ చర్యల్లో భాగంగా భవనాల్లో బయటకు వెళ్లే మార్గాల్లో, రాకపోకల దారుల్లో, తదితర ప్రాంతాలో ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వీటితో పాటు వంద చదరపు మీటర్ల విస్తీర్ణంలోని దుకాణాలు సైతం ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడి దాకా బాగానే ఉంది కానీ..



జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో వ్యర్థాల మూటలు

బల్దియా ప్రధాన కార్యాలయంలోనే కనీస జాగ్రత్తలు లేని తనం కనిపిస్తోంది. బయటకు వెళ్లే మార్గాలతోపాటు లిఫ్టుల వద్ద, ఇతరత్రా ప్రాంతాల్లోనూ ఎక్కడ పడితే అక్కడ ఫైళ్ల కట్టలు కట్టిన మూటలు, పాడైపోయిన ఫర్నిచర్, పాత కంప్యూటర్లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇష్టానుసారంగా వదిలేశారు. మూటలు కట్టిన ఫైళ్లు పనికొచ్చేవో, కాదో కూడా తెలియని పరిస్థితి. పనికొచ్చేవైతే జాగ్రత్తగా భద్రపరచాలి. పనికిరానివైనా ఎక్కడ పడితే అక్కడ అడ్డుగా లేకుండా తరలించాలి. కానీ.. జీహెచ్‌ఎంసీలో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదలు పెడితే చివరి అంతస్తు దాకా ఇక్కడా అక్కడా అని కాకుండా ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పోగుపడి కనిపిస్తున్నాయి. పొరపాటున ఎక్కడైనా నిప్పురవ్వ అంటుకుంటే అగ్నిప్రమాదానికి ఆస్కారం ఉంది. ఇతరులకు చెప్పే జీహెచ్‌ఎంసీ తన కార్యాలయాల్లోనే ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు చేయకపోవడమే కాకుండా.. కనీస జాగ్రత్తలు సైతం లేకుండా వ్యవహరిస్తుండటాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. తమ కార్యాలయాల హంగూ ఆర్భాటాల కోసం కోట్లు ఖర్చు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, కనీస జాగ్రత్తలు లేకపోవడాన్ని, పరిసరాలు శుభ్రంగా లేకపోవడాన్ని పట్టించుకోవడం లేదు.

10 లక్షల సీసీ కెమెరాలను అనుసంధానిస్తాం

నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీవీ ఆనంద్

చిక్కడపల్లి: రాబోయే రోజుల్లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో మొత్తం 10 లక్షల సీసీ కెమెరాలను అనుసంధానించనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. సీసీ కెమెరా శివుని త్రినేత్రం వంటిదని ఆయన అభివర్ణించారు. త్యాగరాయ గానసభలో హైదరాబాద్ సిటీ పోలీస్‌సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి, ముషీరాబాద్, గాంధీనగర్ పీఎస్‌ల పరిధిలోని 34 ప్రాంతాల్లో 77 సీసీ కెమెరాలను బుధవారం ఆనంద్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల వల్ల నేర పరిశోధన మరింత సులువయ్యిందన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పలువురు వ్యాపార, పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతగా రూ.25 లక్షలతో చిక్కడపల్లి పీఎస్ పరిధిలో 50, ముషీరాబాద్‌లో 17, గాంధీనగర్‌లో 10 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించారని తెలిపారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, సెంట్రల్ జోన్ అదనపు డీసీపీ రమణారెడ్డి, చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

'ఉగ్ర త్రయం'పై అభియోగ పత్రం

దాఖలు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గత ఏడాది దసరా ఉత్సవాల నేపథ్యంలో హ్యాండ్ గ్రెనేడ్లతో భారీ విధ్వంసానికి కుట్ర పన్ని చిక్కిన లష్కరే తొయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాదులు అబ్దుల్ జాహెద్, మహ్మద్ సమీయుద్దీన్, మాజ్ హసన్ ఫారూఖ్‌లపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు నాంపల్లి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. ఇదే కేసులో ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంటున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు ఫర్హాతుల్లా ఘోరీ, సిద్ధిఖ్ బిన్ ఉస్మాన్, అబ్దుల్ మాజిద్‌లతో పాటు పాతబస్తీకి చెందిన మహ్మద్ కలీంను నిందితులుగా పేర్కొన్నారు. గత నెల 16న అరెస్టు అయిన కలీంపై త్వరలో సప్లమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు. వీరిపై ఉగ్రవాద కార్యకలాపాల కోసం యువకులను రిక్రూట్ చేసుకోవడం, ఆర్థిక వనరులు సమకూర్చడం, పేలుడు పదార్థాల సమీకరణ, భారీ విధ్వంసానికి కుట్ర తదితర అభియోగాలు మోపారు. పాకిస్థాన్‌లోని రావల్పిండిలో ఉన్న ఉగ్రవాదులు ఫర్హతుల్లా ఘోరీ, సిద్ధిఖ్ బిన్ ఉస్మాన్, అబ్దుల్ మాజిద్ హైదరాబాద్‌లోని జనసమర్థ ప్రాంతాలను టార్గెట్‌గా చేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో దసరా ఉత్సవాల నేపథ్యంలో హ్యాండ్ గ్రెనేడ్లతో భారీ విధ్వంసాలు సృష్టించడానికి ఆన్‌లైన్‌లోనే జాహెద్‌ను ఎంపిక చేసుకున్నారు. చైనాలో తయారైన హ్యాండ్ గ్రెనేడ్లు అక్కడ నుంచే లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) మీదుగా కశ్మీర్‌కు డ్రోన్ల ద్వారా డెడ్ డ్రాప్ విధానంలో చేరాయి. వాటిని అక్కడ నుంచి మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ వరకు చేర్చిన స్లీపర్‌సెల్స్ ఓ రహస్య ప్రదేశంలో దాచాయి. గతేడాది సెప్టెంబర్ 28న తన ద్విచక్ర వాహనంపై అక్కడకు వెళ్లిన సమీయుద్దీన్ నాలుగు గ్రెనేడ్స్‌ను తీసుకువచ్చారు. జాహెద్, సమీ, మాజ్‌ల నుంచి వీటితో పాటు రూ.20 లక్షల నగదునూ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పోలీసులు అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (యూఏపీఏ), ఎక్స్‌ప్లోజివ్స్ సబ్‌స్టాన్స్ యాక్ట్‌లతో పాటు ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. సీసీఎస్ అధీనంలోని సిట్‌లో నమోదైన ఈ కేసు జనవరిలో ఎన్ఐఏకు బదిలీ అయింది. గరిష్టంగా మూడు నెలల్లోనే అధికారులు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయడం గమనార్హం. కలీం పాత్రపైనా మరో అభియోగపత్రం దాఖలు చేయనున్నారు.



విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు

- పరీక్షలపై ఆందోళన వద్దు
- సహాయం అవసరమైతే 9390771469 నెంబర్‌కు కాల్ చేయండి


హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రకటిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఇంతపెద్ద జీవితంలో పరీక్షలు అనేవి మనల్ని మనం దిద్దుకునేందుకు కల్పించే ఒక అవకాశమని, ఇలాంటి పరీక్షలు మరో వంద రాయగలం అనే మనోధైర్యం ప్రతీ విద్యార్థిలో ఉండాలని గ్రూప్–1 పరీక్ష అభ్యర్థులనుద్దేశించి పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్ఫూర్తి సామాజిక వేదిక ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువ మిత్రులకు సంఘీభావంగా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరైనా అభ్యర్థులు మనోధైర్యం కోల్పోతే..వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు స్ఫూర్తి కన్వీనర్లు డాక్టర్ సి.వీరేందర్, వి.వి రావులు 9390771469 నెంబర్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ సెక్రటరీ డాక్టర్ బాలాచారి మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షలకు మొత్తం 3.85 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 2.85 లక్షల మంది పరీక్షలు రాశారని, అందులో 25 వేల మంది అర్హులయ్యారన్నారు. ఈ 25 వేల మంది మనోధైర్యం కోల్పోకుండా సహనంతో మరోమారు పరీక్ష రాయాలని, అలానే పరీక్ష రాసిన వారందరూ తమకు మరోమారు అవకాశం వచ్చింది తప్పకుండా నిరూపించుకుంటాం అనే ధీమాతో ముందుకు సాగాలన్నారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మేరీ మార్గరేట్, ప్రముఖ ప్రజా కవి ఆదేశ్ రవి, సీనియర్ పాత్రికేయులు రామ్మోహన్ రావు తదితరులు ప్రసంగించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ (జనరల్) ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం జరిగిన రసాయన శాస్త్రం–2, కామర్స్–2 పరీక్షలకు గ్రేటర్ పరిధిలో 1,85,607 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, సుమారు 6,279 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ అధికారులు తెలిపారు. పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఎంసెట్, జేఈఈ వంటి ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షల కోసం ఉరుకులు పరుగులు పెట్టాల్సి ఉంది. కొందరు శిక్షణ కోసం కోచింగ్ సెంటర్లకు, మరికొందరు ఇంటి వద్దనే సిద్ధమయ్యేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. వృత్తి విద్య కోర్సుల పరీక్షలు మాత్రం ఏప్రిల్ 4 వరకు జరుగనున్నాయి. కాగా, ఇంటర్మీడియట్ పరీక్షలు ముగియడంతో పరీక్షా కేంద్రాల వద్ద బుధవారం సందడి వాతావరణం కన్పించింది. విద్యార్థులు ఒకరి కొకరు అభినందనలు తెలుపుకుంటూ..వీడ్కోలు పలుకుతూ ఇంటిబాట పట్టారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై రంగులు చల్లిన దుండగులు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ప్రధాన గేటు మీద గుర్తుతెలియని వ్యక్తులు నీలిరంగు చల్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ మేరకు నీలిరంగు చల్లిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ బి.ఉమాశంకర్ అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వేళ కొందరు దుండగులు ద్విచక్ర వాహనాలపై వచ్చి అనుమానిత రంగులు చల్లినట్లు తెలిపారు. ఇది గమనించిన సెక్యూరిటీగార్డు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయినట్లు వెల్లడించారు. ఈ వివరాలన్ని తమ కార్యాలయం ప్రధాన గేటువద్ద అమర్చినటువంటి సీసీటీవీ ఫుటేజీలో నిక్షిప్తమై ఉన్నాయని, ఈ వివరాలను పోలీసులకు అందజేసినట్లు తెలియజేశారు. దీనిపై అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ అనుమానిత రంగులు చల్లిన ఘటనపై కేసు నమోదు చేశామని, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా త్వరలో నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో న్యాయం చేయాలి


సీఎండీ ప్రభాకర్ రావుకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్

పంజగుట్ట: విద్యుత్ రంగంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్‌లలో రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్ పాటించకుండా కుట్రలు జరుగుతున్నాయని, దీనిపై పోరాటం చేస్తామని గిరిజన లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం విద్యుత్‌సౌధలో సంస్థ సీఎండీ ప్రభాకర్ రావును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్ల అమలు తోపాటు సీనియారిటీ పాటించకుండా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. 2014 నుండి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల రివ్యూ పేరిట కుట్ర పన్నుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా రివ్యూ ఎలా చేస్తారని ప్రశ్నించారు.

పని ప్రదేశంలో ‘భద్రత’ చర్యలు!

- కచ్చితంగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ
- రంగంలోకి సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్స్
- బృందాలకు ప్రత్యేక వాహనాలు
- క్షేత్ర స్థాయి పనులకు జీపీఎస్ ట్రాకింగ్
- జలమండలి ఆధ్వర్యంలో సరికొత్త వ్యవస్థ


జలమండలి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీటీ బృందాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వివిధ పనులు చేపట్టే ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాట్లపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. సంస్కరణలో భాగంగా క్షేత్ర స్థాయి పనులు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక ‘భద్రత ప్రొటోకాల్ బృందాల వ్యవస్థ’ను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తోంది. పైప్‌లైన్ల విస్తరణ, సీవరేజ్, లీకేజీల నివారణ పనులు, మ్యాన్ హోల్ మరమ్మతులు తదితర ప్రతి పనులు చేపట్టిన ప్రదేశంలో సిబ్బందికి క్షేమం కోసం భద్రతా చర్యలు కచ్చితంగా పాటించే విధంగా చర్యలకు ఉపక్రమించింది.

సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్స్ రెడీ

జలమండలి పరిధిలోని ఆరు సర్కిళ్లకు ఆరు సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్స్ (ఎస్పీటీ) పేరుతో బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దింపింది. ఒకో బృందంలో ఒక ఇంజనీర్, ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డు కమ్ డ్రైవర్ సభ్యులుగా ఉన్నారు. ఈ మొత్తం బృందాలకు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన సేఫ్టీ ప్రొటోకాల్ వాహనాలను సైతం బృందాలకు సమకూర్చింది. ఈ వాహనాలకు కెమెరా, బృందంలోని ఒక సభ్యుడికి బాడీ కెమెరా ఏర్పాటు చేసింది. వీటితో పాటు జీపీఎస్ ట్రాకింగ్ చేస్తూ నిరంతరం వీటిని పర్యవేక్షిస్తోంది.

వ్యవస్థ ప్రత్యేకతలివీ..

నగరంలో జలమండలి చేపట్టే క్షేత్ర స్థాయి ప్రతి పనిని సేఫ్టీ ప్రొటోకాల్ బృందాలు పరిశీలించే విధంగా చర్యలు చేపట్టారు. అక్కడ సేఫ్టీ ప్రొటోకాల్ ప్రకారం భద్రతా చర్యలు తీసుకుంటున్నారా? లేదా అనే అంశం సమగ్ర తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారి వాహనాల్లో పని ప్రదేశాల్లో వినియోగించాల్సిన రక్షణ పరికరాలు కూడా ఉండటంతో ఒక వేళ ఎక్కడైనా పని జరుగుతున్న ప్రదేశంలో రక్షణ పరికరాలు లేకుంటే, బారికేడ్లు ఏర్పాటు చేయకుంటే వెంటనే అక్కడికక్కడే ఏర్పాటు చేస్తున్నారు. రాత్రివేళల్లో పనులు జరిగే ప్రాంతాల్లో సరైన లైటింగ్, రేడియం సూచికల ఏర్పాటు తదితర భద్రతా చర్యలు పాటిస్తున్నారా?, లేదా అనేది కూడా ఈ బృందాలు గమనిస్తున్నాయి. పనులు జరుగుతున్న ప్రదేశాల జీపీఎస్ వివరాలు సైతం ఎస్పీటీలకు అందుతాయి. వీటి ఆధారంగానే ఈ బృందాలు పని ప్రదేశాలకు వెళ్లి తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

10 వేల పనులు పర్యవేక్షణ

జలమండలి ఆధ్వర్యంలో జరుగుతున్న సుమారు పది వేలకు పైగా పనులను ‘భద్రతా ప్రొటోకాల్ బృందాలు’ పర్యవేక్షించినట్లు అధికార గణాంగాలు స్పష్టం చేస్తున్నాయి. జలమండలి ఆరు మాసాల కాలంలో సుమారు 10,212 పనులు చేపట్టగా 10,092 పనులు బృందాలు పర్యవేక్షించాయి. మరో 130 పనులు పర్యవేక్షించాల్సి ఉంది. సర్కిల్ వారిగా పరిశీలిస్తే సర్కిల్–1లో 2,688 పనులకు గాను 2,674, సర్కిల్–2లో 2,016 గాను 2,000 పనులు, సర్కిల్–4లో 3,379 పనులకు గాను 3, 298 పనులు, సర్కి ల్–5లో 2,129 కుగాను 2,110 పనులు పర్యవేక్షించాయి.

జలమండలి పరిధిలో పనుల పర్యవేక్షణ ఇలా..

డివిజన్	మొత్తం పనులు	ఎస్పీటీ పరిశీలన	పెండింగ్
చార్మినార్	689	687	2
ఆస్మాన్ ఘడ్(ఏ)	538	534	4
ఆస్మాన్ ఘడ్(బీ)	569	563	6
ఆసీఫ్‌నగర్	892	890	2
రెడ్‌హిల్స్	546	540	6
నారాయణగూడ	378	377	1
ఎస్ఆర్‌నగర్	553	548	5
మారేడుపల్లి	539	535	4
కూకట్‌పల్లి	827	799	28
కుత్బుల్లాపూర్	986	981	5
ఆర్‌సీ పురం	1066	1023	43
రాజేంద్రనగర్	500	485	5
ఎల్బీనగర్	345	345	0
అల్వాల్–మల్కాజిగిరి	726	720	6
కాప్రా–ఉప్పల్	622	619	3
ఎల్బీనగర్ (బీ)	436	426	10

బాలుడి అపహరణకు విఫలయత్నం

- చిన్నారిని కాపాడిన అంబులెన్స్ సిబ్బంది
- నలుగురు ముఠా సభ్యుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు (వృత్తంలో)

చిలకలగూడ: యాచన కోసం ఏడాదిన్నర బాలుడిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్, ఎస్ఐ కిషోర్‌లు తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన హారతి, సాయి దంపతులకు ఏడాదిన్నర వయసుగల కుమారుడు శ్యామ్ ఉన్నాడు. గర్భిణి అయిన హారతి అస్వస్థతకు గురికావడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, రెండు రోజుల క్రితం మరో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు తోడుగా భర్త సాయి, తల్లి పాపమ్మలు ఉంటున్నారు. రాత్రి సమయాల్లో ఒకరు ఆస్పత్రి వార్డులో హారతికి సహాయకులుగా ఉండగా, మరొకరు ఏడాదిన్నర బాబు శ్యామ్‌తో కలిసి ఆస్పత్రి ఎదురుగాగల మెట్రో పిల్లర్స్ వద్ద నిద్రిస్తుంటారు. ఈ నెల 27వ తేదీన సాయి తన భార్యకు తోడుగా వార్డులో ఉండగా, పాపమ్మ తన మనవడు శ్యామ్‌తో మెట్రో పిల్లరు వద్ద పడుకుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురు మహిళలు, ఓ యువకుడితో కూడిన అగంతకుల ముఠా నిద్రిస్తున్న బాలుడిని ఎత్తుకుని మెల్లగా అక్కడి నుంచి జారుకునేందుకు యత్నించారు. సమీపంలోని అంబులెన్స్‌లో ఉన్న డ్రైవర్ నవీన్ ఈ తతంగాన్ని గమనించసాగాడు. అదే సమయంలో మెలకువ వచ్చిన చిన్నారి గట్టిగా ఏడవడంతో అప్రమత్తమైన నవీన్ అంబులెన్స్ దిగి చిన్నారిని కిడ్నాప్ చేస్తున్నారంటూ గట్టిగా కేకలు వేసి వారిని వెంబడించాడు. పాపమ్మతోపాటు మిగిలిన అంబులెన్స్ సిబ్బంది, పరిసర ప్రాంతాల్లో నిద్రిస్తున్న వారంతా లేచి బాబును ఎత్తుకుని పరుగులు తీస్తున్న ముఠాను పట్టుకుని చిన్నారిని కాపాడి, నిందితులను గాంధీ అవుట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. బోయిగూడ, బన్సీలాల్‌పేటలకు చెందిన పిల్లే గాయత్రి, పిల్లే వీరాంజన్, బట్టు విజయ, పుష్పలు నిందితులుగా గుర్తించారు. వీరిలో గాయత్రి, వీరాంజన్ తల్లీ కొడుకులు కాగా, విజయ, పుష్పలు నీలోఫర్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పేషెంట్ కేర్ టేకర్లుగా పనిచేస్తున్నారు. యాచక వృత్తిలో దింపేందుకే చిన్నారి కిడ్నాప్‌నకు యత్నించినట్లు నిందితులు ఒప్పుకున్నారని, బాలుడి తండ్రి సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

లైంగికదాడి యత్నం కేసులో నిందితుడి రిమాండ్

బంజారాహిల్స్: చాక్లెట్స్ ఇప్పించి నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడికి యత్నించిన కేసులో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రాంతానికి చెందిన సోదాయి(21) బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి మాదాపూర్‌లోని ఓ టీవీ షోరూమ్‌లో డైలీ లేబర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని జహీరానగర్ సమీపంలో స్నేహితుల గదికి వచ్చాడు. అక్కడ మద్యం సేవించిన సోదాయి సమీపంలో రోడ్డుమీద ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికకు చాక్లెట్స్ ఇప్పించాడు. రోడ్డుపక్కన పార్క్ చేసిన ఆటోలోకి తీసుకువెళ్లి లైంగికదాడికి యత్నించాడు. స్థానికులు గమనించి పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలతో పాటు స్థానికులను వాకబు చేయగా నిందితుడి వివరాలు తెలిశాయి. ఈ మేరకు నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అత్తాపూర్ వద్ద హైలెవల్ బ్రిడ్జికి టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ, ఈసాలపై నిర్మించతలపెట్టిన హైలెవల్ బ్రిడ్జిల్లో మరో నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ టెండర్లు పిలిచింది. అత్తాపూర్ వద్ద ఇప్పటికే ఉన్న బ్రిడ్జికి సమాంతరంగా కొత్త బ్రిడ్జి నిర్మించేందుకు టెండర్లు పిలిచింది.

అంచనా వ్యయం రూ.35కోట్లు.

వర్షాకాలంలో ముంపు సమస్యల పరిష్కారానికి మూసీ, ఈసాలపై 15 హై లెవల్ బ్రిడ్జిలు నిర్మించేందుకు సిద్ధమైన ప్రభుత్వం వాటిల్లో నాలుగు బ్రిడ్జిల నిర్మాణ బాధ్యతలు జీహెచ్‌ఎంసీకి అప్పగించగా, ఇటీవలే మూసారాంబాగ్ బ్రిడ్జి పనులకు టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే.

గేమింగ్, ఏఐ స్టార్టప్‌లకు ప్రోత్సాహం అవసరం

– ఇమేజ్ సంస్థ సీఓఓ అర్జున్ సరోదే



సాక్షి, సిటీబ్యూరో: గేమింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్ వంటి రంగాల్లోని స్టార్టప్ సంస్థలకు మరింత సహకారం అందాల్సిన అవసరముందని ఇమేజ్ సంస్థ సీఓఓ అర్జున్ సరోదే అన్నారు. గేమింగ్, కృత్రిమ మేథ, కంప్యూటర్ విజన్ రంగాల్లోని అంకుర సంస్థలకు ఇమేజ్ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఓఈ) పేరిట ఆరు నెలల యాక్సిలరేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వం సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని బుధవారం మాదాపూర్‌లోని ఇమేజ్ సెంటర్లో బుధవారం ప్రారంభించారు. 23 అంకుర సంస్థలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఐఐఐటీ డైరెక్టర్ ప్రొ.నారాయణ, ఎస్‌టీపీఐ డైరెక్టర్ రాంప్రసాద్, ఇమేజ్ సీఈవో శశిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమేజ్ సీవోవో అర్జున్ సరోదే మాట్లాడుతూ అంకుర సంస్థలకు తోడ్పడే సీఓఈ కార్యక్రమం మూడవదని, ఇందులో 23 సంస్థలు తమ ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని అన్నారు.

ఫిక్కీ నూతన చైర్‌పర్సన్‌గా రీతూ షా



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ)కు నూతన చైర్‌పర్సన్‌గా ప్రముఖ వ్యాపావేత్త రీతూ షా బాధ్యతలు చేపట్టారు. ఎఫ్ఎల్ఓ మాజీ చైర్‌పర్సన్ శుభ్రా మహేశ్వరి స్థానంలో రీతూ షా బుధవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు వారి ప్రతిభ, నైపుణ్యాలు, అనుభవాలు, శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి ఎఫ్ఎల్ఓ ఒక వేదికను అందిస్తుందని అన్నారు. 22వ చైర్‌పర్సన్‌గా తన బృందంలో గౌరవ కార్యదర్శిగా ప్రాచీ త్రివేది షా, కోశాధికారిగా నిషితా మన్నె, గౌరవ జాయింట్ సెక్రటరీగా స్మితా సంఘీ, జాయింట్ ట్రెజరర్‌గా నీరూ మోహన్ కొనసాగనున్నారని తెలిపారు.

హైటెక్ గేమింగ్ రాకెట్ గుట్టు రట్టు

రూ.29 లక్షల నగదు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు

నిజాంపేట్: బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు సంయుక్త దాడుల్లో హైటెక్ గేమింగ్ రాకెట్ గుట్టు రట్టు చేశారు. పోలీసుల దాడుల్లో నిందితుల నుండి రూ.29 లక్షల నగదుతో పాటు మొత్తం రూ.35 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. బాచుపల్లిలోని మయూర ఫార్చ్యూన్ గ్రీన్‌హోమ్స్‌లోని ఫ్లాట్ నెంబరు 201లో నివాసం ఉండే ఫైనాన్స్ వ్యాపారి అవినాష్‌కుమార్, నిజాంపేట సాత్విక్ రెసిడెన్సీకి చెందిన ట్రావెల్స్ బిజినెస్ నిర్వహించే దండు రాజేష్, నిజాంపేట్ రాఘవరెడ్డి నగర్‌కు చెందిన ట్రావెల్స్ బిజినెస్ నిర్వహించే రాఘవరావు, బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన కోటేశ్వరరావు, గప్పా నరేష్‌కుమార్, న్యూ షాపూర్‌నగర్‌కు చెందిన గంగరాజులు ముఠాగా ఏర్పడి హైటెక్ గేమింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేస్తూ వస్తున్నారు. ప్రధాన నిందితుడు అవినాష్‌కుమార్ ఆన్‌లైన్ ప్లేయింగ్ కార్డులు ఆడేందుకు వీలుగా అధునాతన చైనా తయారీ డివైజెస్‌ను సమకూర్చి ఎదుట వ్యక్తి ఆట ఆడే సమయంలో మరో డివైజ్‌లో నెంబరు చూస్తూ అమాయకులను మోసం చేస్తూ వారి జేబులు గుల్ల చేస్తూ వస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, బాచుపల్లి పోలీసులు బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అవినాష్ నివాసంపై దాడులు నిర్వహించి 29 లక్షల 11 వేల 850 రూపాయల నగదు, ఒక మొబైల్ ఫోన్, 3 మైక్రో ఫోన్‌లు, 500 నోట్ బండిల్ డివైజ్, ఒక క్యాష్ కౌంటింగ్ మిషన్, గేమింగ్‌లో ఉపయోగించే 200 కాయిన్స్‌లను సీజ్ చేశారు. నగదుతో పాటు స్వాధీనం చేసుకున్న సామాగ్రి విలువ రూ.35 లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గేమింగ్ రాకెట్ గుట్టు రట్టు చేసిన పోలీస్ సిబ్బందిని డీసీపీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

ఆకట్టుకున్న ‘గోదారి’ డాక్యుమెంటరీ



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో జీవనధారగా ప్రఖ్యాతిగాంచిన గోదావరి నదిపైన స్వాతి, దివాకర్‌ల సంయుక్త దర్శకత్వంలో రూపొందిన ప్రత్యేక డాక్యుమెంటరీ విశేషంగా ఆకట్టుకుంది. ఆహా ఆధ్వర్యంలో బుధవారం ఈ డాక్యుమెంటరీని జూబ్లీహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకుడు దివాకర్ మాట్లాడుతూ సినిమా ప్రపంచంలో పడి మన సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టతలకు సంబంధించిన డాక్యుమెంటరీలు తీయడంలో వెనుకపడిపోయామని అన్నారు. ఎంతో విశిష్టత కలిగిన గోదావరిపైన ఇప్పటి వరకు ఎలాంటి డాక్యుమెంటరీ లేదని, తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా పలు రాష్ట్రాల గుండా బంగాళాఖాతంలో కలిసేంత వరకు గోదావరి నది ప్రాముఖ్యతను ఈ డాక్యుమెంటరీలో చూపించామని తెలిపారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తూ, వివిధ ప్రాంతాలు, మనుషులు, యాసలు, భాషలు, పుణ్యక్షేత్రాలను పలకరిస్తూ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ డాక్యుమెంటరీ ఆహా వేదికగా నేడు ప్రసారం కానుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా 2న ‘అహింసా రన్’

సాక్షి, సిటీబ్యూరో: శాంతి, అహింస కోసం ప్రత్యేకంగా ‘ఐఐఎఫ్ఎల్ అహింసా రన్’ పేరుతో ఒకే రోజు ప్రపంచవ్యాప్తంగా 85 ప్రదేశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ లేడీస్ వింగ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీన ఈ రన్ దేశవ్యాప్తంగా 65 ప్రాంతాలతో పాటు యూఎస్, యూకే వంటి మరో 20 అంతర్జాతీయ ప్రదేశాల్లో ఒకే రోజు నిర్వహించనున్నారు. యుద్ధాలకు వ్యతిరేకంగా, శాంతి–అహింసా మార్గాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ రన్‌ను జరుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ రన్‌లో లక్షమంది పాల్గొననున్నారని, నగరంలో 2800 మంది పాల్గొంటారని వారు పేర్కొన్నారు. నగరంలోని నెక్లెస్ రోడ్, జలవిహార్, పీవీ నరసింహారావు మార్గ్ దారిలో 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో పోటీ ఉంటుందని వారు తెలిపారు. 10 కిలోమీటర్ల పరుగులో విజేతకు రూ.90 వేల నగదు బహుమతి అందించనున్నామని అన్నారు. ఈ అహింసా రన్‌లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు https://jitohyderabad.org/about-us/ లో నమోదు చేసుకోవచ్చు.

క్లుప్తంగా

సీవరేజి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఎంఎస్ మక్తాలో సీవరేజి సమస్య పరిష్కారం కోసం వాటర్ వర్క్స్ విభాగం చేపట్టిన పనులను బుధవారం ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పరిశీలించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా పనులు చేపట్టాలని ఆమె జలమండలి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ మక్తా బస్తీ అధ్యక్షుడు ఎస్కే షరీఫ్, స్థానిక నాయకులు రఫీ, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

రహమత్‌నగర్: నిరుద్యోగ యువతకు లేట్ అజ్ సర్వ్ (ఎల్‌యూఎఫ్) ఫౌండేషన్ కంప్యూటర్ శిక్షణను ఉచితంగా అందిస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహమూద్‌అలీ తెలిపారు. శ్రీరాంనగర్‌లోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా ఎల్‌యూఎఫ్ ఆధ్వర్యంలో పేద యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామన్నారు. దాదాపు 30 వేల రూపాయల విలువైన ఈ శిక్షణను తాము ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఆసక్తి గత యువత శ్రీరాంనగర్‌లోని తమ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించాలని కోరారు.

కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా వంశీధర్



నియామకపత్రం అందుకుంటున్న వంశీధర్

పంజగుట్ట: భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ వంశీధర్ నాలి నియమితులయ్యారు. ఈ మేరకు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం వంశీధర్ మీడియాతో మాట్లాడుతూ .. ఏబీవీపీ నాయకుడిగా బీజేపీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితమై పని చేస్తున్న తనను గుర్తించి ఇంత గొప్ప పదవి అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాని హామీ ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి తాను శక్తివంచనలేకుండా పని చేస్తానన్నారు.

విద్యార్థులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహకారం



సాక్షి,సిటీబ్యూరో: అమీర్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ బాసటగా నిలిచింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం 500 మంది విద్యార్థులకు 1600 నోట్‌బుక్స్‌ను విరాళంగా అందించారు. పాఠశాలకు చెందిన అధికారుల అభ్యర్థన మేరకు సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఈ సహకారం అందించామని బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్‌వీఎస్‌పీ రెడ్డి తెలిపారు

సెయింట్ ఫ్రాన్సిస్‌లో జీ-20 సమ్మిట్‌పై సదస్సు

సనత్‌నగర్: బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ఐక్యూఏసీ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియల్ మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం జీ-20 సమ్మిట్‌పై జాతీయ స్థాయి సదస్సు జరిగింది. 'హయ్యర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ ఇట్స్ ఆస్పిరేషన్స్ ఇన్ బిల్డింగ్' వసుధైక కుటుంబం-వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ-వన్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు 170 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సులో పాల్గొన్న తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రవీందర్ మాట్లాడుతూ.. జీ-20 ఆలోచనపై యువతకు అవగాహన కల్పించే దిశగా వారిని తమ అభిప్రాయాలను వెల్లడించే విషయంలో భాగస్వాములను చేయాలని విద్యా సంస్థలకు సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పలు స వాళ్లకు సంబంధించి పరిష్కారాలను కనుగొనే దిశగా యువతకు తగిన భావస్వేచ్ఛ కల్పించే వేదికల ఏర్పాటు జరగాల్సిన అవసరం ఉందన్నారు. గురుస్వామి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ విద్యావర్ధిని, సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాండ్రి హోటా పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం చూద్దాం.. రారండి!

- నేడు సీతారాముల కల్యాణం
- వేడుకలకు ఆలయాల ముస్తాబు



సీతారాముల కల్యాణానికి ముస్తాబైన శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం



కుమ్మరిబస్తీ శివాలయం ముందు రాములోరి కల్యాణం కోసం వేసిన చలువ పందిళ్లు

వెంకటేశ్వరకాలనీ: శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పూలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

- బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్బీటీ నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. వేమిరెడ్డి ఎన్క్లేవ్‌లో శ్రీరామ నవమి సందర్భంగా చలువ పందిళ్లు వేశారు.
- బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, రోడ్ నం.10లోని గౌరీశంకర్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.
- జూబ్లీహిల్స్ రోడ్ నం. 17లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కేవీబీ రాఘవాచార్యులు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి కల్యాణ క్రతువు మొదలవుతుందని, అనంతరం అన్నదానం చేస్తామన్నారు.
- శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.
- సోమాజిగూడ కుమ్మరి బస్తీలోని శివాలయం వద్ద భారీ ఎత్తున సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.
- ఫిలింనగర్ దైవసన్నిధానంలో నవమి వేడుకలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామివారి కల్యాణం జరగనుంది.
- ఫిలింనగర్ మాగంటి కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి బస్తీవాసులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు రామ్‌జానకి రథయాత్ర



యాత్ర జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డే

రహమత్‌నగర్: శ్రీరామనవవి సందర్భంగా హైందవ సేన ఆధ్వర్యంలో గురువారం రామ్‌జానకి రథయాత్రను నిర్వహించనున్నారు. ఎస్పీఆర్ హిల్స్ నుంచి సాయత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ యాత్ర బంజారానగర్ హనుమాన్ ఆలయం వరకు కొనసాగనుంది. యాత్ర నేపథ్యంలో శ్రీరాంనగర్, కార్మికనగర్, రహమత్‌నగర్, ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతాల్లోని వీధుల్లో కాషాయతోరణాలు ఏర్పాటు చేశారు. ఇలా ఉండగా, ఐపీఎస్ అధికారి నార్త్ జోన్ డీసీపీ రాహుల్ హెగ్డే శ్రీరాంనగర్, రహమత్‌నగర్, కార్మికనగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. రథయాత్ర నిర్వహించే రహదారుల పక్కన వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. రథయాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్ఆర్‌నగర్ సీఐ సురేష్ పాల్గొన్నారు.

వర్తక సంఘం ఆధ్వర్యంలో..

రహమత్‌నగర్ వర్తక సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కూడలిలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు తాటి కొండ కృష్ణమూర్తి గుప్తా తెలిపారు. స్వామి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

బీవీబీపీ స్కూల్‌లో వైభవంగా 'కల్యాణం'



రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగాసీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణశ్రీతో పాటు ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో పాల్గొని సీతారాముల ఆశీస్సులు తీసుకున్నారు. అత్యంత ఆడంబరంగా జరిగిన ఈ వేడుకతో పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది.

ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ పని: దానం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ప్రజల మధ్య చిచ్చుపెట్టడమే బీజేపీ పని అని, ఆ పార్టీకి మతరాజకీయాలు తప్పితే ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లకు చెందిన 91 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ సంగీతా యాదవ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బండి సంజయ్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కేవలం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న జననేతపై ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలోనే కనిపిస్తుంటారని, వారు ఏం చేశారో చెప్పాలని ప్రజలు నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రెండు పార్టీలు తాడు, బొంగరం లేనివని, వాటి గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నో అభివృద్ధి పనులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న, షేక్ అహ్మద్, కొయ్యాడ అరుణ్‌కుమార్, మహేందర్‌బాబు, కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన ముగ్గురికి జైలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన డ్రెంకన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన 32 మందిపై కేసులు నమోదుచేసి బుధవారం నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. బోరబండకు చెందిన శివకుమార్‌కు మూడురోజుల జైలు, మేడ్చల్‌కు చెందిన మహేష్ పుత్రకు రెండు రోజులు, రహ్మత్‌నగర్‌కు చెందిన ఆర్.కృష్ణగౌడ్‌కు రెండు రోజుల జైలు, సికింద్రాబాద్‌కు చెందిన మానస్‌కు ఏడాది పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. మరో 28 మందికి ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: తలసాని

సనత్‌నగర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని ఏకేగౌడ్ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌తో కలిసి పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తలసాని మా ట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఎలా ఉంది, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత పరిస్థితి ఎలా ఉంది అనేది కళ్లముందే కనిపిస్తుందని తెలిపారు. సనత్‌నగర్‌లో 60 ఏళ్లలో కాని అభివృద్ధి గడిచిన తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. వెల్ఫేర్ గ్రౌండ్‌లో కార్మిక శాఖకు చెందిన స్థలాన్ని జీహెచ్ఎంసీకి బదలాయించి రూ.6.50 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించినట్లు చెప్పారు. సుభాష్‌నగర్‌లో హైటెన్షన్ విద్యుత్ లైన్ తొలగించి ప్రధాన సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. సమావేశంలో తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్ రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషకుమారి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెరగాలి

గచ్చిబౌలి: కరోనా కాలం తర్వాత సైబర్ క్రైమ్‌లు 300 శాతం పెరిగాయని సైబరాబాద్ డీసీపీ రితిరాజ్ పేర్కొన్నారు. ప్రజల్లో మరింతగా సైబర్ నేరాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. బుధవారం గచ్చిబౌలి డీఎల్ఎఫ్ భవనంలోని కాగ్నిజెంట్ కార్యాలయంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ స్పేస్ కొత్త మార్గాలతో మరింత క్లిష్టంగా మారుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు విభిన్న పద్ధతులను ఉపయోగిస్తున్నారన్నారు.

శివాజీపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి



దాడిచేసిన వారిని పట్టుకోవాలని నినాదాలు చేస్తున్న సంఘం ప్రతినిధులు

ఆరె కుల సంఘం నాయకుల డిమాండ్

పంజగుట్ట: ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడ్డ నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆరె కుల రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ..ఆరె కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని గత ఏడేళ్లుగా పోరాటం చేస్తున్న శివాజీపై మంగళవారం రాత్రి మాజీ ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్ రావు తన కుమారులు, అనుచరులతో వచ్చి విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. తీవ్ర గాయాలైన బాధితుడు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఆరె కుల సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ పదవి నుంచి తనను తొలగించి వేరే వారికి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకే కిషన్‌రావు ఈ దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. దాడిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని, 48 గంటల్లో నిందితులను పట్టుకోవాలని, అప్పటి వరకు ఆరె కుల సంఘం సభ్యులెవ్వరూ ఆందోళన చేపట్టవద్దన్నారు. గడువులోపు నిందితులను పట్టుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడదామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ దిగంబర్‌రావు, క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ మారుజోడు రాంబాబు, రాష్ట్ర ఉద్యమ కమిటీ చైర్మన్ సోమిడి అంజనీరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించొద్దన్నందుకు దాడి

ఫిలింనగర్: రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టవద్దంటూ అడ్డుకున్న వ్యక్తులపై సదరు నిర్మాణదారుడు, కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన బుధవారం ఫిలింనగర్ దుర్గా భవానీనగర్ బస్తీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... 64 గజాల పట్టా అధికారికంగా తీసుకున్న ఆరోగ్యమ్మ అనే మహిళ సుమారు 90 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టింది. దీనికి తోడు బస్తీకి దారి తీసే ఐదు అడుగుల రోడ్డు వైపు కూడా మరింత ముందుకు వచ్చి నిర్మాణం చేపట్టింది. ఈ విషయంపై స్థానికులు ఇటీవల మండల అధికారులతో పాటు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ పంచాయితీ స్థానిక ఎమ్మెల్యే వద్దకు కూడా చేరింది. రోడ్డుకు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేసుకోవాలని వారంతా స్పష్టం చేశారు. అయినప్పటికీ సదరు ఆరోగ్యమ్మ కుటుంబ సభ్యులు ఇవేవి పట్టించుకోకుండా రోడ్డును ఆక్రమిస్తూ నిర్మాణం చేస్తుండటంతో బుధవారం ఇంటి పక్కన నివాసం ఉండే బాలమ్మ, మహేష్, స్వామి తదితరులు అడ్డుకున్నారు. అసలే ఇరుకైన రోడ్డుపై ముందుకు వచ్చి కడితే రాకపోకలకు అంతరాయం కలుగుతుందని చెప్పినా వినిపించుకోక పోగా దాడికి పాల్పడ్డారు. చెప్పులతో కొడుతూ దుస్తులు చించి వీరంగం సృష్టించారు. పరస్పరం దాడులు, గొడవలతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలను చూసి బీఆర్ఎస్‌కు వణుకు

విజయారెడ్డి



దశరథ్‌కు కండువా వేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి

బంజారాహిల్స్: తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని బీఆర్ఎస్‌లో చేరినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని బంజారాహిల్స్ నందినగర్‌కు చెందిన దశరథ్ వెల్లడించారు. తాను మంగళవారం బంజారాహిల్స్ జీవీకే చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని ఆయన వెల్లడించారు. తాను మొదటి నుంచీ విజయారెడ్డికి మద్దతుగా ఉంటున్నానని, తాను ఎప్పటికీ ఆమెతోనే ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారిని కొంత మంది భయపెడుతున్నారని ఆరోపించారు. రోజు రోజుకూ కాంగ్రెస్‌లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం పట్ల బీఆర్ఎస్ నేతలకు వణుకు పుడుతోందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా చాలా మంది ప్రధాన నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోబోతున్నామని వెల్లడించారు. ఎవరి భయాలకు లొంగవద్దని ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు ఆమె భరోసానిచ్చారు.

సీఎం పదవి సాధనకు దళితులు సిద్ధం కావాలి

డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్



సభలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని దళితులు ముఖ్యమంత్రి పదవి సాధన కోసం ఎన్నికల పోరాటానికి సిద్ధం కావాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని కమ్యూనిస్టు కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో పార్టీ తెలంగాణ రాష్ట్ర 5వ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణస్వరూప్ మాట్లాడుతూ..రాజ్యాంగానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మోదీ, కేసీఆర్ పాలనలో దళితులకు రక్షణ లేదన్నారు. 75 వసంతాల స్వతంత్ర భారతా వనిలో నేటికీ దళిత బహుజనలకు సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. దళితులకు సీఎం పదవి సాధన కోసం అంబేడ్కర్, పూలే, గౌతమ బుద్ధుడు ఆలోచన మార్గంలో రాజకీయ పోరాటం చేయడానికి సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమానికి బీరం సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా, వీఎల్, రాజు, సిలివేరి వసంత రావు, ఇటికాల గణేష్, శ్యామ్ కుమార్, దేవునూరి శ్రీనివాస్, గంధం, శంకర్ మద్దెల, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రేయ వృద్ధాశ్రమానికి యూనియన్ బ్యాంక్ చేయూత



సాక్షి,సిటీబ్యూరో: పంజగుట్టలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆశ్రేయ ఓల్డ్ ఏజ్ హోంకు చేయూత నందించారు. మియాపూర్ వేదికగా జిల్లా మహిళా మండలాల సమాఖ్య నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛంద సంస్థకు యూనియన్ బ్యాంక్ తన సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా 6 డైనింగ్ టేబుళ్లను, 40 కుర్చీలను, 10 ఫ్యాన్లను, ఒక పెద్ద స్టౌను విరాళంగా అందించింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రేయ ఓల్డ్ ఏజ్ హోం అధ్యక్షురాలు సుశీలారెడ్డి, జనరల్ సెక్రటరీ షాహీన్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానం ఎంతో ఆసక్తికరం

ఇస్రో విశ్రాంత సైంటిస్ట్ శివప్రసాద్

బంజారాహిల్స్: అంతరిక్ష విజ్ఞానం ఎంతో ఆసక్తికరమైందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ గురుకుల పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం-రాకెట్ సైన్స్ గురించి ఆయన అవగాహన కలిగించారు. ఇస్రో రూపొందించిన జీఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ తదితర రాకెట్ల నిర్మాణం, వాటి ప్రయోగాల గురించి సవిరంగా తెలియజేశారు. గతంలో అంతరిక్ష విజ్ఞానంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు స్పేస్ క్లబ్ ద్వారా గవర్నర్‌ను కలవడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. సౌరశక్తి యొక్క ఉపయోగాలు, ఎనర్జీ ఎలా సేవ్‌చేసుకోవచ్చు అనే అంశాలను డాక్టర్ జయప్రకాశ్ బాబు విద్యార్థులకు తెలియజేశారు. చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా గత 15 సంవత్సరాలుగా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై పాఠశాలలు, కళాశాలలపై అవగాహన కలిగిస్తోందని క్లబ్ కార్యదర్శి జి.శాంతమూర్తి తెలిపారు. తమ సంస్థ ద్వారా నాసాకు, రష్యాకు, స్పేస్ గేట్‌కు వెళ్లారన్నారు.

రెండు రోజుల్లో లోప్రెషర్ నీటి సమస్య పరిష్కరిస్తాం

జలమండలి డీజీఎం వాహబ్



కార్మికనగర్‌లో పర్యటిస్తున్న డీజీఎం వాహబ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని జలమండలి డీజీఎం వాహబ్ హామీ ఇచ్చారు. లో ప్రెషర్ నీటి సరఫరా, సీవరేజి సమస్యలపై వచ్చిన ఫిర్యాదు మేరకు కార్మిక నగర్‌లో బుధవారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ, వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. పైపులైన్ లీకేజీల మరమ్మతు పనులను తమ సిబ్బంది ఎప్పటికప్పుడు చేపడుతున్నారని అన్నారు. లో ప్రెషర్ సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్త వాల్వ్‌లను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ సిబ్బందికి సమాచారం అందించాలని స్థానికులకు ఆయన సూచించారు. నీరు వృథా కాకుండా మీటర్లు బిగించుకోవాలని ఆయన కోరారు. డివిజన్‌లోని కొన్ని బస్తీల్లో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎన్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులపై పొంగుతున్న మురుగు నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జలమండలి మేనేజర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు షేక్ చోటు, గఫూర్, విజయ్‌కిరణ్, రఘు, లింగమూర్తి, ఆర్కే తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట



లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

రహమత్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ దేశంలోని ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాజు, శ్రీనివాస్, డివిజన్ మాజీ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, షరీఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వలేదని చెరువులో దూకేశాడు!

గాలించినా ఇంకా లభ్యం కాని ఆచూకీ

బంజారాహిల్స్: కుటుంబసభ్యులు తనకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి చెరువులో దూకేశాడు. అతడి కోసం పోలీసులు డీఆర్ఎఫ్‌తో గాలించినా ఇంకా ఆచూకీ లభ్యం కాలేదు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... ఫిలింనగర్‌లోని అంబేడ్కర్‌నగర్ బస్తీ నివాసి ఎం.ఎల్లయ్య (45) కూలీ. బుధవారం ఉదయం తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని కుటుంబసభ్యులను కోరాడు. అయితే అప్పటికే మద్యం తాగి ఉన్న ఎల్లయ్యకు డబ్బులు ఇస్తే మరోసారి తాగుతాడని భావించిన కుటుంబసభ్యులు డబ్బులు ఇవ్వలేదు. దాంతో మనస్తాపానికి గురైన ఎల్లయ్య కోపంగా ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని కొత్త చెరువులో దూకాడు. కాసేపటికి స్థానికుల సమాచారంతో అక్కడకు వచ్చిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. రాత్రి దాకా చెరువులో గాలించినా ఎల్లయ్య ఆచూకీ తెలియరాలేదు. చెరువులోని బురదలో కూరుకుపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చీకటి కావడంతో గాలింపు నిలిపివేసినట్లు డీఆర్ఎఫ్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

రూ.20 వేల కోట్లు ఖర్చు చేసి లక్షల కోట్లంటారా?

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి ప్రశాంత్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులకు సంబంధించి కేంద్రం తెలంగాణలో రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేసినట్టు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక బీజేపీ నేతలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కానీ తొమ్మిదేళ్లలో రోడ్లపై కేంద్రం ఖర్చు చేసింది కేవలం రూ. 20,350 కోట్లు మాత్రమేనని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అందులోనూ టోల్‌ట్యాక్స్ రూపంలో రూ.9 వేల కోట్లను టోల్ రూపంలో వసూలు చేసుకుందని తెలిపారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి బుధవారం బహిరంగలేఖ రాశారు. వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి టోల్ రుసుమును కేంద్రం పెంచుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఇప్పటికే టోల్ చార్జీలు తెలంగాణ ప్రజలకు పెనుభారంగా మారాయని, 2014లో రూ.600 కోట్లు టోల్ రూపంలో వసూలు చేస్తే 2023లో రూ.1,824 కోట్ల మొత్తాన్ని వసూలు చేసుకున్నారని, ఇప్పుడు మళ్లీ పెంచితే ప్రజలు ఆ భారాన్ని మోయలేరని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్ర బీజేపీ నేతలు లక్షల కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేసినట్టు అబద్ధాలు చెప్తున్నారని, వారికి నితిన్ గడ్కరీ అయినా వాస్తవాలు చెప్పి అబద్ధాలు చెప్పకుండా చూడాలంటూ పేర్కొన్నారు.

ఓటర్ కాని వారిని అనుమతించొద్దు

- తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులు ప్రవర్తనా నియమావళిని కఠినంగా పాటించాలని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి ఆదేశించారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే ఓటింగ్ జరిగే ప్రాంతానికి ఓటర్లు కాని వారిని రానివ్వకూడదని చెప్పారు. ఐడీ కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా జరగడానికి న్యాయవాదులంతా సహకరించాలని నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.

జీవనాడికి సహకరించండి

పోలవరానికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయండి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు
- హామీలిచ్చి తొమ్మిదేళ్లు పూర్తయింది
- రాష్ట్ర సమస్యలపై దృష్టి సారించండి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అడ్‌హక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని విభజన హామీల నోడల్ ఏజెన్సీ అయిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినా ప్రధాన సమస్యలు అలాగే ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని వివరించారు. బుధవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన రాత్రి సుమారు 40 నిమిషాల పాటు అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. 'అశాస్త్రీయ విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికంగా, ఆదాయాల పరంగా, అభివృద్ధి పరంగా, వివిధ సంస్థల రూపేణా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నష్టాల నుంచి కాపాడేందుకు పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చింది. అది జరిగి తొమ్మిదేళ్లు కావొస్తున్నా రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిపై వెంటనే దృష్టి సారించాలి' అని సీఎం కోరారు. ఇంకా అమిత్ షా దృష్టికి తీసుకెళ్లిన అంశాలు ఇలా ఉన్నాయి.

వేగం పెరగాలంటే నిధులివ్వాలి

- అనూహ్య వరదల కారణంగా పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఆ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని డీడీఆర్‌ఎంపీ అంచనా వేసింది. ఈ సొమ్ములు వెంటనే విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సొంత ఖజానా నుంచి రూ.2,600.74 కోట్లు ఖర్చు చేసింది. రెండేళ్లుగా ఈ సొమ్ము పెండింగ్‌లో ఉంది. వెంటనే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలి. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ.55,548 కోట్లుగా నిర్ధారించింది. ఈ మొత్తానికి వెంటనే ఆమోదం తెలపాలి. పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి.
- 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.36,625 కోట్లు వెంటనే విడుదలయ్యేలా చూడాలి.



బుధవారం ఢిల్లీలో అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం జగన్

- తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాలి.
- రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. దీని వల్ల రాష్ట్రానికి గ్రాంట్లు, పన్ను రాయితీలు లభిస్తాయి. ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. అందువల్ల రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతున్నాం.

వివేకా కేసు విచారణకు నూతన సిట్

- సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డీఐజీ చౌరాసియా నేతృత్వంలో ఐదుగురితో బృందం
- ఏప్రిల్ 30 లోపు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశం
- రాంసింగ్‌ను తప్పించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సీబీఐ ఏర్పాటు చేసింది. బృందంలోని సభ్యుల పేర్లను సీబీఐ అందజేయగా సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. దర్యాప్తును వేగవంతం చేసి ఏప్రిల్ 30 లోగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న రాంసింగ్‌ను తప్పించింది. వివేకా హత్య కేసులో ఏ5గా ఉన్న శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. నూతన సిట్ బృందానికి సీబీఐ డీఐజీ కేఆర్ చౌరాసియా నేతృత్వం వహించనున్నారు. ఈ బృందంలో ఎస్పీ వికాస్‌సింగ్, అదనపు ఎస్పీ ముకేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీమతి, నవీన్ పూనియా, ఎస్ఐ అంకిత్ యాదవ్ ఉన్నారు.

ఇలా ఎంతకాలం?

దర్యాప్తు అధికారి మార్పు/కొనసాగింపుపై సీబీఐ డైరెక్టర్ నిర్ణయాన్ని వెల్లడించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సీబీఐ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ తాజాగా జాబితాను అందజేశారు. చౌరాసియా నేతృత్వంలోని నూతన సిట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా జస్టిస్ ఎంఆర్ షా తెలిపారు. ఈ సందర్భంగా దర్యాప్తు ఆలస్యం అవుతోందని అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం వేగంగా పూర్తి చేయాలని పేర్కొంది. భారీ కుట్ర కారణంగా ట్రయల్ కోర్టులో అదనపు చార్జిషీటు దాఖలు చేసేందుకు స్వేచ్ఛ కావాలని సీబీఐ కోరడంతో ఇలా ఎంతకాలం సాగదీస్తారని జస్టిస్ సీటీ రవికుమార్ ప్రశ్నించారు. 'విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించాయి. మేం మరోసారి అదే చెబుతున్నాం. బెయిల్ పిటిషన్ దరఖాస్తు చేసుకునేందుకు ఏ5 (శివశంకర్‌రెడ్డి) భార్య అనుమతి కోరారు. ఈరోజు నుంచి ఆర్నెల్ల వరకూ విచారణ ప్రారంభం కాకుంటే రెగ్యులర్ బెయిల్‌కు ఏ5 దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలు వర్తించవు. కేవలం మెరిట్స్ ప్రకారమే హైదరాబాద్‌లోని ట్రయల్ కోర్టు విచారిస్తుంది. ఈ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నాం' అని ధర్మాసనం ఆదేశాల్లో పేర్కొంది.

విజయవాడ-కువైట్ విమాన సర్వీస్ ప్రారంభం

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి కువైట్‌కు ఎయిరిండియా విమాన సర్వీస్‌లు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుచినాపల్లి నుంచి ఇక్కడికి వచ్చిన బోయింగ్ 737–800 విమానం ఉదయం 9.55 గంటలకు బయలుదేరి కువైట్ వెళ్లింది. ఈ విమానం కువైట్ నుంచి రాత్రి 8.35 గంటలకు ఇక్కడికి చేరుకుంది. ఈ విమానం ప్రతి బుధవారం తిరుచినాపల్లి నుంచి వయా గన్నవరం మీదుగా కువైట్‌కు వెళ్లి వస్తుందని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు.

ఈడీ కార్యాలయానికి మళ్లీ సోమ భరత్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ వరసగా రెండోరోజూ బుధవారం ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్సీ కవిత నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్ల నుంచి సమాచారం సేకరించే యత్నంలో ఈడీకి సహ కరించడానికి ఆయన వచ్చినట్లు సమాచారం. మరోవైపు, ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు బుధవారం మరోసారి విచారించారు. మద్యం వ్యాపారంలో సలహాలు ఇవ్వడానికే తాను సమావేశాలకు హాజరయ్యానని అధికారులకు బుచ్చిబాబు చెప్పినట్లు తెలిసింది.

విశాఖ.. కళాత్మక కీర్తి పతాక

జీ-20 సదస్సులు జరుగుతున్న నగరాల్లో విశాఖది ప్రత్యేకం

- నగరానికి కొత్తరూపు తీసుకొచ్చిన అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్ జాన్ రత్నబాబు
- రెండు వేల డిజైన్లతో కాన్సెప్ట్ పెయింటింగ్స్ రూపొందించిన ఏఎన్‌యూ ప్రొఫెసర్
- మ్యూరల్ ఆర్ట్స్‌తో మహానగరానికి కళాత్మక రూపం

సాక్షి, విశాఖపట్నం: వైవిధ్యభరితమైన విశాఖ వైభవాన్ని విదేశాలకు ఘనంగా చాటిచెప్పే అవకాశం జీ–20 సదస్సుతో సాక్షాత్కరించింది. దేశవ్యాప్తంగా 50కి పైగా ప్రాంతాల్లో జరుగుతున్న సన్నాహక సదస్సుల్లో భాగంగా విశాఖలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అత్యంత కళాత్మకంగా నిలుస్తున్నాయి. జీ–20 దేశాల జెండాల వైభవంతో పాటు వసుధైన కుటుంబమనే థీమ్‌ను విశ్వవ్యాప్తం చేస్తూ.. భారతీయ సంప్రదాయాల డిజైన్లు, మ్యూరల్ ఆర్ట్స్‌ను గుంటూరు జిల్లాకు చెందిన అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్ జాన్ రత్నబాబు బండికొల్ల ప్రపంచానికి పరిచయం చేశారు. విభిన్న కాన్సెప్ట్‌లతో మహానగరానికి వన్నెతెచ్చిన రత్నబాబు కళాప్రతిభని చూసి విదేశీ ప్రతినిధులు అచ్చెరువొందుతున్నారు.

విభిన్నంగా విశాఖ సదస్సు

ఇప్పటివరకూ 20కి పైగా నగరాల్లో ఈ సన్నాహక సదస్సులు జరిగాయి. వీటన్నింటితో పోలిస్తే విశాఖ సదస్సు విభిన్నమైనదిగా గుర్తింపు పొందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, జిల్లా రెవెన్యూ యంత్రాంగం.. జీ–20 ఏర్పాట్లను అత్యద్భుతంగా నిర్వహించాయి. ముఖ్యంగా సభా ప్రాంగణంతో పాటు నగరమంతా మురిసిపోయేలా రూపొందించిన డిజైన్లు అతిథులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందుకే విశాఖలో జరుగుతున్న జీ–20 సదస్సు కళాత్మక సదస్సుగా ఉందని పలువురు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన జాన్ రత్నబాబు ఏయూలో బీఎఫ్‌ఏ చేశారు. ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.





విశాఖ వీధుల్లో కళారూపాలు

జీ–20 విశాఖ లోగో కూడా అద్భుతహ..

జీ–20 థీమ్ అయిన వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ (వసుధైక కుటుంబం)ని చాటిచెప్పేలా జాన్ లోగో డిజైన్ చేశారు.

- ఒక గ్లోబ్‌లో అక్షర క్రమంలో జీ–20 దేశాల జాతీయ జెండాలను ఆయా దేశాల ప్రజలు పట్టుకుని ఉన్నట్లుగా చిత్రీకరణ చేశారు.
- మధ్యలో మన జాతీయ వృక్షం మర్రిచెట్టు, జాతీయ పక్షి పురివిప్పిన నెమలిని కూడా చిత్రీకరించారు. ఈ మర్రి వృక్షానికి జీ–20 దేశాల జాతీయ పక్షులు, పుష్పాలు జోడించారు.
- అదేవిధంగా వృక్షం చివర్లో వన్ ఫ్యామిలీకి గుర్తుగా నెమలి పింఛాలు, మర్రి వృక్షం మొదట్లో ఒక తండ్రి, తల్లి మధ్యలో బాలుడు, వారి ఇల్లుని, వన్ ఫ్యూచర్‌కి సింబాలిక్‌గా సీతాకోక చిలుకల పెయింటింగ్ వేశారు.
- సదస్సుకు ఆహ్వానం పలుకుతున్న విశాఖనగరానికి చిహ్నంగా సముద్రం, డాల్ఫిన్ నోస్, లైట్‌హౌస్, పక్కనే చర్చి, మధ్యలో గుడి, మసీద్‌ను వేశారు.
- మొత్తంగా త్రివర్ణ పతాకాన్ని డిజైన్ చేసి.. ప్రతి ఒక్కరూ వహ్వా అనేలా రూపొందించారు.

ఈ తరహా డిజైన్లను ఎవరూ రూపొందించలేదని పలువురు విదేశీ ప్రతినిధులు చెప్పడం విశేషం. మరోవైపు.. నగర వీధుల్లో వాల్ పెయింటింగ్స్ ఆకట్టుకునేలా చిత్రించారు. విశాఖపట్నం స్థానిక అంశాలు, ఆధునిక మహానగరం విశేషాలు, విద్య, విభిన్న కలర్‌ఫుల్ ప్యాట్రన్స్, 3డీ ఆర్ట్స్, సరిలిజం ఆర్ట్స్‌తో పాటు భారత దేశ సాంస్కృతిక వైభవం, సంస్కృతి సంప్రదాయాలను మోడరన్‌గా మలిచి పెయింటింగ్స్‌తో అదరగొట్టారు.

ఎప్పుడూ రాని సంతృప్తి ఇప్పుడు వచ్చింది



విజువల్ ఆర్టిస్ట్‌గా 150కి పైగా అంతర్జాతీయ అవార్డులు సాధించినా రాని సంతృప్తి.. జీ–20 సదస్సు ప్రధాన లోగో డిజైన్ చేసినప్పుడు వచ్చింది. ప్రముఖుల నుంచి అందుతున్న ప్రశంసలు ఆత్మసంతృప్తినిస్తున్నాయి. విశాఖలో మొత్తం 2000 డిజైన్లతో కాన్సెప్ట్‌లను వాల్‌పెయింటింగ్స్‌గా మలిచాం. 34 రోజుల పాటు శ్రమించి విశాఖను కళాత్మక నగరంగా మలిచాం.

– జాన్ రత్నబాబు బండికొల్ల, అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్

నగర వార్తలు

తండ్రి బాటలో తనయ

- సివిల్ జడ్జిగా ఓయూ పూర్వ విద్యార్థిని



కరంజియా భావన

ఉస్మానియా యూనివర్సిటీ: తండ్రి బాటలో కూతురు సివిల్ జడ్జిగా ఎంపికై రికార్డు సృష్టించింది. గ్రేటర్‌లోని నాగారంకు చెందిన కరంజియా కుష్ నాంపల్లి క్రిమినల్ కోర్టులో మొదటి అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్ జడ్జిగా పని చేస్తున్నారు. ఆయన కూతురు ఓయూ పూర్వ విద్యార్థిని కరంజియా భావన ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. భావన ఇంజినీరింగ్ పూర్తి చేసి ఓయూ అనుబంధ కాలేజీలో ఎల్‌ఎల్‌బీ పట్టా అందుకొని సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయవాదులు అభినందించారు.

యువత దేశ భక్తి కలిగి ఉండాలి: సీఆర్పీఎఫ్ డీఐజీ మిశ్రా



మిల్లెట్స్ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఎస్‌ఎన్ మిశ్రా

నల్లకుంట: యువత క్రమ శిక్షణ, దేశ భక్తిని కలిగి ఉండాలని సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ డీఐజీ ఎస్‌ఎన్ మిశ్రా సూచించారు. తృణ ధాన్యాలతో పాటు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట హిందీ మహా విద్యాలయం ఆడిటోరియంలో డిస్ట్రిక్ట్ లెవల్ నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ 2023–24 సెమినార్ నిర్వహించారు. దీనికి హాజరైన డీఐజీ, సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఎన్ మిశ్రా నల్లకుంట కార్పొరేటర్ అమృత, నెహ్రూ యువ కేంద్రం సంఘటన తెలంగాణ డైరెక్టర్ ఏఆర్ విజయరావు, హిందీ మహావిద్యాలయం కార్యదర్శి లక్ష్మీనివాస్ శర్మతో కలిసి మిల్లెట్స్ వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా, హిందీ మహా విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ అవినాష్ జైస్వాల్, డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.మనోహరన్, కాచిగూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటరమణ, యూత్ ఐకాన్ ట్రైనర్ డాక్టర్ రిత్విక్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- ఏప్రిల్ 1 నుంచి సైబరాబాద్ పోలీస్ కోఆపరేటివ్ నూతన సొసైటీని ప్రారంభిస్తాం
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



సొసైటీని ప్రారంభించి మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: పోలీసుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సైబరాబాద్ పోలీసు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం పునరుద్ధరించిన సైబరాబాద్ పోలీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 1వ తేదీ నుంచి నూతన కోఆపరేటివ్ సొసైటీని ప్రారంభించడం జరుగుతుందని, సొసైటీ సభ్యులంతా కలిసి సొసైటీని ముందుకు తీసుకువెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు. సొసైటీ సభ్యులకు మేలు చేసే కొత్త ఆలోచలనకు సహకరించేందుకు ఎప్పుడూ సిద్ధమన్నారు.

సైబరాబాద్ అన్ని రకాల ఫార్మాట్లలో ముందుగా ఉందని, ముఖ్యంగా క్రైమ్ డిటెన్షన్ సైబర్ క్రైమ్స్, వెల్ఫేర్ యాక్టివిటీస్, 17 ఫంక్షనల్ వర్టికల్స్‌లో టాప్‌లో ఉందన్నారు. కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ యొక్క సర్వీసులు, సొసైటీ యాప్ ద్వారా సభ్యులు చూసుకోవచ్చన్నారు. సొసైటీలో లావాదేవీలు అన్నీ పారదర్శకంగా జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా సొసైటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో 72 ఏళ్ల చరిత్ర గల పాత సొసైటీని మూసివేస్తూ కోఆపరేటివ్ సొసైటీ ఆర్డర్ల ప్రకారం కొత్త సొసైటీని ప్రారంభించనున్నారు. సొసైటీలో గతేడాది ఏప్రిల్ 1 నాటికి ఉన్న షేర్ హోల్డర్లకు 40 శాతం, 2022–23 ఏడాదికి ఉన్న షేర్ హోల్డర్లకు 11 శాతం డివిడెంట్ డిక్లేర్ చేయడం జరిగింది. సభ్యులు నెలవారీ పొదుపునకు ఇచ్చే వడ్డీ 7.5 శాతం నుంచి 8 శాతానికి నిర్ణయించారు. ప్రతి సభ్యుడికి రూ.10 లక్షల గాను 8.5 శాతం వడ్డీపై లోన్లు ఇవ్వడానికి సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, అడ్మిన్ డీసీపీ యోగేష్ గౌతమ్, సొసైటీ సెక్రెటరీ, ఏసీపీ సురేందర్‌రావు, కోశాధికారి జి.మల్లేశం, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, డైరెక్టర్లు, ఎస్ఈ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ సరిత, హెడ్‌కానిస్టేబుల్ రాజారెడ్డి, కె.మాధవీలత, ఇతర సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

పోషకాహార భద్రత సాధనలో దేశాలు కలిసి పనిచేయాలి

- బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గరేత్ విన్ ఓవేన్

ఏజీవర్సిటీ: విశ్వ వ్యాప్తంగా పోషకాహార భద్రతని సాధించడంలో ప్రపంచ దేశాలు కలిసి కట్టుగా పని చేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గరేత్ విన్ ఓవేన్ అన్నారు. 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలని సాధించడానికి నవకల్పనలతో కూడిన ఎంటర్‌ప్రిన్యూరల్ మార్గాలు' అనే అంశంపై బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. అగ్రిహబ్, గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్, రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కి బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన, నవకల్పనల విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేస్తేనే ఈ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలన్ని సాధించగలమని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ 2014 వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు నుంచి విద్య పరిశోధన రంగాల్లో ముందుకెళ్తూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పనిచేస్తుందన్నారు. వర్సిటీలోని అగ్రిహబ్ ద్వారా స్టార్టప్‌లని విరివిగా ప్రోత్సహిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలు సాధించాలని, అప్పుడే సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు. నాబార్డ్ మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సుమారు 80 వేల స్టార్టప్‌లుండగా వ్యవసాయ రంగానికి సంబంధించినవి 3వేల స్టార్టప్‌లున్నాయని అన్నారు. తమ సహకారంతో ఏర్పాటైన అగ్రిహబ్ మంచి ఫలితాలన్నిస్తోందని తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల యాంత్రికరణ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఇగ్రిసాట్ డీడీజీ డాక్టర్ అరవింద్ కుమార్, అగ్రిహబ్ ఎండీ డాక్టర్ కల్పనా శాస్త్రీ, వర్సిటీ అధికారులు, బోధన సిబ్బంది, శాస్త్రవేత్తలు స్టార్టప్‌ల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ హైకమిషనర్, మొక్కల గురించి తెలుసుకుంటున్న గరేత్ విన్ ఓవేన్

ప్రజారోగ్యమే ధ్యేయంగా ఐఎంఏ పనిచేస్తోంది

- ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ శరత్‌కుమార్ అగర్వాల్

సుల్తాన్‌బజార్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశంలో వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు వైద్యం అందిస్తోందని అసోసియేషన్ జాతీయ హెడ్ క్వార్టర్ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌కుమార్ అగర్వాల్ అన్నారు. కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ వైద్యులు కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో తెగించి కువైట్ రోగులకు చికిత్సలు అందించి ప్రాణాలు నిలిపారని, ఈ క్రమంలో 2వేల మంది డాక్టర్ల ప్రాణాలు కూడా పోయాయన్నారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందాలనే సదుద్దేశంతో 'ఆవో గావ్ చలో' అనే పేరిట కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని వివిధ వ్యాధులకు చికిత్సలు అందించామన్నారు. 60 నుంచి 70 వేల అభయ దానం చేయించామని, అలాగే అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఆస్పత్రి అంటే సేఫ్ జోన్ ఉండాలని, కానీ కొన్ని పరిస్థితుల్లో ఆస్పత్రులపై దాడులు జరుగుతున్నాయని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనికి ప్రభుత్వం కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే 70 శాఖలతో వివిధ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, కార్యదర్శి విజయరావ్, కోశాధికారి రాజేంద్రకుమార్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎస్.పుల్లారావు, డాక్టర్ సంపత్‌రావు, ఆనంద్‌కుమార్, డాక్టర్ హలీం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతోన్న తెలుగు వర్సిటీ పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఆచార్య తంగెడ కిషన్ రావు, చిత్రంలో ఆయాచితం శ్రీధర్

రెండో రోజు 23 మందికి అందజేత

నాంపల్లి: లలిత కళా రంగాలతో పాటు సామాజిక ప్రక్రియల్లో విశేషమైన సేవలందించిన 23 మంది ప్రముఖులను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2020 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలను ప్రదానం చేసింది. పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రంతో పాటు రూ.5,116 నగదును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ... లలిత కళల సమాహారం తెలుగు విశ్వవిద్యాలయమని, భాషల సంస్కృతి సంస్కారాలను నేర్పి ఈ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు ధన్యులన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లోనే కాకుండా వైవిధ్య శాస్త్రాలను కూడా ఆదరించి గౌరవంగా వయోబేధం లేని నిష్ణాతులను వివిధ పురస్కారాల పేరిట సత్కరించడం సంతోషకరమన్నారు. పురస్కారాలు, గ్రహీతల పట్ల విశ్వాసం, నమ్మకం కలిగేట్లు నిష్ణాతులను ఎంపిక చేయడంలో విశ్వవిద్యాలయ కృషి అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు మాట్లాడుతూ... ప్రతి యేటా తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, లలిత కళా రంగాల్లోనే కాకుండా విభిన్న శాస్త్రాల్లో నిష్ణాతులైన ప్రముఖులను ఎంపిక చేసి వివిధ పురస్కారాల పేరిట సుమారు 70 మందిని సత్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ స్వాగతోపన్యాసం చేయగా విస్తరణల సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి సభా సమన్వయం చేశారు.

పురస్కారాలు అందుకున్న వారి వివరాలు ఇలా..

విభాగం	అందుకున్న ప్రముఖులు
మహిళాభ్యుదయం	భండారు విజయ
లలిత సంగీతం	పీవీసాయిబాబా
శాస్త్రీయ సంగీతం	డాక్టర్ శేషులత
భాష	రాళ్లపల్లి సుందరరావు
జానపద కళలు	పస్తం కొమురమ్మ
జీవిత చరిత్ర	జి.భగీరథ
పత్రికా రచన	అన్నవరపు బ్రహ్మయ్య
ఉత్తమ నటి	నాగమణి
ఉత్తమ నటుడు	మాలెల అంజిలయ్య
నాటకరంగం	ప్రొఫెసర్ శివాల్కర్
పేరిణి నృత్యం	పేరిణి ప్రకాష్
కూచిపూడి నృత్యం	డాక్టర్ రుద్రవరం సుధాకర్
సంఘ సేవ	ప్రొఫెసర్ గెల్లి నాగేశ్వరరావు
హేతువాద ప్రచారం	దేవగుప్తపు పేరలింగం
గ్రంథాలయ సమాచార విజ్ఞానం	డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి
గ్రంథాలయకర్త	ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం
సాంస్కృతిక సంస్థ నిర్వహణ	ఆకృతి సుధాకర్
ఇంద్రజాలం	శ్యాం
కార్టూనిస్ట్	నారు
జ్యోతిషం	ఎ.ఎస్.ఫణీంద్ర
ఉత్తమ ఉపాధ్యాయులు	ఏజాజ్ అహ్మద్
చిత్రలేఖనం	ప్రొఫెసర్ ప్రీతి సంయుక్త
అనువాద సాహిత్యం	వారాల ఆనంద్

'స్వయంకృషి' సేవలు మరువలేనివి

జవహర్‌నగర్: వృద్ధులు, మానసిక పరిస్థితి బాగాలేని వారికి ఆశ్రయం కల్పించి వారిని ఆదుకుంటున్న స్వయంకృషి సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశంసించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని స్వయంకృషి వృద్ధాశ్రమాన్ని కార్మిక శాఖమంత్రి మల్లారెడ్డితో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ స్వయంకృషిలో ఉన్న వృద్ధులకు, మానసిక స్థితి బాగాలేని వారికి అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సంస్థ అభివృద్ధి కోసం మరో రెండెకరాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని మల్లారెడ్డి తెలిపారు. అనంతరం వృద్ధులతో కలిసి కేక్ కట్‌చేసి సహపంక్తి భోజనంలో కవిత పాల్గొన్నారు. కార్యక్రమంలో మేయర్ కావ్య, దమ్మాయిగూడ చైర్‌పర్సన్ ప్రణీత, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, స్వయంకృషి వ్యవస్థాపకురాలు మంజుల కల్యాణి, చైర్మన్ జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ దుర్గ, కార్పొరేటర్లు, మురుగేశ్, లలితాయాదవ్, సంగీత, జిట్ట శ్రీవాణి, పానుగంటి బాబు, వేణు పాల్గొన్నారు.



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ కవిత





పరిపూర్ణ పురుషోత్తముడు

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అంతటా వ్యాపించి ఉన్న భగవానుడు మనకోసం ఒక రూపంలో ఒదిగిపోయి దివి నుంచి భువికి దిగి వస్తే, దాన్ని అవతారం అంటారు. అలా శ్రీ మహావిష్ణువు ధరించిన దశావతారాలలో మానవ జీవితానికి అతి దగ్గరగా ఉండే అవతారం రామావతారం. చైత్ర శుద్ధ నవమి రోజు, లోకాలన్నిటి చేత నమస్కరింపబడే రాముడు ఈ భూమి మీద జన్మించాడు. పుట్టింది మొదలు ధర్మాన్నే అనుసరించాడు. పితృధర్మం, మాతృధర్మం, భ్రాతృధర్మం, స్నేహ ధర్మం, పత్నీ ధర్మం, ఋషుల ధర్మం... ఇలా అన్ని ధర్మాలు తెలిసినవాడు, ఆచరించినవాడు. అందుకే 'రామో విగ్రహవాన్ ధర్మః' అంటూ శత్రువులు కూడా ఆయనను స్తుతించారు.

నేడు శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా...

ఆ పరిపూర్ణ పురుషోత్తముడి గురించి తెలుసుకుందాం.

అప్పటికి కౌసల్యాసుతునికి పదిహేను పదహారేళ్ల వయసుండొచ్చు. ఒకానొక రోజు దశరథమహారాజు రాముణ్ణి పిలిచి విశ్వామిత్ర మహర్షివైపు చూపిస్తూ ''ఈ మహర్షితోపాటు నువ్వు అడవులకు వెళ్లాలి నాయనా...'' అని అంటాడు. మరో పిల్లాడయితే ఏమనేవాడో ఏమో కానీ, రాముడు మాత్రం తండ్రి చెప్పాడు కాబట్టి కిమ్మనకుండా బయలుదేరాడు. అనుగు సోదరుడు లక్ష్మణుడు తోడు రాగా అడవుల్లోకి దారితీశాడు. తాటక సంహారం చేశాడు. అహల్యకు విమోచన ప్రసాదించాడు. రాముడు ఎంతటి క్రమశిక్షణ కలవాడంటే అంతఃపురంలో ఉన్నంత కాలమూ కన్నవారి మాట జవదాటలేదు. అరణ్యాల్లో ప్రవేశించాక విశ్వామిత్రుని ఆజ్ఞ మీరలేదు. సీతా స్వయంవరానికి తీసుకువెళతానని ఆ గురువర్యుడంటే మారు మాట్లాడకుండా అనుసరించాడు.

పెద్దల మాటకే ప్రాధాన్యం

జనకమహారాజు నెలకొల్పిన స్వయంవరమంటపంలో శ్రీరాముడు అడుగుమోపినా శివధనుస్సు ఉండే చోటికి హడావుడిగా వెళ్లిపోలేదు. దాన్ని ఛళ్లన ఎత్తేసి, ఫెళ్లన విరిచేసి, చేతులు దులిపేసుకోలేదు. ఎలాంటి తొందరపాటూ పడకుండా సభాభవనంలో నిమ్మళంగా కూర్చున్నాడు. శివధనువును ఎత్తాలంటూ విశ్వామిత్రుడు అనుజ్ఞ ఇచ్చాకనే రాముడు ఆ పనికి పూనుకున్నాడు. ధనస్సును సున్నితంగా ఎత్తిపట్టుకుని, నారి సారించి, విరిచాడు. ఇదంతా ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా చేశాడు. అంత పెద్ద పనీ పూర్తిచేశాక ధీర గంభీరంగా అడుగులు వేస్తూ తన ఉచితాసనానికి చేరుకున్నాడు. చిన్నపాటి విజయాన్ని సాధిస్తేనే మురిసి మెరిసిపోయే మనం, ఆ సందర్భాన రాముడి వర్తన నుంచి ఎన్ని పాఠాలు నేర్చుకోవచ్చో. చిన్న కష్టానికే కన్నీరొలికించడం. అల్పమైన సుఖాలకే అతిగా స్పందించడం.. లాంటి లక్షణాలను మరెంత సునాయాసంగా తొలగించుకోవచ్చో!

> **కృతజ్ఞత ఆయన రక్తంలోనే ఉంది**
>
> చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువని సద్గుణ సంపన్నత రామునిది. అందుకే సీతమ్మ జాడతెలుసుకున్న ఆంజనేయస్వామిని బిడ్డలా చూసుకున్నాడు. ఎవరికీ ఇవ్వనంతటి చనువును ఇచ్చాడు. తన ప్రేమను పంచాడు. సుగ్రీవుడికి పట్టం కట్టాడు. విభీషణునికి లంకేశునిగా మకుటం తొడిగాడు.

వినయ విధేయతలు

తొందరపాటు...తొట్రుపాటు అనేవి రాముడి నిఘంటువులోనే లేదు. శివధనువును విరవగానే సీతను రాముడికిచ్చి పెళ్లి చేస్తానని జనకుడు చెప్పిన మాట విని ఎగిరి గంతేయలేదు. వెంటనే సీత మెడలో మూడు ముళ్లూ వేసేయలేదు. జనకుని ప్రతిపాదనను తన కన్నవారికి తెలియజేయాలని, అందుకు వారి అనుమతి అవసరమనీ వినమ్రంగా చెప్పాడు. ఎవరి పట్ల ఏవేళ ఎలా ఆదరం చూపాలో రామునికి బాగా తెలుసుననడానికి ఇంతకు మించిన ఉదాహరణ మరొకటి లేదు. అలా ఆ పెద్దలందరి సమక్షంలోనూ మైథిలి చేయి అందుకున్నాడు.

సీతారాముల కళ్యాణం జరిగి ఎంతోసేపు అవనే అవదు. పరశురాముడు వేంచేశాడు. పెళ్లివేదిక వద్దకు వస్తూనే ఆ మహాశయుడు వీరావేశాన్ని ప్రదర్శించాడు. ప్రపంచంలో రాముడంటే పరశురాముడేనని, మరో రాముడికి లోకాన చోటు లేనేలేదని వీరవిహారం చేశాడు. అటు జనకుడు, ఇటు దశరథుడు పరశురాముని క్రౌర్యాన్ని చూసి బెంబేలెత్తిపోయారు. అయితే రాముడు ఏమాత్రం తొందరపడలేదు. పరశురాముడు ఎంతగా పేట్రేగిపోతుంటే రాముడు అంత ప్రశాంతంగా ఉన్నాడు. పరశురాముడు అందించిన విష్ణుధనువును సునాయాసంగా పైకెత్తాడు. తను శ్రీహరి ప్రతిరూపమని చెప్పకనే చెప్పాడు. దీంతో పరశురాముడికి కమ్మిన పొరలు తొలగిపోయాయి.

తారుమారైనా...

మర్నాడు పొద్దున్నే పట్టాభిషేకం జరగాల్సి ఉంది. రాత్రికి రాత్రే కథ మారిపోయింది. కైకమ్మ స్వయంగా పిలిచి, తన మాటల్ని దశరథుని ఆదేశాలుగా వినిపించింది. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా పద్నాలుగేళ్లపాటు అరణ్యవాసం చేయాలని ఆజ్ఞాపించింది. మారు తల్లి మాటలను మన్నించాడు. అడవుల్లోకి పోయేందుకు సిద్ధమేనంటూ అందుకు రథాన్ని సిద్ధం చెయ్యమన్నాడు. మంగళస్నానాలు చేసి రాజదండాన్ని చేపట్టాల్సిన వేళ పత్నినీ, సోదరునీ వెంటబెట్టుకుని గుహుని పడవమీద నది దాటుకుంటూ పోయాడు.

అడవుల్లోనూ ఆ రామునికి ప్రశాంతత లేనే లేదు. కష్టాలూ కన్నీళ్లే! సీతమ్మను రావణుడు అపహరించుకుపోయాక మానసికంగా నలిగిపోయాడు. చివరికి లంకలో అమ్మవారు ఉన్నారన్న సంగతి తెలిసి కొంత స్థిమితపడ్డాడు. తన ప్రియపత్నిని తన వద్దకు తెచ్చుకునేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. వానరసైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. విభీషణునితో చెలిమిచేశాడు. ఓరిమితో వ్యవహరించాడు. తగిన సమయం కోసం ఓపికగా ఎదురు చూశాడు. సముద్రం మీద సేతువును నిర్మించాడు. అందుబాటులో ఉన్న వానర సేన సహకారంతోనే అమిత బలవంతుడైన శత్రువుతో యుద్ధం చేశాడు. విజేత తానే అయ్యాడు.

> **..జననీ జన్మభూమిశ్చ..**
>
> రావణ సంహారం జరిగాక ఆ రాక్షస రాజు మనసుపడి కట్టించుకున్న కోటను స్వాధీనం చేసుకోవాలని లక్ష్మణుడు భావించాడు. విషయాన్ని అన్నతో చెప్పాడు. యావత్ లంకానగరమే మణిమయ నిర్మితమైనది. అందులోని రాజ సౌధం సామాన్యమైంది కాదు. ఎటు చూసినా బంగారమే. కాని, రాముని తీరు వేరు. ఆయనకు దురాశ ఉండదు. ఆయన ధర్మం తప్పడు. లక్ష్మణుని సలహాను సున్నితంగా తిరస్కరిస్తాడు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అంటూ అయోధ్య వైపు చూడాలని సూచన చేస్తాడు. లంక విభీషణునికే చెందుతుందని స్పష్టం చేస్తాడు. అంటే పరాయి ప్రదేశం ఎంతటి గొప్పదైనా, సుందరమైనదైనా దానిని చూసి మనసు పారేసుకోలేదు. మాతృభూమిని మరువలేదు. పుట్టిన గడ్డపై ప్రేమను పోగొట్టుకోలేదు.

స్థితప్రజ్ఞావంతుడు

దక్కుతుందనుకున్న రాజ్యం క్షణాల్లో చేజారిపోయింది. వనవాస క్లేశాలు ముదిరిపోయాయి. సరసరాజాన్నభోజనాల స్థానంలో ఆకులు అలములు తినాల్సి వచ్చింది. ఒకవైపు భార్యావియోగం. మరోవైపు రాక్షసబాధ. వయసేమంత పెద్దది కాదు. అయినా చలించలేదు. స్థిరంగా ఉన్నాడు. దృఢంగా ఉన్నాడు. స్థితప్రజ్ఞతతో వ్యవహరించాడు. మరి ఇప్పటికాలాన మనం ఎలా ఉన్నాం..? బస్సు దొరక్కపోతే ఆందోళన. సినిమా టికెట్టు అందకపోతే అశాంతి. పరీక్షల్లో మార్కులు తక్కువయితే ఆవేదన. అన్నింటికీ తొందరే. ప్రేమ తొందర. పెళ్లి తొందర. ఇలా అయితే ఎలా. రాముని వంటి వారినే కష్టాలు కాల్చుకు తిన్నాయి. అన్నింటినీ ఆయన ఓపిగ్గా ఎదుర్కొన్నాడు. ఆయనతో పోల్చుకుంటే మనం ఎంతటి వారం? ఆయన పడ్డ కష్టాలతో పోల్చి చూసుకుంటే మన కష్టాలు ఏపాటివి?

ఎప్పటి త్రేతా యుగం? రాముడు పుట్టి రెండు యుగాలయింది. మనమిప్పుడు కలికాలంలో ఉన్నాం. అయినా ఆ ఆదర్శనీయుణ్ణి నేటికీ మరువలేకపోతున్నాం. అదే ఆయన వ్యక్తిత్వం. అందుకే మానవుడిగా పుట్టినా, రాముడు మనకు దేవుడయ్యాడు. ఆయన నడిచిన బాట అయిన రామాయణం పఠనీయ కావ్యం అయింది. అందుకే రామాయణాన్ని పారాయణం చేయాలి. అందులోని మంచిని ఒంటబట్టించుకోవాలి.

– డి.వి.ఆర్. భాస్కర్

రామ నైవేద్యం

పానకం

కావలసినవి: బెల్లం పొడి– పావు కేజీ; నీళ్లు– లీటరు; యాలకుల పొడి– టీ స్పూన్; మిరియాల పొడి– టీ స్పూన్; శొంఠిపొడి– చిటికెడు

తయారీ: బెల్లం పొడిలో నీటిని కలిపి కరిగిన తర్వాత వడపోయాలి. ఈ బెల్లం నీటిలో యాలకుల పొడి, మిరియాల పొడి, శొంఠిపొడి కలిపితే పానకం రెడీ.



వడపప్పు

కావలసినవి: పెసరపప్పు – పావు కేజీ; పచ్చిమిర్చి ముక్కలు – టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము– టేబుల్ స్పూన్; మామిడికాయ తురుము– టేబుల్ స్పూన్

తయారీ: పెసరపప్పు శుభ్రంగా కడిగి అరగంట సేపు నానబెట్టాలి. గింజ మెత్తబడిన తర్వాత నీటిని వంపేసి అందులో పైన తీసుకున్న దినుసులన్నీ కలిపితే వడపప్పు రెడీ.

వడపప్పు, పానకం ఆరోగ్యకరమైనవి. ఈ రెండింటినీ కలిపి తింటే జీర్ణవ్యవస్థ పని తీరు మెరుగవుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు తొలగిపోతాయి. వేసవి మొదలైన ఈ సమయంలో ఆరోగ్యం ఒడిదొడుకులను పానకం నివారిస్తుంది. యాలకుల పొడి అతిదాహాన్ని తగ్గిస్తుంది.

పదో తరగతి పరీక్షలు

ఇన్విజిలేటర్లు ఎలా మెలగాలి?

ఏప్రిల్ 3 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 10వ తరగతి పరీక్షలు. పిల్లలు ఒత్తిడిలో ఉంటారు. పెద్దలు ఒత్తిడి పెడుతుంటారు. వీటికి తోడు పరీక్షా హాలులో ఇన్విజిలేటర్లు కూడా ఒత్తిడి పెడితే విద్యార్థుల పరిస్థితి సంకటంలో పడుతుంది. 'ఇన్విజిలేటర్ల పని పిల్లలు ప్రశాంతంగా రాసేలా చూడటం. వారితో మృదువుగా ఉంటూనే పరీక్షల నియమ నిబంధనలు పాటించవచ్చు' అంటారు పియాలి బెనర్జీ.



ప్రతీకాత్మక చిత్రం

'పిల్లలు ఎప్పుడూ కనిపించేలా అల్లరిగా కాకుండా గంభీరంగా మారిపోయే సమయం అది' అంటుంది పియాలి బెనర్జీ పరీక్షల సమయం గురించి. ఆమె ముంబైలో సుదీర్ఘ కాలం హైస్కూల్‌లో ఇంగ్లిష్ బోధించింది. చాలాసార్లు ఇన్విజిలేటర్‌గా పని చేసింది.

'ఇన్విజిలేటర్‌కు పిల్లలను పరీక్షలు రాయడానికి ఉత్సాహపరిచే స్వభావం ఉండాలి. అది లేనప్పుడు కనీసం ఊరికే ఉంటే చాలు. ఏవో ఒక మాటలు చెప్పి, గద్దించి వారిని నిరుత్సాహపరిచే హక్కు మాత్రం లేదు' అంటుందామె. తాను ఇన్విజిలేటర్‌గా ఉన్నప్పుడు గమనించిన అంశాలు పియాలి చెప్పింది.

'ఒకసారి ఒక పిల్లాడు తల ఒంచుకుని కూచుని ఉన్నాడు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడని అనుకున్నాను. రెండు నిమిషాలైనా కదల్లేదు. దగ్గరికెళ్లి చూశాను. నిద్రలో జారుకున్నాడు. పాపం రాత్రి ఎంతసేపు చదివాడో. మెల్లగా తట్టి లేపాను. ఉలిక్కిపడి లేచాడు. వాస్తవంలోకి వచ్చి ఎగ్జామినేషన్ హాల్లో ఉన్నానని గ్రహించి పూర్తిగా కంగారుపడిపోయాను. మెల్లగా చెప్పాను– ఐదు నిమిషాలే పడుకున్నావు. ఏం కొంపలు మునగలేదు. రాయి అని. స్థిమితపడి రాయడంలో పడ్డాడు. పరీక్ష అయ్యాక మొహమాటంగా నవ్వుతూ థ్యాంక్స్ చెప్పాడు. తల్లిదండ్రులు పరీక్ష ముందురోజు రాత్రి తొమ్మిదిన్నరకంతా పిల్లలను నిద్రపోయేలా చూడాలి. పిల్లల్ని అలా చదువు ప్లాన్ చేసుకోమని చెప్పాలి. ఇంకోసారి ఇంకో పిల్లాడు మాటిమాటికి టైమ్ వైపు చూసుకుంటూ కంగారుగా రాస్తున్నాడు. టైమ్ సరిపోదేమోనని భయం. దగ్గరగా ఒంగి చెప్పాను– హైరానా పడకు. మూడు గంటల్లో పూర్తయ్యేలాగే నీ ప్రశ్నలు ఉంటాయి. వాచీ చూడకు. రాసుకుంటూ వెళ్లు. నేను టైమ్ అలెర్ట్ చెప్తానుగా అన్నాను. పిల్లలను టైమ్ చాలదని భయపెట్టకూడదు' అంటుంది పియాలి బెనర్జీ. 'కొంతమంది పిల్లలు హడావిడిలో పెన్ను పెన్సిల్ కూడా తీసుకురారు. ఇంక్ అయిపోయిందని పెన్ కోసం అడుగుతారు. అప్పుడు వారిని సూటిపోటిగా ఏదో ఒక మాట అంటే తర్వాత ఏం రాస్తారు? చిర్నవ్వుతో ఒక పెన్ అందిస్తే ఏం పోతుంది?' అంటుందామె.



● పియాలి బెనర్జీ

ఎగ్జామినేషన్ హాల్లో పెద్దగా అరవడం సరియైన పద్ధతి కాదు అంటుందామె. ఎవరైనా కాపీ చేస్తూనో మరో కోతి పని చేస్తూనో దొరికిపోయినా హాలంతా అదిరిపోయేలా అరిచి అందరు పిల్లలనూ బెంబేలెత్తించకూడదు. చాలా నిశ్శబ్దంగానే ఆ కాపీ చేస్తున్న పిల్లలను హాలు బయటకు తీసుకెళ్లి వ్యవహారం తేల్చాలి అంటుందామె. 'పిల్లలు ఏవైనా అనవసరమైనవి పెట్టుకున్నారా తమ దగ్గర అని ఒకసారి చెక్ చేస్తే చాలు. పరీక్ష మధ్యలో మాటి మాటికి వారిని శల్యపరీక్షకు గురి చేసి ఏకాగ్రతను భంగం కలిగించకూడదు' అని చెబుతుంది.

'పిల్లలు సరిగ్గా తమ నంబర్ వేశారో లేదో చెక్ చేయడం ఇన్విజిలేటర్ ప్రధానమైన పని. అది మాత్రం ప్రతి విద్యార్థి దగ్గరకు వెళ్లి చెక్ చేసి వారికి ఓకే చెప్పాలి. లేదంటే పరీక్ష రాసి ఇంటికెళ్లినా నంబర్ సరిగ్గా వేశానా లేదా అని కంగారు పడతారు'' అంటుంది పియాలి.

పదో తరగతి పరీక్షలంటే పిల్లలు జీవితంలో మొదట ఎదుర్కొనే పరీక్షలు. ఆ సమయంలో ఇన్విజిలేటర్లు వారి దృష్టితో ఆలోచించి వీలైనంత కంఫర్ట్‌గా పరీక్ష రాసేలా చూడాలి. వారు రాస్తున్నప్పుడు ఇన్విజిలేటర్లు శ్రద్ధగా, విసుగు లేకుండా ఉండటం అన్నింటి కంటే ముఖ్యం అని సూచిస్తున్నదామె.

బ్యూటిప్స్

చర్మకాంతికి ...

- ముందు రోజు రాత్రి ఐదు బాదం పప్పులను నానబెట్టి, మరుసటి రోజు పొట్టు తీసి మెత్తగా రుబ్బి, పాలు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసి, మృదువుగా మసాజ్ చేసి పదిహేను నిమిషాల తర్వాత నీటితో శుభ్రపరుచుకోవాలి. తరచూ ఇలా చేస్తుంటే చర్మం మృదువుగా మారుతుంది, కాంతి పెరుగుతుంది.
- టేబుల్ స్పూన్ తేనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి, మెడకు, చేతులకు రాసి 15 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ మిశ్రమం చర్మంపై మలినాలను తొలగించడంలో మైల్డ్ ఫేస్ క్లెన్సర్‌గా పనిచేస్తుంది. చర్మానికి తగినంత మాయిశ్చరైజర్ అందుతుంది.



- బంగాళదుంప, క్యారట్‌ను ఉడికించి గుజ్జు చేయాలి. ఈ మిశ్రమంలో చిటికెడు బేకింగ్ సోడా, చిటికెడు పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు రాసుకొని రెండు నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.

సైబర్ టాక్

డిజిటల్ వేధింపులు



మంజు (పేరు మార్చడమైనది) తన ఆఫీసులో పనిచేసే సహోద్యోగి సంతోష్‌కు ఫోన్ చేసింది. కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి వాట్సప్ ద్వారా రకరకాలుగా వేధించడం తట్టుకోలేకపోతున్నానని, పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికి సహాయంగా రమ్మని కోరింది. అందుకే సరే అన్నాడు సంతోష్. దీంతో ఇద్దరూ కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తనకు వస్తున్న వేధింపుల మెసేజ్‌లను పోలీసులకు చూపించింది మంజు. ఇటీవలే తనకు పెళ్లి కుదిరిందని, విదేశీ నంబర్ల నుంచి బెదిరింపు మెసేజ్‌లతో పాటు, అసభ్యకరమైన ఫొటోలను షేర్ చేస్తున్నారని, ఆ ఫొటోలు పెళ్లి కొడుక్కు కూడా పంపించారని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లోనూ ఈ వేధింపులు ఉంటున్నాయిని వివరించింది మంజు. కంప్లైంట్ తీసుకున్న పోలీసులు మంజును మరుసటి రోజు రమ్మని చెప్పారు. వాళ్లు చెప్పినట్టుగానే ఒక్కతే వెళ్లింది. ఫోన్‌కాల్ విదేశాలకు సంబంధించిన నెంబరే. కానీ, ఆమెకు షేర్ అయిన ఫొటోల బ్యాక్‌డ్రాప్ ఇండియాలో ఉన్నట్టు అనిపిస్తుంది. అదే విషయాన్ని ఆమెకు చూపుతూ, 'ఈ ప్రదేశాలను గుర్తుపట్టగలరా?!' అని అడిగారు. ఆ బ్యాక్‌డ్రాప్ తన ఆఫీసులోని టాయిలెట్స్ అని మంజు గుర్తించింది. ఆఫీసు టాయ్‌లెట్స్, అక్కడ పని చేస్తున్న బృందాన్ని పరిశీలించాక సంతోష్ నేరస్థుడు అని రుజువయ్యింది. విషయం తెలిసి మంజు షాక్ అయ్యింది. తనతో స్నేహంగా మెలిగే సంతోష్ ఇలాంటి పని చేశాడంటే నమ్మలేకపోయింది. మంజు పెళ్లి కుదరడంతో ఆమెను ప్రేమించిన సంతోష్ తట్టుకోలేకపోయాడు. ఆమె పరువు తీసేలా చేస్తే విధిలేక ఎప్పటికైనా తనను పెళ్లి చేసుకుంటుందని అనుకున్నాడు. అందుకే పెళ్లి సంబంధాన్ని చెడగొట్టేందుకు సంతోష్ చేసిన ప్లాన్ ఇదని అందరికీ అర్థమైంది.

* * *

ఇంటర్నెట్‌లో ఒక వ్యక్తి లేదా సంస్థ గురించి వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా, వృత్తిపరమైన జీవితానికి హాని కలిగించే ఉద్దేశంతో చేసే ఇలాంటి చర్యను సైబర్ పరువు నష్టం అని కూడా అంటారు. సోషల్ మీడియా, బ్లాగ్‌లు, ఫోరమ్‌లు లేదా ఇతర వెబ్‌సైట్‌లలో పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, సమీక్షలు, ఫొటోలు లేదా వీడియోలను పోస్ట్ చేయడం ఇందులో ప్రధానంగా ఉంటుంది. తమ స్వలాభం కోసం లేదా అసూయ, ద్వేషాలతోనూ సైబర్ పరువు నష్టానికి కలిగించే వ్యక్తులు మన చుట్టూనే ఉండే అవకాశాలు ఉన్నాయి.

అనైతిక చర్య

- సోషల్ మీడియా, వార్తా చానెల్స్ కొన్నిసార్లు పబ్లిక్ షేమింగ్ చేస్తుండవచ్చు. ఆరోపణలు రుజువు కానప్పటికీ అవి ఒక వ్యక్తి లేదా సంస్థ ప్రతిష్ఠకు హాని కలిగే అవకాశాలు ఉన్నాయి. అందుకే, సోషల్ మీడియా లేదా చానెల్స్ ద్వారా వార్తలు ఇచ్చేవారు తగు జాగ్రత్తతో వ్యవహరించడం మంచిది.
- అసంతృప్తితో ఉన్న ఉద్యోగులు తమ యజమాని లేదా సహోద్యోగుల గురించి తప్పుడు లేదా అవమానకరమైన ప్రకటనలు చేయడం ద్వారా ఇతరులకు పరువు నష్టం కలిగించవచ్చు. ఇందులో అనైతిక లేదా చట్టవిరుద్ధమైన ప్రవర్తన, ఆరోపణలు చేయడం, పుకార్లు వ్యాప్తి చేయడం లేదా ఒకరి గురించి అవమానకర వ్యాఖ్యలు చేయడం వంటివన్నీ ఉంటాయి.
- రాజకీయాలు, మతానికి సంబంధించిన పుకార్లు అయితే మరింత హానికరం. ఇవి, ప్రజలను తప్పుదారి పట్టించేవిగా, విద్వేషాలకు కారకాలుగా ఉంటాయి.
- పరువు నష్టం కారణంగా వ్యక్తులు మానసికంగా భీతిల్లవచ్చు. కుంగుబాటుతో ఆత్మహత్య వంటి ప్రాణాపాయ చర్యలకు పాల్పడవచ్చు.
- ఆన్‌లైన్ పరువు నష్టం సంస్థలకు సంబంధించినదైతే కొన్నిసార్లు సమాజంపై ప్రభావం చూపవచ్చు.

తమ స్వలాభం కోసం ఒకరిని కించపరిచి, ఆనందించడం అనేది అనైతిక చర్య.

> **డిజిటల్‌లో పరువు నష్టం వాటిల్లితే.. రిపోర్ట్ చేయాల్సింది..**
>
> https://www.facebook.com/help/contact/430253071144967
> https://help.instagram.com/contact/653100351788502
> https://help.twitter.com/en/forms/safety-and-sensitive-content
> https://www.linkedin.com/help/linkedin/ask/rhsc
> https://help.snapchat.com/hc/en-us/articles/7012399221652-How-to-Report-Abuse-on-Snapchat

> **చట్టం.. బాధ్యత**
>
> తప్పుడు ప్రచారాలు చేసినందుకు, ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకోవచ్చు, నష్టపరిహారం పొందవచ్చు. ● మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ) కింద పౌరులందరికీ భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యం ఉంటుంది. అయితే, ఈ స్వేచ్ఛ కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది. మరొక వ్యక్తి ప్రతిష్ఠకు ఆటంకం కలిగించే ఏ వ్యాఖ్య అయినా పరువు నష్టం చట్టం కిందకు వస్తుంది.
>
> ● తమకు పరువు నష్టం కలిగిస్తున్నారని వ్యక్తులు లేదా సంస్థలు చట్టాన్ని సంప్రదించి, తగిన న్యాయాన్ని పొందే అవకాశాలు ఉన్నాయి.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఫ్లోరిడాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-4, 6-4తో టామీ పాల్ (అమెరికా)పై గెలిచాడు. క్వార్టర్ ఫైనల్లో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో అల్‌కరాజ్ ఆడతాడు. మయామి ఓపెన్‌లో అల్‌కరాజ్ మళ్లీ విజేతగా నిలిస్తేనే తన నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటాడు. ఓడిపోతే జొకోవిచ్ (సెర్బియా) మళ్లీ నంబర్‌వన్ అవుతాడు.



అంచనాలతో ఆందోళన లేదు: రోహిత్ శర్మ

ప్రతి మ్యాచ్‌లో బరిలో దిగేముందు తమపై భారీ అంచనాలు ఉంటాయని... అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకే శాయశక్తులా కృషి చేస్తామని ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ఎన్నో ఏళ్లుగా క్రికెట్ ఆడుతున్న తనకు ఇతరుల అంచనాల గురించి ఆందోళన లేదని, అనవసర ఆలోచనలతో ఒత్తిడి పెంచుకోనని... ఎలా ఆడితే మళ్లీ విజేతగా నిలుస్తామో అనే అంశం గురించే ఆలోచిస్తామని ఐదుసార్లు ముంబై జట్టును ఐపీఎల్ చాంపియన్‌గా నిలబెట్టిన రోహిత్ వ్యాఖ్యానించాడు.

గట్టెక్కిన శ్రీకాంత్

- రెండు మ్యాచ్ పాయింట్లు కాచుకొని నెగ్గిన భారత షట్లర్
- ప్రిక్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్, కిరణ్, ప్రియాన్షు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ అతి కష్టమ్మీద తొలి రౌండ్ అడ్డంకిని దాటాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-11, 25-27, 23-21తో ప్రపంచ 32వ ర్యాంకర్ సితికోమ్ థమాసిన్ (థాయ్‌లాండ్)పై కష్టపడి గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. 65 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో శ్రీకాంత్ రెండుసార్లు మ్యాచ్ పాయింట్లను కాచుకోవడం గమనార్హం. 19-15తో ఆధిక్యంలో నిలిచిన శ్రీకాంత్ ఒక్కసారిగా వరుసగా ఐదు పాయింట్లు చేజార్చుకోవడంతో థమాసిన్ 20-19తో విజయానికి పాయింట్ దూరంలో నిలిచాడు. అయితే శ్రీకాంత్ స్కోరును 20-20తో స్కోరును సమం చేశాడు. ఆ వెంటనే థమాసిన్ మరో పాయింట్ సాధించి 21-20తో ఆధిక్యంలోకి వచ్చాడు. కానీ శ్రీకాంత్ పట్టుదలతో ఆడి వరుసగా మూడు పాయింట్లు గెలిచి 23-21తో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సాయిప్రణీత్ (భారత్) 21-16, 18-21, 21-12తో జాన్ లూడా (చెక్ రిపబ్లిక్)పై, ప్రియాన్షు రజావత్ (భారత్) 18-21, 21-16, 21-11తో విక్టర్ స్వెండ్సన్ (డెన్మార్క్)పై, కిరణ్ జార్జి (భారత్) 21-16, 21-14తో మిథున్ మంజునాథ్ (భారత్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అయాటో ఎండో-యుటా టకె (జపాన్)లతో జరిగిన తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ తొలి గేమ్‌లో 9-11తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగారు.

సింధు శుభారంభం

మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధుతోపాటు వర్ధమాన క్రీడాకారిణిలు ఆకర్షి కశ్యప్, మాళవిక, అష్మిత ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21-10, 21-14తో జెన్‌జిరా స్టాడెల్‌మన్ (స్విట్జర్లాండ్)పై, ఆకర్షి 12-21, 21-15, 21-18తో ఆరో సీడ్ మిచెల్లి లీ (కెనడా)పై, మాళవిక 21-19, 16-21, 21-9తో కిసోనా సెల్వదురై (మలేసియా)పై, అష్మిత 21-12, 22-20తో లియోనైస్ హ్యుట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆరో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) ద్వయం 18-21, 16-21తో రెనా మియారా-అయాకో సకురమాటో (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది.

హంపి పరాజయం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్ ప్రి టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ (జీఎం) కోనేరు హంపి తొలి పరాజయాన్ని చవిచూసింది. బుధవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో చైనాకు చెందిన మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) జు జినెర్ 36 ఎత్తుల్లో హంపిపై సంచలన విజయం సాధించింది. భారత్‌కే చెందిన వైశాలి రెండో ఓటమిని మూటగట్టుకుంది. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 40 ఎత్తుల్లో ఓడిపోయింది.

సూపర్ షకీబ్



చిట్టగాంగ్: ఐర్లాండ్ జట్టుతో రెండో టి20లో బంగ్లాదేశ్ 77 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది.. కెప్టెన్ షకీబ్ (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38 నాటౌట్; 22 పరుగులకు 5 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వికెట్లు (136) తీసిన బౌలర్‌గా అవతరించాడు. 17 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 3 వికెట్లకు 202 పరుగులు చేసింది. అనంతరం ఐర్లాండ్ 17 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడిపోయింది.

విండీస్‌దే సిరీస్



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-1తో గెలుచుకుంది. మూడో టి20 మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. పేస్ బౌలర్ అల్జారి జోసెఫ్ (9 బంతుల్లో 14 నాటౌట్; 40 పరుగులకు 5 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విండీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. విండీస్ ముందుగా 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 213 పరుగులు చేసి ఓడిపోయింది.

మెస్సీ ‘సెంచరీ’

సాంటియాగో డెల్ ఎస్టెరో (అర్జెంటీనా): విఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ తన కెరీర్‌లో మరో ఘనత సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 100 గోల్స్ చేసిన మూడో ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. కురాసావ్ జట్టుతో జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో అర్జెంటీనా 7-0తో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ (20వ, 33వ, 37వ ని.లో) మూడు గోల్స్‌తో ‘హ్యాట్రిక్’ నమోదు చేశాడు. గొంజాలెజ్, ఫెర్నాండెజ్, డి మారియా, దిబాలా ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌లో మెస్సీ తొలి గోల్‌తో ‘సెంచరీ’ పూర్తయింది. 2006లో క్రొయేషియాతో జరిగిన మ్యాచ్‌లో తొలి గోల్ చేసిన మెస్సీ 17 ఏళ్ల తర్వాత 100 గోల్స్ మైలురాయిని దాటాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ దేశం తరఫున అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 122 గోల్స్), అలీ దాయ్ (ఇరాన్; 109 గోల్స్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.



‘రన్’రంగం రె‘ఢీ’...

- రేపటి నుంచి ఐపీఎల్ 16వ సీజన్
- 74 మ్యాచ్‌లతో వేసవి వినోదం



కరోనా నేపథ్యంలో గత మూడు సీజన్‌లు పలు ఆంక్షల మధ్య జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీకి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. ఈసారి ఎలాంటి ఆంక్షలు లేకుండా అభిమానులకు పూర్తిస్థాయిలో వేసవిలో పరుగుల విందు అందించడానికి ఐపీఎల్ జట్లు సిద్ధమయ్యాయి. శుక్రవారం అహ్మదాబాద్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్, నాలుగుసార్లు విజేత చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్‌తో ఐపీఎల్ 16వ సీజన్‌కు తెర లేవనుంది. మొత్తం 10 జట్ల మధ్య 12 నగరాల్లో 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ దశలో 70 మ్యాచ్‌లు ఉండగా... ప్లే ఆఫ్ దశలో నాలుగు మ్యాచ్‌లతో (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2, ఫైనల్) టోర్నీ ముగుస్తుంది. రాజస్తాన్ రాయల్స్ జట్టు జైపూర్‌తోపాటు గువాహటిలో... పంజాబ్ కింగ్స్ జట్టు మొహాలితోపాటు ధర్మశాలలో కూడా మ్యాచ్‌లు ఆడతాయి. కరోనా కంటే ముందు ఐపీఎల్‌లో ఇంటా, బయటా పద్ధతిలో ఆయా ఫ్రాంచైజీల మధ్య మ్యాచ్‌లు జరిగేవి. కరోనా కారణంగా ఈ పద్ధతికి విరామం ఇచ్చారు. ఇప్పుడు అంతా బాగుండటంతో నిర్వాహకులు మళ్లీ పాత పద్ధతిలో ఐపీఎల్‌ను నిర్వహించనున్నారు.

ఐపీఎల్-2023 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం	తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
మార్చి 31	గుజరాత్ x చెన్నై	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి	ఏప్రిల్ 26	బెంగళూరు x కోల్‌కతా	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 1	పంజాబ్ x కోల్‌కతా	మొహాలి	మ.గం. 3:30 నుంచి	ఏప్రిల్ 27	రాజస్తాన్ x చెన్నై	జైపూర్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 1	లక్నో x ఢిల్లీ	లక్నో	రా.గం. 7:30 నుంచి	ఏప్రిల్ 28	పంజాబ్ x లక్నో	మొహాలి	రా.గం. 7: 30 నుంచి
ఏప్రిల్ 2	హైదరాబాద్ x రాజస్తాన్	హైదరాబాద్	మ.గం. 3:30 నుంచి	ఏప్రిల్ 29	కోల్‌కతా x గుజరాత్	కోల్‌కతా	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 2	బెంగళూరు x ముంబై	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి	ఏప్రిల్ 29	ఢిల్లీ x హైదరాబాద్	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 3	చెన్నై x లక్నో	చెన్నై	రా.గం. 7:30 నుంచి	ఏప్రిల్ 30	చెన్నై x పంజాబ్	చెన్నై	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 4	ఢిల్లీ x గుజరాత్	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి	ఏప్రిల్ 30	ముంబై x రాజస్తాన్	ముంబై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 5	రాజస్తాన్ x పంజాబ్	గువాహటి	రా.గం. 7:30 నుంచి	మే 1	లక్నో x బెంగళూరు	లక్నో	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 6	కోల్‌కతా x బెంగళూరు	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి	మే 2	గుజరాత్ x ఢిల్లీ	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 7	లక్నో x హైదరాబాద్	లక్నో	రా.గం. 7:30 నుంచి	మే 3	పంజాబ్ x ముంబై	మొహాలి	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 8	రాజస్తాన్ x ఢిల్లీ	గువాహటి	మ.గం. 3:30 నుంచి	మే 4	లక్నో x చెన్నై	లక్నో	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 8	ముంబై x చెన్నై	ముంబై	రా.గం. 7:30 నుంచి	మే 4	హైదరాబాద్ x కోల్‌కతా	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 9	గుజరాత్ x కోల్‌కతా	అహ్మదాబాద్	మ.గం. 3:30 నుంచి	మే 5	రాజస్తాన్ x గుజరాత్	జైపూర్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 9	హైదరాబాద్ x పంజాబ్	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి	మే 6	చెన్నై x ముంబై	చెన్నై	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 10	బెంగళూరు x లక్నో	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి	మే 6	ఢిల్లీ x బెంగళూరు	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 11	ఢిల్లీ x ముంబై	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి	మే 7	గుజరాత్ x లక్నో	అహ్మదాబాద్	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 12	చెన్నై x రాజస్తాన్	చెన్నై	రా.గం. 7:30 నుంచి	మే 7	రాజస్తాన్ x హైదరాబాద్	జైపూర్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 13	పంజాబ్ x గుజరాత్	మొహాలి	రా.గం. 7:30 నుంచి	మే 8	కోల్‌కతా x పంజాబ్	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 14	కోల్‌కతా x హైదరాబాద్	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి	మే 9	ముంబై x బెంగళూరు	ముంబై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 15	బెంగళూరు x ఢిల్లీ	బెంగళూరు	మ.గం. 3:30 నుంచి	మే 10	చెన్నై x ఢిల్లీ	చెన్నై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 15	లక్నో x పంజాబ్	లక్నో	రా.గం. 7:30 నుంచి	మే 11	కోల్‌కతా x రాజస్తాన్	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 16	ముంబై x కోల్‌కతా	ముంబై	మ.గం. 3:30 నుంచి	మే 12	ముంబై x గుజరాత్	ముంబై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 16	గుజరాత్ x రాజస్తాన్	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి	మే 13	హైదరాబాద్ x లక్నో	హైదరాబాద్	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 17	బెంగళూరు x చెన్నై	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి	మే 13	ఢిల్లీ x పంజాబ్	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 18	హైదరాబాద్ x ముంబై	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి	మే 14	రాజస్తాన్ x బెంగళూరు	జైపూర్	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 19	రాజస్తాన్ x లక్నో	జైపూర్	రా.గం. 7:30 నుంచి	మే 14	చెన్నై x కోల్‌కతా	చెన్నై	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 20	పంజాబ్ x బెంగళూరు	మొహాలి	మ.గం. 3:30 నుంచి	మే 15	గుజరాత్ x హైదరాబాద్	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 20	ఢిల్లీ x కోల్‌కతా	ఢిల్లీ	రా.గం. 7:30 నుంచి	మే 16	లక్నో x ముంబై	లక్నో	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 21	చెన్నై x హైదరాబాద్	చెన్నై	రా.గం. 7:30 నుంచి	మే 17	పంజాబ్ x ఢిల్లీ	ధర్మశాల	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 22	లక్నో x గుజరాత్	లక్నో	మ.గం. 3:30 నుంచి	మే 18	హైదరాబాద్ x బెంగళూరు	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 22	ముంబై x పంజాబ్	ముంబై	రా.గం. 7:30 నుంచి	మే 19	పంజాబ్ x రాజస్తాన్	ధర్మశాల	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 23	బెంగళూరు x రాజస్తాన్	బెంగళూరు	మ.గం. 3:30 నుంచి	మే 20	ఢిల్లీ x చెన్నై	ఢిల్లీ	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 23	కోల్‌కతా x చెన్నై	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి	మే 20	కోల్‌కతా x లక్నో	కోల్‌కతా	రా.గం. 7:30 నుంచి
ఏప్రిల్ 24	హైదరాబాద్ x ఢిల్లీ	హైదరాబాద్	రా.గం. 7:30 నుంచి	మే 21	ముంబై x హైదరాబాద్	ముంబై	మ.గం. 3:30 నుంచి
ఏప్రిల్ 25	గుజరాత్ x ముంబై	అహ్మదాబాద్	రా.గం. 7:30 నుంచి	మే 21	బెంగళూరు x గుజరాత్	బెంగళూరు	రా.గం. 7:30 నుంచి

నోట్: ప్లే ఆఫ్ (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2) మూడు మ్యాచ్‌ల తేదీలను, వేదికలను తర్వాత ప్రకటిస్తారు. ఫైనల్ మ్యాచ్ మే 28న జరుగుతుంది. ఫైనల్ మ్యాచ్ వేదికను కూడా తర్వాత ప్రకటిస్తారు.

మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ చానెల్స్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సినిమా


● వెంకటేశ్

క్రిస్మస్ కానుక


హీరో వెంకటేశ్ సినీ అభిమానులకు, ప్రేక్షకులకు క్రిస్మస్ కానుక ఇవ్వనున్నారు. ఆయన నటిస్తున్న ‘సైంధవ్’ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా ప్రేక్షకులముందుకు తీసుకొస్తున్నారు. ‘హిట్’ మూవీ ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ నటిస్తున్న చిత్రం ‘సైంధవ్’. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా ‘సైంధవ్’ ని క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 22న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, వెంకటేశ్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ‘‘ఇటీవల మొదలైన ఈ లాంగ్ షెడ్యూల్‌లో వెంకటేశ్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం’’ అని యూనిట్ పేర్కొంది. నవాజుద్దీన్ సిద్ధిఖి కీలక పాత్ర చేస్తున్న ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, కెమెరా:ఎస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం.



నేనెందుకు ఇంట్లో కూర్చోవాలి?

- సమంత

‘పుష్ప:ది రైజ్’ చిత్రంలోని ‘ఊ అంటావా మావ..’ పాట ఎంత పాపులర్ అయిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అయితే ఆ ప్రత్యేక పాట ఒప్పుకోవద్దని తన సన్నిహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు వారించినా ధైర్యం చేసి ఆ పాటలో డ్యాన్స్ చేసినట్లు చెప్పారు హీరోయిన్ సమంత. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత, దేవ్‌మోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘శాకుంతలం’. ‘దిల్’ రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ– ‘‘నా వైవాహిక జీవితానికి ముగింపు పలికిన కొన్ని రోజులకే ‘ఊ అంటావా మావ..’ పాట ఆఫర్ వచ్చింది. తొలుత సుకుమార్‌గారికి నో చెప్పాను. కానీ, ఆ తర్వాత ఆలోచించాను. ఏదో తప్పు చేసినట్లు నేనెందుకు ఇంట్లో కూర్చోవాలి? అనిపించి, ఓకే చెప్పాను. ‘ఈ సమయంలో ఇలాంటి సాంగ్ చేయకు.. ఇంట్లో కూర్చో’ అంటూ నా శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. నిజానికి నా వైవాహిక జీవితంలో నేను వంద శాతం నిజాయితీగా ఉన్నాను. కానీ, ఎందుకో అది వర్కౌట్ కాలేదు. ఏదో నేరం చేసినట్లు ఎందుకు దాక్కోవాలి? చేయని నేరానికి నన్ను నేను హింసించుకుని ఎందుకు బాధపడాలి?. ప్రేమ అనేది స్త్రీ, పురుషుడి మధ్యే కాదు.. ఇద్దరు స్నేహితుల మధ్య కూడా ప్రేమానురాగాలు ఉంటాయి. అయినా ఒక బంధంలో(వివాహం) విఫలమైనంత మాత్రాన అంతా అయిపోనట్లు కాదు’’ అని పేర్కొన్నారు సమంత. ఇక 2017లో పెళ్లి చేసుకున్న నాగచైతన్య–సమంతలు ఆ తర్వాత 2021లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే.


● రవితేజ

అక్టోబర్‌లో టైగర్

వరుస చిత్రాలతో దూసుకెళుతున్న రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘టైగర్ నాగేశ్వరరావు’. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ మూవీలో నూపూర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. ఈ సినిమాని దసరా సందర్భంగా అక్టోబర్ 20న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఓ లుక్‌ని విడుదల చేశారు. ‘‘1970 నేపథ్యంలో స్టూవర్టుపురంలోని గజదొంగ టైగర్ నాగేశ్వరరావు జీవిత చరిత్ర ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో గతంలో ఎప్పుడూ చూడని సరికొత్త బాడీలాంగ్వేజ్, యాసతో రవితేజ ఆకట్టుకుంటారు’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.

డెవిల్ యాక్షన్


● కల్యాణ్ రామ్

కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ ‘డెవిల్: ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్’. నవీన్ మేడారం దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం 500 మందితో క్లైమాక్స్ ఫైట్ చిత్రీకరిస్తున్నారు యూనిట్. స్టంట్ కొరియోగ్రాఫర్ వెంకట్ పర్యవేక్షణలో ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నారు. ‘‘ఈ చిత్రంలో కల్యాణ్‌రామ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. 500మందితో తీస్తున్న ఈ భారీ ఫైట్ సీక్వెన్స్ సిల్వర్‌స్క్రీన్‌పై అద్భుతంగా ఉంటుంది. మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం’’ అన్నారు అభిషేక్ నామా. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్దన్ రామేశ్వర్, కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, కథ–స్క్రీన్ ప్లే– డైలాగ్స్: శ్రీకాంత్ విస్సా.

చీకటి సామ్రాజ్యంలో...


● విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ మూవీ నిర్మిస్తున్నారు. బుధవారం (మార్చి 29) విశ్వక్ సేన్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు మేకర్స్. ‘సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది’ అంటూ ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ వీడియో రిలీజ్ చేశారు మేకర్స్. ‘‘రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో రూపొందనున్న పీరియాడిక్ ఫిల్మ్ ఇది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: యువన్ శంకర్ రాజా, సహ నిర్మాతలు: వెంకట్, గోపి.


● అలీ, అల్లు అరవింద్, జయసుధ, చంద్రబోస్, గోపీచంద్ మలినేని

నాట్స్ ఆలోచన సంతోషాన్నిచ్చింది

- అల్లు అరవింద్

‘‘**మా** నాన్న అల్లు రామలింగయ్య, ఎన్టీఆర్, ఘంటసాలగార్ల శతజయంతి ఉత్సవాలను అమెరికాలో నిర్వహించనుండటం సంతోషం. ఈ ఆలోచన చేసిన ‘నాట్స్’వారికి థ్యాంక్స్’’ అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ప్రముఖ నటులు ఎన్టీఆర్, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకుడు ఘంటసాల శతజయంతి ఉత్సవాలను మే 26, 27, 28 తేదీల్లో ‘నాట్స్’ (ఉత్తర అమెరికా తెలుగు సమితి) ఆధ్వర్యంలో న్యూజెర్సీలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ‘నాట్స్’ అధ్యక్షుడు బాపు నూతి మాట్లాడుతూ– ‘‘అమెరికాలోని తెలుగువారికి కష్టం వస్తే సామాజికంగా, ఆర్థికంగా భరోసా ఇచ్చే సంస్థ ‘నాట్స్’’ అన్నారు. ‘‘నటులుగా 50 సంవత్సరాలు(గోల్డెన్ జూబ్లీ) పూర్తి చేసుకుంటున్న జయసుధ, సాయికుమార్‌గార్లను, ‘ఆస్కార్’ అవార్డు గ్రహీత చంద్రబోస్‌లను న్యూజెర్సీలో సత్కరిస్తాం’’ అన్నారు ‘నాట్స్’ కన్వీనర్ శ్రీధర్ అప్పసాని. ఈ వేడుకలో ‘నాట్స్’ డిప్యూటీ కన్వీనర్ రాజ్ అల్లాడ, నటులు సాయికుమార్, ఆది, డైరెక్టర్లు ఎ.కోదండరామి రెడ్డి, బి.గోపాల్, అవసరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ వారి అంచనాలకు తగ్గదు

- కిరణ్ అబ్బవరం


● అతుల్య, కిరణ్

‘‘మీటర్ సినిమా పాటలు, టీజర్, ట్రైలర్ చూసిన వారంతా నాకు చాలా పెద్ద సినిమా పడిందని అంటున్నారు. ఈ సినిమా నాకు ఎందుకు ప్రత్యేకం అన్నది ఏప్రిల్ 7న తెలుస్తుంది. ప్రేక్షకుల అంచనాలకు మా సినిమా తగ్గదు’’ అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. రమేష్ కడూరి దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రూపొందిన చిత్రం ‘మీటర్’. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకలో చెర్రీ మాట్లాడుతూ– ‘‘మీటర్’ మాస్ కమర్షియల్ స్టైల్‌లో ఉంటుంది. ఈ సినిమాతో కిరణ్ పెద్ద హీరో అవుతాడు’’ అన్నారు. ‘‘మీటర్’ లాంటి మంచి మూవీ అవకాశం ఇచ్చిన చెర్రీగారికి, కిరణ్‌కి థ్యాంక్స్’’ అన్నారు రమేష్ కడూరి.

నిజాయితీగా తీశాం

- శ్రీకాంత్ ఓదెల



‘‘దసరా’ లో నానిగారిని ఊర మాస్ క్యారెక్టర్‌లో చూపిస్తే ప్రేక్షకులకు నచ్చుతుందా? లేదా? అనే లెక్కలు వేసుకోలేదు. సినిమాని నిజాయితీగా తీశాం కాబట్టి ప్రేక్షకులు కూడా కథ కోణం నుంచే చూస్తారని భావిస్తున్నాను’’ అని డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల అన్నారు. నాని, కీర్తీ సురేశ్ జంటగా రూపొందిన చిత్రం ‘దసరా’. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ–‘‘సుకుమార్‌గారి ‘నాన్నకు ప్రేమతో’, ‘రంగస్థలం’ చిత్రాలకు అసిస్టెంట్‌గా పనిచేశా. నిజ జీవితంలో జరిగిన ఒక సంఘటనతో ‘దసరా’ కథని రాసుకున్నా. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్నా ఆ ఒత్తిడి, భయం నాకు లేదు. ఈ సినిమాలోని నానిగారి లుక్ 2020లోనే అనుకున్నాం. ‘పుష్ప’లో అల్లు అర్జున్‌గారి లుక్ చూసిన తర్వాత అనుకున్నది కాదు. దసరాలో హీరోయిన్‌గా తెలుగమ్మాయి కోసం దాదాపు ఎనిమిది నెలలు వెతికినా దొరకలేదు. దీంతో కీర్తీ సురేశ్‌గారిని తీసుకున్నాం. అనుకున్నదాని కంటే బడ్జెట్ ఎక్కువ అయినా సుధాకర్‌గారు ఎక్కడా రాజీపడలేదు. సంతోష్ నారాయణ్‌గారి పాటలకు మంచి ఆదరణ లభించింది. సత్యన్ సూర్యన్‌గారు బ్రిలియంట్ కెమెరామేన్’’ అన్నారు.

ఆ విషయం కూడా తెలియదా?

తెలుగు బ్లాక్ బస్టర్ మూవీ ‘రౌద్రం.. రణం.. రుధిరం’(‘ఆర్‌ఆర్‌ఆర్’) చిత్రాన్ని ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా తమిళ సినిమాగా పేర్కొనడం నెట్టింట వివాదాస్పదమైంది. దీనిపై సోషల్ మీడియాలో ఆమెను ట్రోల్ చేశారు నెటిజన్లు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు ప్రియాంక. ఆ ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి ‘ఆర్‌ఆర్‌ఆర్’ బాలీవుడ్ మూవీ అని చెప్పారు. ఆ తర్వాత ప్రియాంకా చోప్రా మాట్లాడుతూ– ‘‘ఆర్‌ఆర్‌ఆర్’ హిందీ చిత్రం కాదు.. మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన తమిళ మూవీ. మాకు ‘ఆర్‌ఆర్‌ఆర్’ చిత్రం హాలీవుడ్ ‘అవెంజర్స్’లాంటి సినిమా’’ అని పేర్కొన్నారు. దీనిపై నెటిజన్లు సోషల్‌మీడియాలో ప్రియాంకని ట్రోల్ చేశారు. ‘‘ఆర్‌ఆర్‌ఆర్’ తెలుగు సినిమా అని కూడా ప్రియాంకకి తెలియదా?’, ‘ఆస్కార్ ప్రీ పార్టీలో ‘ఆర్‌ఆర్‌ఆర్’ టీమ్‌తో కలిసి పాల్గొన్నారామె.. అయినప్పటికీ తెలుగు సినిమా అని ఆమె తెలుసుకోకపోవడం ఆశ్చర్యకరం’.. ఇలా నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ‘ఆర్‌ఆర్‌ఆర్’ గత ఏడాది మార్చి 25న విడుదలైన విషయం తెలిసిందే.


● ప్రియాంకా చోప్రా

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	346	57,960
నిఫ్టీ ▲	129	17,081

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,869	▲ 153
డోజోన్స్	32,618	▲ 222
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,564	▲ 80
డాక్స్	15,329	▲ 187
షాంఘై	3,240	▼ 5
నికాయ్	27,884	▲ 366

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై	
బంగారం (24 క్యారట్)	59,335 ▲ 370
బంగారం (22 క్యారట్)	59,097 ▲ 372
వెండి (కేజీ)	69,097 ▼ 403

లైఫ్‌లాంగ్ చేతికి గోమెకానిక్

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల కంపెనీ లైఫ్‌లాంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కన్సార్షియం ఆర్థిక ఒత్తిడిలో ఉన్న గోమెకానిక్‌ను కొనుగోలు చేసింది. ఆఫ్టర్ సేల్స్ సర్వీసులందించే స్టార్టప్ గోమెకానిక్‌ను కొనుగోలు చేసినట్లు లైఫ్‌లాంగ్ గ్రూప్ పేర్కొంది. డీల్ విలువను వెల్లడించలేదు. సెర్విజ్జీ కన్సార్షియంలో మెజారిటీ వాటాదారుగా గోమెకానిక్‌ను సొంతం చేసుకున్నట్లు లైఫ్‌లాంగ్ గ్రూప్ తెలియజేసింది. 1985లో ఏర్పాటైన లైఫ్‌లాంగ్ ఆటోమోటివ్ విడిభాగాలు, సర్వీసులు, మెడికల్ డివైస్‌ల తయారీ, ఈకామర్స్ సేవలు అందిస్తోంది. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా తాజా కొనుగోలుకి తెరతీసింది.

జోస్ అలుకాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆర్ మాధవన్



ముంబై: ఆభరణాల విక్రయ సంస్థ జోస్ అలుకాస్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా జాతీయ నటుడు ఆర్ మాధవన్‌ను నియమించుకుంది. ఇప్పటికే ఈ బ్రాండ్‌కు ప్రముఖ నటి కీర్తి సురేశ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారు. దీనికి సంబంధించి ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరు నటులు అంగీకార పత్రంపై సంతకాలు చేశారు. దేశ సినిమా రంగంలో అత్యంత ప్రజాదరణ కలిగిన వ్యక్తులు సంస్థ ప్రకటనల్లో నటించి తమ ఉత్పత్తులను కస్టమర్లకు మరింత చేరువ చేస్తారని గ్రూప్ చైర్మన్ జోస్ అలుకాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాపార రంగంలో నిజాయితీకి మారుపేరుగా నిలిచిన బ్రాండ్‌తో కలిసి పని చేయడం చాలా సంతోషంగా ఉందని మాధవన్ అన్నారు. ఆధునిక ప్రపంచంలో ఆభరణాల పట్ల పెరుగుతున్న మహిళల అభిరుచులను జోస్ అలుకాస్ తీర్చిందని నటి కీర్తి సురేష్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
30-3-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405-00
విజయవాడ	405-00
రిటైల్ ధర (డజను)	66.00
29-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

సాధారణ యూపీఐ చెల్లింపులపై చార్జీలు ఉండవు..

ఎన్‌పీసీఐ వివరణ



న్యూఢిల్లీ: ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు జరిపే సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎలాంటి చార్జీలు ఉండబోవని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్పష్టం చేసింది. ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాల (పీపీఐ) ద్వారా జరిపే మర్చంట్ లావాదేవీలకు మాత్రమే ఇంటర్‌చేంజ్ చార్జీలు వర్తిస్తాయని, వాటికి సంబంధించి కస్టమర్లపై చార్జీల భారం ఉండబోదని ఒక ప్రకటనలో వివరించింది. వాలెట్ల వంటి పీపీఐ సాధనాల ద్వారా రూ. 2,000కు మించి జరిపే చెల్లింపులపై 1.1 శాతం ఇంటర్‌చేంజ్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, బ్యాంకులు, ప్రీపెయిడ్ సాధనాలు, వ్యాపారవర్గాలకు మాత్రమే ఇది పరిమితం కానున్నప్పటికీ దీనితో కస్టమర్లపై చార్జీల భారం పడనుందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో ఎన్‌పీసీఐ తాజా వివరణ ఇచ్చింది. మరోమాటలో చెప్పాలంటే ఒక కంపెనీకి చెందిన వాలెట్ గల కస్టమరు మరో కంపెనీ వాలెట్ ఉన్న వర్తకులకు చెల్లింపులు జరిపినప్పుడు ఈ చార్జీలు వర్తిస్తాయి. రెండు వాలెట్ల మధ్య లావాదేవీలకు సంబంధించిన ఇంటర్‌చేంజ్ ఖర్చులను సర్దుబాటు చేసుకోవడానికి ఈ చార్జీలు సహాయపడతాయి. ప్రస్తుతం మొబైల్ వాలెట్ పేమెంట్ మార్కెట్లో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి ప్రధాన సంస్థలుగా ఉన్నాయి. బ్యాంకు ఖాతా లేదా పీపీఐ/పేటీఎం వాలెట్ ద్వారా చెల్లింపులు జరిపినా ఏ కస్టమరుకూ ఎటువంటి చార్జీలు ఉండవని పేటీఎం తెలిపింది.

గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ షాక్

రూ. 1,338 కోట్ల జరిమానా కట్టాల్సిందేనని ఆదేశం

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ మొబైల్ పరికరాల కేసుకు సంబంధించి టెక్ దిగ్గజం గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీలో ఎదురుదెబ్బ తగిలింది. రూ. 1,338 కోట్ల జరిమానా విధిస్తూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) ఇచ్చిన తీర్పును ఎన్‌సీఎల్‌ఏటీ సమర్థించింది. ఇప్పటికే చెల్లించిన 10 శాతం మొత్తాన్ని సర్దుబాటు చేసి, మిగతాది 30 రోజుల్లోగా డిపాజిట్ చేయాలని ఆదేశించింది. సీసీఐ సూచించిన చర్యలను అమలు చేసేందుకు గూగుల్‌కు 30 రోజుల వ్యవధినిచ్చింది. కేసు విచారణలో సీసీఐ సహజ న్యాయ సూత్రాలను పాటించలేదన్న గూగుల్ వాదనలను ఎన్‌సీఎల్‌ఏటీ తిరస్కరించింది. సీసీఐ తీర్పులోని పది అంశాల్లో ఆరింటిని సమర్థించిన ఎన్‌సీఎల్‌ఏటీ.. నాలుగింటిని మాత్రం తోసిపుచ్చింది. డివైజ్‌ను సెటప్ చేసేటప్పుడు యూజర్లు కోరుకున్న డిఫాల్ట్ సెర్చ్ ఇంజిన్‌ను ఎంచుకునేందుకు అనుమతించడం, టోకుగా యాప్‌లన్నింటిని ప్రీ-ఇన్‌స్టాల్ చేసుకోవాలంటూ ఫోన్ల తయారీ సంస్థలను ఒత్తిడి చేయకుండా ఉండటం తదితర అంశాలను ఎన్‌సీఎల్‌ఏటీ సమర్థించింది. ప్రీ-ఇన్‌స్టాల్ చేసిన వాటిని అన్-ఇన్‌స్టాల్ చేసేందుకు అనుమతించడం వంటి సూచనలను తోసిపుచ్చింది. యాప్‌ల ఇన్‌స్టాలేషన్ ఎంచుకోవడంలో ఫోన్ల తయారీ సంస్థలకు వెసులుబాటు ఉన్నప్పుడు .. దీని ప్రస్తావనే రాదని పేర్కొంది. ఆండ్రాయిడ్ మొబైల్ పరికరాల విషయంలో పోటీని దెబ్బతీసే విధానాలు పాటిస్తోందంటూ సీసీఐ గతేడాది అక్టోబర్ 20న గూగుల్‌కు రూ. 1,337.76 కోట్ల జరిమానా విధించింది. వివిధ అనుచిత వ్యాపార విధానాలకు దూరంగా ఉండాలంటూ ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ ఎన్‌సీఎల్‌ఏటీని గూగుల్ ఆశ్రయించింది. సీసీఐ నిష్పాక్షికంగా విచారణ జరపలేదంటూ ఆరోపించింది. గూగుల్ అప్పీలుపై మార్చి 31 లోగా నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం కోర్టు సూచనల మేరకు ఫిబ్రవరి 15 నుంచి ఎన్‌సీఎల్‌ఏటీ విచారణను జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే చైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్, సభ్యుడు అలోక్ శ్రీవాస్తవతో కూడిన బెంచ్ తాజా ఉత్తర్వులు జారీ చేసింది.



షార్ట్ కవరింగ్ లాభాలు

- కలిసొచ్చిన ఆఖర్లో కొనుగోళ్లు
- 17,100 చేరువలో నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 346 పాయింట్లు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు మార్చి సిరీస్‌కు లాభాలతో వీడ్కోలు పలికాయి. ఎఫ్అండ్ఓ డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరగడంతో బుధవారం సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు కొలిక్కి వస్తుండంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి. ఉదయం మార్కెట్ ప్రారంభమైన తర్వాత మిడ్ సెషన్ వరకు సూచీలు స్థిరంగా కదలాడాయి. ఆ తర్వాత కాస్త నెమ్మదించినా.., చివరి గంటలో కీలక రంగాల్లో కొనుగోళ్ల జోరు పెరగడంతో లాభాలు పెరిగాయి. ఉదయం సెన్సెక్స్ 41 పాయింట్ల స్వల్ప నష్టంతో 57,613 మొదలైంది. ఇంట్రాడేలో 57,524 వద్ద కనిష్టాన్ని, 58,124 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 346 పాయింట్లు ఎగసి 57,960 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25 పాయింట్లు పతనమై 16,952 వద్ద మొదలైంది. రోజంతా 16,941 – 17,126 శ్రేణిలో ట్రేడైంది. చివరికి 129 పాయింట్ల లాభంతో 17,081 వద్ద నిలిచింది. అన్ని రంగాల షేర్లకు డిమాండ్ నెలకొంది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు అధికాసక్తి చూపారు. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకటిన్నర శాతానికి పైగా ర్యాలీ చేశాయి. ఎఫ్‌పీఐలు రూ.1,245 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.823 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు క్షీణించి 82.31 స్థాయి వద్ద స్థిరపడింది. శ్రీరామ నవమి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు కావడంతో ఎక్స్ఛేంజీలు తిరిగి శుక్రవారం ప్రారంభమవుతాయి. సూచీలు అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో బీఎస్‌ఈలో రూ.3.12 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఆసియా మార్కెట్లు ఒకశాతం, యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం పెరిగాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ''ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతుందనే స్పష్టం వచ్చేంత వరకు, బ్యాంకింగ్ రంగంలో అనిశ్చితులు సంపూర్ణంగా సద్దుమణిగే దాకా ఒడిదుడుకులు తప్పవు. సాంకేతికంగా నిఫ్టీ గత 5 రోజుల్లో గరిష్ట స్థాయి వద్ద ముగిసింది. ఎగువన 17,207-17,255 శ్రేణిలో నిరోధాన్ని, దిగువ స్థాయిలో 16,985 వద్ద తక్షణ మద్దతు ఏర్పాటు చేసుకుంది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కెన్ తన నివేదికలో నిరాధారమైన, సత్యదూరమైన ఆరోపణలు చేసిందంటూ అదానీ గ్రూప్ వివరణతో ఈ కంపెనీల షేర్లు ర్యాలీ చేశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ తొమ్మిది శాతం, అదానీ పోర్ట్స్ ఏడుశాతం లాభపడ్డాయి. అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు ఐదుశాతం ఎగసి అప్పర్ సర్క్యూట్ వద్ద లాకయ్యాయి.
- ఇండస్‌ఇండ్ బ్యాంకుతో వివాదాలను పరిష్కరించుకున్నామని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తెలపడంతో జీ మీడియా షేరు మూడున్నర శాతం లాభపడి రూ.216 వద్ద స్థిరపడింది. ఇండస్ ఇండ్ బ్యాంక్ 2% బలపడి రూ.1,056 వద్ద నిలిచింది.
- బైబ్యాక్ ఇష్యూలో పాల్గొనేందుకు అర్హత తేదీ ముగియడంతో సింఫనీ షేరు ఆరు శాతం పతనమైన రూ.1023 వద్ద ముగిసింది.

కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ చమురు ఉత్పత్తి

- మే నెల నుంచి ప్రారంభించనున్నట్టు ప్రకటించిన కంపెనీ
- ఏడాది తర్వాతే గ్యాస్ ఉత్పత్తి సాధ్యం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) కృష్ణా గోదావరి బేసిన్ (కేజీ బేసిన్)లోని కేజీ డీ5 ప్రాజెక్ట్ పరిధిలో చమురు ఉత్పత్తిని ఈ ఏడాది మే నెలలో ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. సహజ వాయువు ఉత్పత్తిని ఏడాది తర్వాత ప్రారంభిస్తామని ఓఎన్‌జీసీ డైరెక్టర్ (ఉత్పత్తి విభాగం) పంకజ్ కుమార్ వెల్లడించారు. ముందుగా అనుకున్న ప్రకారం అయితే కేజీ డీ5 పరిధిలోని డీడబ్ల్యూఎన్-98/2 క్లస్టర్-2 క్షేత్రాల నుంచి గ్యాస్ ఉత్పత్తిని 2019 జూన్‌లోనే మొదలు పెట్టాలి. అదే విధంగా ఆయిల్ ఉత్పత్తిని 2020 మార్చిలో ఆరంభించాల్సి ఉంది. కానీ, ఈ లక్ష్యాలను ఓఎన్‌జీసీ చేరుకోలేకపోయింది. కరోనా మహమ్మారితో కాంట్రాక్టు, సరఫరా చైన్ సమస్యలను కారణాలుగా పేర్కొంటూ చమురు ఉత్పత్తిని 2021 నవంబర్‌కు వాయిదా వేసింది. ఆ తర్వాత 2022 మూడో త్రైమాసికానికి, ఇప్పుడు మే నెలకు వాయిదా వేసుకుంది. గ్యాస్ ఉత్పత్తిని 2021 మే నెలకు వాయిదా వేసుకోగా, అది కూడా సాధ్యపడలేదు. ఆ తర్వాత 2023 మే నెలకు వాయిదా వేయగా, ఇప్పుడు 2024 మేలోనే గ్యాస్ ఉత్పత్తి సాధ్యమవుతుందని ఓఎన్‌జీసీ చెబుతోంది.

ఫ్లోటింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం

ఇప్పటికే సముద్ర జలాల్లో ఫ్లోటింగ్ (నీటిపై తేలి ఉండే) ఉత్పత్తి యూనిట్‌ను (ఎఫ్‌పీఎస్‌ఓ) ఏర్పాటు చేసినట్టు ఓఎన్‌జీసీ డైరెక్టర్ పంకజ్ కుమార్ తెలిపారు. చమురు ఉత్పత్తి మే నుంచి ప్రారంభిస్తామని ప్రకటించారు. ''రోజువారీ 10,000 నుంచి 12,000 బ్యారెళ్ల చమురు ఉత్పత్తి మొదలు పెడతాం. రెండు నుంచి మూడు నెలల్లో రోజువారీ 45,000 బ్యారెళ్ల గరిష్ట ఉత్పత్తికి తీసుకెళతాం. చమురుతోపాటు 2 ఎంఎంఎస్‌సీఎండీ గ్యాస్ కూడా బయటకు వస్తుంది. వాస్తవంగా గ్యాస్ ఉత్పత్తిని 2024 మే నెలలో మొదలు పెడతాం. అప్పుడు రోజువారీగా 7-8 ఎంఎంఎస్‌సీఎండీ ఉత్పత్తి సాధ్యపడుతుంది''అని వివరించారు. వాస్తవంగా వేసుకున్న ఉత్పత్తి అంచనాల కంటే ఇవి తక్కువ కావడం గమనించాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చమురు ఉత్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో సహజ వాయువు ఉత్పత్తి పెరుగుతుందని పంకజ్ కుమార్ తెలిపారు.

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్).. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ప్రకటనను విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు, తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాలికలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

» **సీట్ల రిజర్వేషన్:** ఎస్సీ అభ్యర్థులకు 15%, ఎస్టీ అభ్యర్థులకు 7.5%, ఓబీసీ అభ్యర్థులకు 27%, దివ్యాంగులకు 3% సీట్లు కేటాయించారు.
» **వయసు:** ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలంటే.. మార్చి 31 నాటికి విద్యార్థి వయసు ఆరు నుంచి ఎనిమిదేళ్ల మధ్య ఉండాలి. రెండో తరగతి, మూడో తరగతిలో ప్రవేశానికి ఏడు నుంచి తొమ్మిదేళ్ల మధ్య, నాలుగో తరగతికి 8-10, అయిదో తరగతికి 9-11, ఆరుకు 10-12, ఏడుకు 11-13, ఎనిమిదికి 12-14, తొమ్మిదికి 13-15, పదికి 14-16 ఏళ్ల మధ్య ఇలా ప్రతి తరగతికి నిర్దేశించిన మేరకు వయసు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఎనిమిదో తరగతి వరకు ప్రవేశ పరీక్షలు ఉండవు. ప్రయారిటీ కేటగిరీ సిస్టమ్ ప్రకారం సీటు కేటాయిస్తారు. సీట్ల సంఖ్య కంటే దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ సిస్టమ్ ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. పదకొండో తరగతి ప్రవేశాలకు సంబంధించి పదో తరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతిలో సీట్లు మిగిలితే ప్రవేశాలు నిర్వహిస్తారు.
» **ఒకటో తరగతి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 27.03.2023.
» **ఒకటో తరగతి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 17.04.2023.
» **రెండో తరగతి, ఆపై తరగతులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది(పదకొండో తరగతి మినహాయించి):** 03.04.2023
» **రెండో తరగతి, ఆపై తరగతులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేది(పదకొండో తరగతి మినహాయించి):** 12.04.2023.
» **పదకొండో తరగతి రిజిస్ట్రేషన్ తేది:** పదో తరగతి ఫలితాలు వెల్లడైన 10 రోజుల తర్వాత నుంచి.
» **వెబ్‌సైట్:** www.kvsangathan.nic.in

సీయూఈటీ(పీజీ)-2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు(సీయూఈటీ) నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఒకే పరీక్షతో అన్ని జాతీయ సంస్థల సీట్లకూ పోటీపడే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా మొత్తం 142 విద్యా సంస్థలు పీజీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తోన్న విద్యా సంస్థలు, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు విద్యా సంస్థలలో ప్రవేశాలు పొందవచ్చు.

» **కోర్సులు:** ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎఫ్ఏ, ఎంపీఏ, ఎంబీఏ, మాస్టర్ ఆఫ్ వొకేషన్, ఎంఎడ్, ఎంఎల్ఐఎస్సీ, ఎంపీఈడీ, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంకాం తదితరాలు.
» **అర్హత:** ఇప్పటికే డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సుల్లో ఉన్న విద్యార్థులు సీయూఈటీ రాయవచ్చు. పలు కోర్సులకు ఏదైనా డిగ్రీ సరిపోతుంది. మిగిలిన వాటికి డిగ్రీలో సంబంధిత కోర్సు చదివినవారై ఉండాలి.
» **పరీక్ష విధానం:** పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 100 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. రెండు షిఫ్టుల్లో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ భాషల్లో (లాంగ్వేజ్, సాహిత్య పేపర్లు తప్ప) ఉంటాయి. ఇందులో పార్ట్-ఎ, పార్ట్-బి అనే రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-ఎ 25, పార్ట్-బిలో 75 ప్రశ్నలు వస్తాయి. పార్ట్-ఎలో జనరల్, పార్ట్-బిలో సంబంధిత సబ్జెక్టు ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.04.2023
» **వెబ్‌సైట్:** www.cuet.nta.nic.in

విశాఖపట్నం జిల్లా, అంగన్‌వాడీ కేంద్రాల్లో 47 పోస్టులు

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ విశాఖపట్నం జిల్లా, ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్, అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 47
» **పోస్టుల వివరాలు:** అంగన్‌వాడీ వర్కర్-05, అంగన్‌వాడీ హెల్పర్-42.
» **ఐసీడీఎస్ ప్రాజెక్టు పేరు:** పెందుర్తి,విశాఖపట్నం, భీమునిపట్నం.
» **వయసు:** 01.07.2022 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.11,500, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.7000, అంగన్‌వాడీ హెల్పర్‌కు రూ.7000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విశాఖపట్నం జిల్లాలోని సీడీపీవో కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 03.04.2023.
» **వెబ్‌సైట్:** www.visakhapatnam.ap.gov.in

ఇంటర్‌తో 'అగ్నివీర్‌వాయు'

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. మహిళలు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ, ఫిజికల్, మెడికల్ టెస్టుల్లో అర్హత సాధించిన వారిని ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయుగా తీసుకుంటారు. ఈ విధంగా ఎంపికైన వారు నాలుగేళ్ల పాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలు అందించే అవకాశం లభిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయుకు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

» ప్రకటన విడుదల చేసిన ఎయిర్‌ఫోర్స్

ఎయిర్‌ఫోర్స్‌లో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో అగ్నివీర్‌వాయు ఖాళీలున్నాయి. సైన్స్ విభాగంలోని పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు నాన్ సైన్స్ ఖాళీలకు పోటీ పడవచ్చు. ఇందుకోసం వీరు ప్రత్యేక పరీక్ష రాయాలి.

సైన్స్ విభాగం

ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచీల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఏ విద్యార్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. టెన్త్/ఇంటర్/డిప్లొమా/ఒకేషనల్‌లో ఇంగ్లిష్‌లో 50శాతం మార్కులు పొందడం తప్పనిసరి.

నాన్ సైన్స్ విభాగం

ఏదైనా గ్రూప్‌తో ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండేళ్ల ఒకేషనల్ కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఏ అర్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ..టెన్త్/ఇంటర్/ఒకేషనల్ ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. **వయసు:** 17 1/2 నుంచి 21 ఏళ్ల లోపు ఉండాలి. డిసెంబర్ 26, 2002– జూన్ 26, 2006 మధ్య జన్మించినవారు అర్హులు. అన్ని విభాగాలకు పురుషులు 152.5 సెం.మీ. మహిళలు 152 సెం.మీ ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు ఛాతీ వ్యత్యాసం 5 సెం.మీ ఉండాలి.

ఎంపిక ఇలా

మూడు దశల్లో నిర్వహించే అర్హత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇందులో రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టులుంటాయి. ఈ మూడింటిలో అర్హత సాధించిన వారినే మాత్రమే తుదిగా ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఫేజ్-1 రాత పరీక్ష

రాత పరీక్ష ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. నాన్ సైన్స్ అభ్యర్థులకు పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. సైన్స్, నాన్ సైన్స్ రెండింటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష సమయం 85 నిమిషాలు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి.

అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. అలాగే తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్‌ఈ 10+2 స్థాయి నుంచి అడుగుతారు. ఎంపిక చేసుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్ -20, ఫిజిక్స్-25, మ్యాథ్స్-25, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు వస్తాయి.

ఫేజ్-2.. ఫిజికల్ ఫిట్‌నెస్

ఫేజ్-1లో భాగంగా నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ చూపించిన అభ్యర్థులకు మాత్రమే ఫేజ్-2కు అవకాశం ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు ప్రవేశ పత్రాలతోపాటు అవసరమైన సర్టిఫికేట్లు, వాటి జిరాక్స్ సెట్, ఫోటోలు తదితర అవసరమైన పత్రాలను తీసుకెళ్లాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా అభ్యర్థులకు 1.6 కి.మీ దూరాన్ని పురుషులు 7, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటి నిమిషం వ్యవధిలో 10 పుష్‌అప్స్, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్‌అప్స్, నిమిషంలో 15 స్క్వాట్స్ పూర్తిచేయగలగాలి. వీటిల్లో అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్టు-1 నిర్వహిస్తారు. అభ్యర్థి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగానికి సరిపోతాడా లేదా అనేది నిర్ధయించడానికి ఆబ్జెక్టివ్ తరహాలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులోనూ అర్హత సాధించిన వారికి అడాప్టబిలిటీ టెస్టు-2ను నిర్వహిస్తారు. ఈ దశలో అభ్యర్థి వాయుసేన వాతావరణానికి అలవాటు పడగలడా లేదా పరిశీలిస్తారు.

ఫేజ్-3

అడాప్టబిలిటీ టెస్టులోఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణ, నాలుగేళ్ల విధుల నిమిత్తం తీసుకుంటారు.



ఎయిర్‌ఫోర్స్ జాబ్స్

రాత పరీక్ష ప్రిపరేషన్ ఇలా

అభ్యర్థులు మ్యాథ్స్, ఫిజిక్స్ విభాగాల్లోని అంశాలను ఎంసెట్ స్థాయిలో ప్రిపేర్ అయితే మంచి ఫలితం సాధించవచ్చు. దీంతోపాటు వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. దీని ద్వారా నిర్దేశిత సమయంలోపు పరీక్ష పూర్తిచేయగలుగుతారు. అంతేకాకుండా ఎక్కడ తప్పులు చేస్తున్నారో తెలుస్తుంది. ఇంగ్లిష్‌కు సంబంధించి వ్యాకరణాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రీజనింగ్ విభాగంలో మాదిరి ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి ఇటీవలి కాలంలో రక్షణశాఖలో తీసుకొచ్చిన నూతన సాంకేతికత, ఈ విభాగంలో చోటుచేసుకున్న కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు స్పోర్ట్స్, అవార్డ్స్, బుక్స్, ఎన్నికలు తదితర తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

అగ్నివీర్‌వాయు ప్రోత్సాహకాలు

అగ్నివీర్‌వాయులో ప్రవేశం పొందిన వారికి మొదటి ఏడాది ప్రతి నెల రూ.30,000, రెండో ఏడాది ప్రతి నెల రూ.33,000, మూడో ఏడాది ప్రతి నెల రూ.36,500 చెల్లిస్తారు. నాలుగో ఏడాది ప్రతి నెల రూ.40,000 చెల్లిస్తారు. వీరికి వార్షిక సెలవులు 30 ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్ లీవ్‌లు కూడా ఇస్తారు. నాలుగేళ్ల సర్వీస్ కాలంలో రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గాను వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు సర్టిఫికేట్ అందుతుంది. వీరికి పింఛను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్‌పీ),ఎక్స్‌సర్వీస్‌మెన్ హోదా ఇవేవీ వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు.

సేవానిధి

ప్రతినెల అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమచేస్తారు. మొత్తం నాలుగేళ్ల కాలానికి గానూ సేవనిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని వేతనం నుంచి జమవుతాయి. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ జమచేస్తుంది. రెండు కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని జతచేసి, అగ్నివీర్‌వాయుకు అందజేస్తారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయి వైదొలగిన వారికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. వీరికి కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయి. నాలుగేళ్ల సర్వీస్‌లో మధ్యలో కావాలంటే వైదొలిగే అవకాశం కూడా ఉంటుంది. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమ అయిన మొత్తాన్ని అగ్నివీర్‌వాయుకు అందిస్తారు. కాని ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం మాత్రం దక్కదు.

ఉద్యోగంలో ఇలా

అగ్నివీర్‌వాయు స్కీంలో భాగంగా నాలుగేళ్ల సర్వీస్‌ను పూర్తిచేసుకున్న అగ్నివీర్ వాయు ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్టంగా 25 శాతం మందిని మాత్రమే శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు.

పదోన్నతులు

సంబంధిత విభాగంలో విధుల్లో పనిచేసే వారు భవిష్యత్తులో ప్రమోషన్ల ద్వారా మాస్టర్ వారెంట్ ఆఫీసర్(ఎండబ్ల్యువో) స్థాయి వరకు చేరుకోవచ్చు. అంతేకాకుండా సర్వీస్‌లో కొనసాగుతూ సంబంధిత పరీక్షల్లో అర్హతలు సాధించిన వారు కమిషన్డ్ ఆఫీసర్లు కావడానికి అవకాశాలు ఉన్నాయి. అలాగే ఉద్యోగం చేస్తూనే నిర్ణీత వ్యవధిగల ఉన్నత విద్యను కొనసాగించడానికి కూడా అనుమతిస్తారు. పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగం కొనసాగవచ్చు. అనంతరం పింఛను, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2023, మార్చి 31
- **ఆన్‌లైన్ పరీక్షలు:** 2023 మే 20 నుంచి
- **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.